<u>అక్షరాల బంగారయ్య</u>

బంగారయ్య పడిపడి రాత్తండు. దించిన తలె త్తుత లేడు. పక్కకు సూత్తలేడు. ఏదో సాధించాలన్న తపన కచ్చితంగుంది. వ్యాసం రాసెదానికి అతనికిచ్చిన సమస్య లోతుల్లోకి వోయినట్టుంది. సెమటలు కారుతున్నయి. లెక్కసేత్త లేడు. తను రాత్తున్న పేపర్ మీద సెమట సుక్కలు ఇగ పడుతాయనంగ ఎడుమ బుజానికి నుదురును తుడ్సుకొని మల్ల సమస్యను రాయటాన్కి మన్సు వెట్టిండు. తన పక్కోడు ఇతన్నే సూడవట్టె.

సానమంది రాత్తండ్రు. కాని ఒక్కలన్న హుసారు లేరు. ఉత్సాహం లేనట్లుంది. కొంత మంది ఆలోసన్ల వడ్డరు. పెన్నులను పెదువుల మీద ఆడించుకుంటండ్రు. కొందరికి పెన్ను కదలక పొంచులు సూత్తండ్రు. బంగారయ్య కలమైతే ఆగుతలేదు. పంతులయ్య బంగారయ్యనే గమనిత్తండు. "కొంపదీసి మనమిచ్చిన సమస్య ఈడికి ముందే తెల్సి సిద్ధమై అచ్చిండో ఏమో? " అనే అనుమానం అచ్చిందతనికి. కాసేపు తనను తాను సంబాలించుకొన్న మాష్టారు. కానీ అనుమానం. "ఆడికెట్ల తెలుత్తది, సమస్యను నేనేకదా తయార్జేసింది. నాకు ఆడికి ఎప్పుడూ మూడు మీటర్ల దూరం కచ్చితంగా ఉంటుంది. అంత దూరం నించి ఈ సమస్యను సూసి తెల్సుకోవడం అసంభవం" అనుకున్నడు.

బంగారయ్య రాసే రాత మాస్టారును కుర్సీమీద కూసోనివ్వలేదు. "కొంపదీసి ఈడికే మొదటి బహుమతి అచ్చేటట్లుంది, ఏం రాత్తండో గాని గెలుపీనిదే అయేటట్టుంది." అనుకుంటండు. 'నేనిచ్చిన సమస్యకు రాసి ఈడు గెలువడమేంటి? ఒక్కసారి గుండె లయ తప్పినట్టయింది. గొంతులో సరాన పడ్డది. సిగరేటు తాగినా మాస్టారు మనసు ఇపరీతమైన ఆందోళనలకు గురవుతోంది.

బంగారయ్యకు తెలుగు అక్షరాలను గురించి ఆటి పొందిక గురించి ఆలోచించే అలవాటుంది. అది బయట పెట్టే టైమచ్చింది. "తెలుగు లిపిలో తేవల్సిన సంస్కరణలు" అనే అంశాన్ని వ్యాసరచన పోటీగా పదవతరగతి విద్యార్థులకు మాష్టారు రాయమని ఇచ్చాడు. ఒక గంటలో రాసి ఇవ్వాలె. ఉత్తమ రచనకు బహుమతులు ప్రకటించారు. టైము ఇంకా ఐదు నిమిషాలే ఉంది. బంగారయ్య తాను రాసిన వ్యాసాన్ని ఒక్కసారి తేరిపార సూసుకున్నడు.

"వెయ్యేండ్ల నించే రాత ఉంది. బౌద్ధమతం వల్ల అది వ్యాప్తి సెందింది. దేశ భాషలందు తెలుగు లెస్స బరాబరే, కానీ రాత పూతలందు మాత్రం కాదు. "ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్‌గా" ప్రపంచ ఖ్యాతి పొంది ఆంగ్ల, ఫ్రెంచ్ భాషలకన్న గొప్ప పేరు సంపాదించుకున్న భాష తెలుగు. దేశంలో రెండవ భాషగా ఉంది. కానీ నేటికీ పాలనా రంగంలో, బోధనలో అనుకున్న స్థానాన్ని పొందలేదు? ఎందుకు?. భాషా ప్రయుక్త రాష్ట్రంగా మొదటి స్థానంలోనున్న మాతృభాషలో బోధన జర్గుతలేదు. ఎందుకు?, తెలుగు భాషాభివృద్ధి నత్తనడక నడ్డుందెందుకు?, దేశంలో అనేక విశ్వ విద్యాలయాల్లో తెలుగు భాషాబోధన జరుగుతుంది. 0 గానీ తెలుగు అధికారభాషగా తెలుగుదేశంలో సెలామని అయితలేదెందుకు? కనీసం పాలనా రంగంలో నన్నా భాషా ప్రాధాన్యత లేదెందుకు? ఎన్నో కమీషన్‌లు మాతృభాషలో విద్యాబోధన జర్గాలన్నయి, కానీ జర్గుతలేదెందుకు? రాష్ట్ర విద్యాకమిటీలు, తెలుగు లోకం ఈటన్నింటిని గమనించాల్సిన అవసరం ఉంది.

దరిదాపు వెయ్యేండ్లుగా మన లెక్కలో అచ్చరాలు ఆడుకలో ఉన్నయి. ఆటిలో రుజువు (శాస్త్రీయత) లేదు. శాస్త్రీయ లోపాలున్న మాట ఇంగిత జ్ఞానమున్నోళ్లు ఒప్పుకుంటరు. అక్షరాల్లో సమానత్వం కూడా లేదు. సుతారంగా రాద్దామంటే అనువుగాలేవు. అట్వంటి అశాస్త్రీయతను తుడిపేసి, సౌలభ్య సౌకర్యాలు కలిగించు కోవడం ఎంతైనా అవసరం.

బంగారయ్య వ్యాసం సానా అచ్చోసినట్టు రాశాడు. మొత్తానికి తెలుగు అక్షరాలు ఇరవైఐదేనని సూపించాడు. ఆ వ్యాసం సూత్తె ఇన్విజిలేటర్ సొమ్ము రోగమొచ్చి పడిపోవడం ఖాయం.

బంగారయ్య ఇప్పుడున్న లిపిలో ఒత్తుల పద్దతి సరిగ్గా లేదంటాడు. ఆటిని తీసేత్తే హిందీలో, ఇంగ్లీషులో ఉన్నట్లే మన భాషకూడా ఉంటదంటడు. ద్విత్వాక్షరాల్లో పూర్వం అనగా ముందు రాసేది అప్రధానం, రెండవదే ప్రధానమైంది. ముందటిది పాణం లేనిది. తరువాతదే పాణమున్నది. కనుక పాణమున్నదానికే గుణింతాలు, ఒత్తులివ్వాలి. ఇది తెలుగు తప్ప ఏ భాషలోనైనా కనపడుతుందంటడు.

టైమైపోయింది. తన వ్యాసాన్ని మాస్టారుకిచ్చి బయట కొచ్చిండు. అందరి సూపు బంగారయ్య మీదే ఉంది. బహుమతి వారి వారి ఊహల్లోంచి బంగారయ్యకే ఇచ్చేశారు. బంగారయ్య కళ్లముందు తను రాసిన అక్షరమాలే తిరుగుతంది.

అ అ। తి తీ। ఉ ఉ। తె తె। తొ తొ। వీటిని గమనిస్తే ఒకటే **అ** అనే అచ్చరం నేర్సుకొని దానితో పాటు ా ు ె ౌ **।** **ఈ ఐదు** గుణింతాలను నేర్చుకుంటే సరిపోతుంది. లేదా రెండవ పద్ధతిలో ...

అ ఇ ఉ ఎ ఒ – । ం

క గ చ జ ట డ త ద

న ప బ మ య ర ల వ స

ఈ ఇరవైఐదు అచ్చరాలు నేర్సుకుంటే తెలుగు అచ్చరాలను సాధించవచ్చునన్నాడు బంగారయ్య. రెండు గీతలను (ఐఫన్లను) లెక్కలోకి తీసుకొనకపోతే ఇరవై మూడు

అచ్చురాలే.

అ=అ	క=క	ట=ట	ధ=ద।	ర=ర
ఆ=అ।	ఖ=క।	ఠ=ట।	న=న	ల=ల
ఇ=ఇ	గ=గ	డ=డ	ప=ప	వ=వ
ఈ=ఇ।	ఘ=గ।	ఢ=డ।	ఫ=ప।	స=స
ఉ=ఉ	చ=చ	ణ=న।	బ=బ	శ=స।
ఊ=ఉ।	ఛ=చ।	త=త	భ=బ।	హ=వ।
ఎ=ఎ	జ=జ	థ=త।	మ=మ	ళ=ల।
ఏ=ఎ।	ఝ=జ।	ద=ద	య=య	
ఒ=ఒ	ఓ=ఒ।			

వీటిలో తీసివేయ వలసిన అచ్చురాలు ఖ, ఘ, ఙ, ఝ, ఞ ఠ, ణ, థ, భ, ళ, శ, ష, హ,క్ష, ఱ. వీటిని తీసివేసిన తర్వాత కేవలం రెండు గీతలతో (ఐఫన్లతో) తెలుగు అచ్చురాల్లో మార్పుతీసుకొచ్చి అనేక రకాల ప్రయోజనం పొందచ్చునని నిరూపించాడు. ఎట్లాగు అడ్డపు గీత దీర్ఘంగా అశోకుని కాలంనించి వాడుకలో నున్నది. మన తెలుగులో సాధారణంగా ఎక్కువచ్చేవి తలకట్టు గల అచ్చురాలు. దాదాపు దేశంలో అన్ని లిపులలో ఇతర అచ్చు గుర్తులను గుణింతాలను తలకట్టు గల అచ్చురాలకే చేరుస్తున్నారు. తెలుగులో మాత్రం ఈ పద్ధతిలేదు. గనుక అచ్చర రూపం సెడకుండా, రాతలలోనూ, అచ్చులలోనూ అచ్చర సరూపాలకు దగ్గర సంబంధాన్ని మార్పు జేసిందు బంగారయ్య.

లిపి సరూపం సెడకుండా సేసిన ఈ సంస్కరణ టైపు రైటర్‌కు, ముఖ్యంగా ముద్రణా సంస్థలకు, యజమానులకు సాధ్యమైనంత అనుకూలంగా సేసిండు. ఈ సంస్కరణ వల్ల జాగ సాన కలిసొచ్చిద్ది. సుతారంగా నేర్వచ్చు. మంచిగా దబదబ రాయచ్చు. బాగా అనుకూలంగా సేసానని మురిసి పోతున్న బంగారయ్య కు మనసు కకలా ఇకలంగుంది. ముద్దెర గొట్టే సేట్లు, అధికారులు పాలక పచ్చం, తెల్సుకొని తెలుగు లిపిలో ఈ సంస్కరణను ఎందుకు సెయ్యటం లేదని మన్ను నొచ్చుకున్నడు. బంగారయ్య పిచ్చి కాకపోతే, ఏదైనా కొత్త సరూపం లిపిలో రావాలంటే కొన్ని తరాలు గావాలెననే మన్ను అతనికి రాకపాయె.

ఆదరా బాదరా పంతులు లోనికెల్లి అల్మార్లో పెట్టుకొని బయటికొచ్చిండు. బంగారయ్యను పిలిసి "అచ్చురాలు రాసావుగాని గుణింతాలు ఎట్లారాయాలో ఎందుకు సెప్పలేదని" అడిగిండు. 'అవికూడా ఎనుకదిక్కు రాసానుసార్' అని ఎంతో ఇనయంగా సెప్పినా పంతులుకు మాత్రం కడుపులో కాలినట్లైయింది. మొకం మాడ్సుకొని ఎన్కకు జూడకుండ పోయిండు. ఇరువై ఐదు అచ్చురాలతో పిల్లలు అచ్చురాలు జెల్ది నేర్సుకుని ఈ స్పీడుయుగానికి అనుకూలంగా నడ్సుకొంటారని, పిల్లలు 'ఇ' ని నేర్సుకున్నంత సులువుగా 'ఈ'ని నేర్సుకోరు. కాని సంస్కరణ పొందిన తన లిపిలో 'ఇ' ని ఎంత సుతారంగా నేర్సుకుంటారో, 'ఈ' కూడా అంతే సులువుగ నేర్సుకుంటరు. పిల్లలు జెల్ది నేర్సుకొనే బాగ్యం ఉంది. గుణింతం సాలా సులువుగా నేర్సు కోవచ్చునని, పరీచ్ఛ సూసైటైన (ఇన్విజిలేటర్) కూడా సోచాయిస్తే బంగారయ్య సంతోస పడ్డడు. బంగారయ్య గుణింతాన్ని వివరిస్తూ... అచ్చురాల్లో ఒత్తులచ్చినపుడు సంయుక్తాక్షరాలచ్చినపుడు, గుణింతమచ్చినపుడు, ఎలాంటి మార్పులు ఉండటం అవసరం లేదని, కట్టమనిపించదని రుజువు సేసిండు.

v v v

సీకటివడంగ బంగారయ్య ఇంటికి వోయిండు. ఇంటి ముందట బంగారయ్య తండ్రి ఎల్లయ్య సిన్న గొడ్డలి పట్టుకొని నిలబడ్డడు. తుమ్మ ముండ్ల పొరుకను పొయ్యిలకు సిన్న సిన్నగా కొడుతండు. అయ్యెక్కడ తిడుతడోనని దొంగ దొంగ సాటుగా తండ్రికి అగుపడకుండా ఇంట్ల దూరిండు. తండ్రిని కనిపెట్టుకుంట ఎల్లిన బంగారయ్య మోకాలు తగిలి బొడ్డుగిన్నె కుండ మీంచి కిందవడింది. ఎల్లయ్య సప్పుడిన్నడు. కుక్క ఇంట్ల సొచ్చిందనుకొని అడియె, అడియె అని అరుసుకుంట ఇంట్లకెల్లి సూత్తే కొడుకు. కొడుకును సూసెటాలకల్ల ఎనలేని కోపం ముంచుకొచ్చి, కొడుకు జుట్టందుకొని గొర్ర గొర్ర గలమ దాకా ఈడ్సుకొచ్చిండు. "దొంగ నా కొడుక, ఇవ్వార్దాక ఏడబొయినవ్" అని వంగబెట్టి నాలుగైదు గుద్దిండు. బంగారయ్యకు నిముషం పాటు ఊపిరాళ్ళె. 'నిన్ను ఇట్ల గాదురా ముంత పొగపెట్టి యాలాడదీత్తనని తాడును ఎతకవోయిండు. బంగారయ్య బయటికురికిండు. బొచ్చంత ఎగబోసి భోరున ఎడ్తాండు, ఇంటి ముంగట బాయికాడ ఉన్న తల్లి గమనించింది. తల్లి సిల్లులు వద్ద బకీటతో నీళ్ల మోత్తంది. అది తడుకల తో సేసిన బాతు రూము. బంగారయ్య ఏడ్వటం సూసింది. తన భర్త కొడుకును కొడ్తండని అర్థం అయింది. 'ఓ పోడ' అటు మోకాన ఉర్కు, మల్లగిట్ల ముంతపొగ పెట్టగల్ల బెదిరించింది. ఆమె సిల్లులు వద్ద బకీట్ల నీళ్ల వట్టుకొని పోతుంటే, అంకలంకలు పద హారంకెల్లా అన్నట్టు నీళ్ల సారలు పడుతున్నయి. బంగారయ్య కండ్లు తుడ్సుకొని తండ్రి దిక్కు సూసిండు. తండ్రి బయటికచ్చెసరికి కనపడకుండ వోయిండు. తండ్రి ఎంటవడ్డడు. ఆగరా! ఓ బద్మాష్, ఆగరా... అని ఎంబటుర్కిండు. ఉరకంగ ఉరకంగ జాలారి కాలువ పొంటి తండ్రికి పెద్దముల్లు గుచ్చింది. "అన్నన్న.. ఆయి..నీ యవ్వ' అని బాధతో కింద కూలవడ్డట్టు కూసుండు. "నిన్నిడిసి పెడతానా, నా తనువొయ్యినా మంచిదే... ఏడవంటవో పండు... రేప్పొద్దుగాల నీ పొగరంచపోతే ఖైంచత్, నేను పులాల

పోసిగానికే పుట్టలేదనుకో" అని గుడ్లెల్ల వెట్టిండు. తండ్రి కొడుకు లెక్కడికి పోయిరోనని కొంరు కూడా బయల్దేరింది.

ఇంటింటికో జాలారి ఉన్నది. కొంతమంది కానగడ్డి తడుకలతో బాత్‌రూమును కట్టుకున్నరు కొంతమంది ఏవో రెండు బండలు వేసుకొని, ఆ బండలపక్కన రెండు కుండలు పెట్టుకున్నరు. అదే వాళ్లకు బాత్‌రూం. జాలర్లనన్నింటిని కలుపుకుంట ఓ కాల్వ ఇండ్లనడుమ నించే పడమటికి పారుతంది. ఆ కాలువ పక్కనించే భర్తను, కొడుకును సూసుకుంట బోతంది. ఎల్లయ్య తోళ్ల దూడయ్య బొక్కల గూడు పొంటి కూసుండి తిడుతండు. అటు బొక్కల కంపు. ఇటు జాలరి రొచ్చు. కుడి కాలును ఎడమ కాలు మీద పెట్టుకొని ఇరిగిన ముల్లును, ముల్లుతో తీసుకుంటండు. ఆ ముల్లు అరికాలు లోతులో కుచ్చుకొని ఇర్గింది. ఎంతకు బయటకత్తలేదు. దాంతో ఎల్లయ్యకు మరింత కోపం ముంచుకొచ్చి.. "వీడు నా కడుపున సెడబుట్టిండు." పందిగున్న లెక్కున్నడు. నాకెం దొరుకుతడు?' అని తిట్టుకుంట మల్ల పాదాన్ని సూసుకుంటండు.

కొంరు భర్తను సూసింది. దగ్గరకు సేరుతూ... 'సరేగాని తియి, ఆ బుద్ధి ముందెటువాయె? ఆనెంబటి అయిసోని లెక్కన ఉరికితివి సూసేటోళ్లంతా పెద్ద పెద్ద మీసాలు తిప్పుకుంట పోరనిమీద పొగరు నూపెడుత ఎట్ల అని ముక్కునేలేసుకుంటద్రు. గోసి ఊసిపోంగ కూడా ఆన్ని తరిమితివి. ఈడ ఈ బొక్కల కాడ కూలబడితివి. ఏమన్నచ్చిందా? ఆన్ని సూడంగానే సైసవయితివి. నీ కండ్లల్ల కంపగొట్ట" అని తిట్టుకుంట దగ్గరికచ్చింది భార్య.

ఆమె మాటలతో భర్తకు మరింత కోపమచ్చి 'గుర్రం బలిసినట్టు బలసినవు..., నిన్ను తంతె ఆనికి బుద్ధత్తదే" అని కసురుకున్నడు. "వాడైతే రానియి, ఆన్ని నిన్ను ఒకలమీద ఒకల్నేసి, సింత బరిగెలతో సంపనే!" అని అంటుంటే, నోట్లో పొగాకు తుప్పుళ్లు బయట పడుతున్నాయి.

'మా సరెగాని తియ్యి, ఎవారం ఏడ్చినట్టే ఉంది' అని, బొడ్లొ సెక్కి ఉన్న సెయిసంచి దీసింది. అందులోనించి సిమ్మట దీసి కూసున్నది. అతని కాలును తన మోకాలు మీద పెట్టుకొని ముల్లు తీద్దామని తండ్లాడింది. కానీ ఎంతకూ ఆ ముల్లు రాలేదు. "నాయెత్తు పెరిగిండు కొడుకు, అంతెత్తు కొడుకును పట్టుకొని ఇండ్లసుట్టు తిప్పుకుంట కొడితె, ఆని సదువేం గావాలె!" నని కన్నీరు మున్నీరైంది.

"సదువూ...... సదువూ నీయవ్వ సదువనీ పొద్దాక సదువైతే కడుపులకెల్లత్తదే... లోకమంత నీ కొడుకు లెక్కనే సెత్తండ్ర. నువ్వు నార సీరుతాంటే, గాడు తాడు ఏత్తే, ఓ నాలుగు రాళ్లయినా అత్తయి కదా!, ఓ రెండు తాళ్లేసినా సోడు జొన్నలచ్చుకదే! ఏందింటమే? రేపు అండిపెట్టు, నువ్వు నీ కొడుకు బాగా తినుండ్రీ ! ఒసే... ఇంకోపారి సదువంటే, సీర పేండ్లు రాలాలె ఎరుకుందా" అని ఏలెత్తి హెచ్చరించిండు.

తోళ్ల దూడయ్య ఇంట్లకు వోయి, దీపం దెచ్చింది. ఎల్తురు అరికాలికి దగ్గరగా ఇర్గినముల్లు కనబడేటట్లు పెట్టింది. ఒకటికి రెండుసార్లు ఉమ్ముతో తడివెట్టింది. సనువాలువిండి ముల్లిరిగినకాడ పోసింది. కనపడ్తంది గానీ ఎంత తీసినా ఇరిగిన ముల్లు బయటికత్తలేదు. కొంరుకు కోపమచ్చింది. "నీ నానం నరుక, ఎంతసేపు పోరని మీద నా మీదే ఏడుత్తవ్. పట్టు, పట్టు, ఇది కనపడత లేదు, అత్త లేదుపా!" అని తన మోకాలు మీదున్న కాలును కిందికి తోసింది. "రేపు తీసుకుంట మాయె పా!" అని ఒకల్నొకలు తిట్టుకుంట ఇల్లు జేరింద్రు. రాత్రంతా ఇద్దరికి కలత నిద్రే అయింది.

v v v

కరకరమని పొద్దువొద్దంది. దరంభాయి గిర్కల సప్పుడు మొదలైంది. ఇగ తెల్లారినట్టేనని అనుకున్నడు ఎల్లయ్య. నిన్న ఇరిగిన ముల్లు, పక్కనించి లేవనియ్యక పోయినా బలవంతాన లేసిండు. కాలు ఉబ్బింది. అయినా సరే లెక్క సెయ్యలె. ఇయ్యాల లేదులేదంటే పది తాళ్లన్నా పేనాలెనని పట్టుదల అతనిలో బిగుసుకు పోయింది. సినిగిన పంచెను ముడ్డికి గట్టిగ కట్టుకున్నడు. మెల్లగా గుడిసెలో నించి వంగి బయటకచ్చిండు. నోట్ల సుట్ట పెట్టి గప్పగప్ప తాగి పొగ బయటికి ఊదిండు. మెల్లగా ఎడమదిక్కు గద్దెమీద కిందికి జూసిండు. సూరుకింద కొడుకు పండుకొని ఉన్నడు. చేతులు తొడల సందున పెట్టుకొని ఒక పక్కకు పండుకొని ఉన్నడు. అనుకుతండు. ఎల్లయ్య గుండె తరుక్కుపోయింది. నోట్లో సుట్టను గద్దెమీద పారేసి వంగిండు. అతని నడుము చిటుకు చిటుకు మని సప్పుడయ్యింది. అనుకుతున్న కొడుకును సూసేసరికి దుక్కముప్పొంగి కట్టలు కట్టుకొచ్చింది. ఎల్లయ్యకు కాలు కదలితే నొప్పి పుడ్తంది. అయినా లెక్కజెయ్యలె. కొడుకుమీద పడి ఏడ్సిండు. కొడుకును లేపి తల నిమిరిండు. గద్దెమీద కూలవడ్డడు. తన కడుపులోకి కొడుకును తడుముతూ "మన బతుకు ఒక బతుకు కాదురా? కాయలు గాసిన సేతులే మనకు ఆస్తిరా! సేసుకుంటే తప్ప కడుపు సల్లబడని బతుకు కొడకా!" అని బోరున ఏడ్సిండు. బంగారయ్య తల కిందికేసు కున్నడు. తండ్రి పాదాల వైపు సూసిండు. కాలు ఉబ్బి ఉన్నది. అది సూసే సరికి నిద్రమబ్బు మాయమైంది. గద్దె దిగి కింద కూసున్నడు. ఎంటనే తండ్రి కాలు తన మోకాలు మీద పెట్టుకొని, తన అంగికి పెట్టుకొన్న పిన్నీసు తీసిండు. మెల్లగా నొప్పిలేకుండా ముల్లును బయటికి తీసిండు. దబదబ ఇంట్లకెల్లి ఉప్పుదెచ్చి నమిలి, ముల్లు ఇరిగినచోట పెట్టిండు. కుంపటిలోనున్న పిడక అగ్గిని దెచ్చి కాసిండు. పది నిముషాలల్ల కాలు నొప్పి తగ్గిపోయింది. కొడుకు

పనితనాన్ని సూసిన తండ్రి లోలోపల గర్వపడ్డడు. తన కొడుకు పులి అనుకొని విర్రవీగిండు.రాత్రి జరిగిందంతా మతికి రాలేదు. తండ్రీ కొడుకులకు భవిష్యత్ కనపడ్డది.

v v v

కడిగిన మొకం మీద రూపాయి బిళ్లంత బొట్టు పెట్టుకొని బయలుదేరింది కొంరు. బంగారయ్య అద్దం తిరగిండు "అవ్వ!ఏదన్నా కూర జేసి పెట్టిపోయే" అడిగిండు.

"ఏం కూర లేదు బిడ్డా! పొద్దు వోయింది. నువ్వే మొకం గడుక్కొని, సీ గుడ్లున్నయి అవి అట్టు వోసుకొని తిని బడికిపో బిడ్డా!" చెప్పింది తల్లి. కంకగుల్ల, మొక్కిసాట, సుట్టవట్ట వెట్టుకొని దుబ్బలదిక్కు నడిసింది. ఓ పోరడు పాత సైకిల్ టైర్‌ను కట్టె పుల్లతో నూక్కుంట, నూక్కుంట ఉరుకుతండు. ఉరికి, ఉరికి, కొంరు కాళ్లమీద పడ్డడు. ఆ పోరన్ని లేపి, "మొద్దు మొకపోడ, తిన్నదరుగుత లేదా! నాకెదురయినవ్ ఏడన్నా కల్లం దొరుకుతదో లేదో! ఇయ్యాల ఏ కల్లం దొరక్కపోతే అచ్చినంక నీ పెండ్లి జేత్త" ననుకుంట ఎల్లిపోయింది.

బంగారయ్య ఇంటికచ్చి గట్టి తాలును ఎండ బోసిండు. (వడ్లల్లకెల్లి ఎల్లిన తాలును ఉడకబెట్టి, ఆరబోసి దంచితే తాలుబియ్యం (Boiled rice) వస్తాయి) అవి ఎప్పుడెండాలె, ఎప్పుడు దంచాలె, ఎప్పుడు ఉడకబెట్టు కొని తినాలెనను కుంట, బోరెం సంచిని దులిపిండు. ఆలోచనలతోనే ఇంట్లకు బోయి, బొంగుకు (వాసానికి) గట్టి పెట్టిన కోళ్ల తట్టనించి పిల్లల కోడిని కిందికి దించిండు. అది పది పిల్లలను జేసింది. ఇంకా ఆ పిల్లలు సరిగ్గా నిల్సుంట లేవు. ఇంకా ఐదు గుడ్లున్నయి. ఆ గుడ్లను ఊపిసూత్తే మూడు లొలొడమని లూజుగా ఉన్నయి. ఆటిని అట్టేసుకొని తినడమే బంగారయ్యకు శరణ్యం. ఏ ఇంటికి వోయినా ఎవ్వడు ఒక్క మెతుకు బెట్టడు. అన్ని సచ్చు సలహాలిత్తరు. నమ్మినోన్నే నాశనం జేత్తరు. ఏ కులపోడు దగ్గరకు రానియ్యని బతుకు. మాదిగ కులంలో బుట్టితి. ఈ కులం జేసిన పాపమేంటి? అబ్బో! ఇట్లా ఇసారించుకుంట గూసుంటే ఈ సీ గుడ్లను కూడా తిననియ్యడెవ్వడు?, ఈ సీ గుడ్లకు కూడా ధర కడితే! నా బతుకేంగాను?. ఒక్క క్షణం కూడా వేస్టు చెయ్యద్దనుకొని పక్కింటికెల్లిండు. సగం పగిలిన కుండను దెచ్చి పెనంజేసి పొయ్యిమీద వెట్టిండు. తండ్రి సిన్న సిన్నగా కొట్టిపెట్టిన కట్టె పుల్లలతో మంట బెట్టిండు. పావుసేరు సీసాలో ముత్తెమంత నూనె ఉంది. దానిలో కొంచెం నూనెను ఓ గుడ్డకు పూసి పొయ్యిమీద కాలుతున్న పెంకకు రాసిండు. మంట ఆరిపోయింది. పొగ గుప్పున గుప్పున పైకి లేత్తంది. వంగి మోకాళ్లమీద కూసొని ఊదంగ ఊదంగ బుస్సుమని మంట లేసింది. ఆ మంట సిటపటమని పెనాన్ని వేడెక్కించింది. ఈలోపు రాసిన నూనె పెంకకే అంటింది. అది రాయకపోతె అట్టు రాదాయె, దబదబ ముక్కుకు బట్ట కట్టిండు. ఈ సీ గుడ్డును పలగ్గొడితే బత్తి పేలినట్లు పేల్తది. పైగా కంపు వాసన. తప్పదు, తాను బతకాలి. ఎవ్వడు దగ్గరకు తియ్యని కులంలో పుడితే, ఏ వాసన లెక్క సెయ్యద్దు. తాను మురుగును, కంపును తిని పరిమళాన్ని సుగంధాన్ని ఆళ్లకు పంచాలె. అవును, నేటికి అదే జర్గుతంది. బంగారయ్యకు ఒకదిక్కు సంతోషం, మరో దిక్కు దుక్కం, బాధ, అధిగమించలేని పేదరికం. తండ్రి రాత్రికొట్టి, తెల్లవారి పడిన బాధ గురించి ఇసారం జేసుకుంట అట్టును సేసుకున్నడు. అవును వెదవ ప్రైజ్ కోసం ఒక్కరోజు దండుగ అయిపాయెనని అనుకొన్నడు. మళ్ల తనను తాను సమాధాన పర్సుకొని, అదివేస్టు ఎట్లా అవుతది. తాడేత్తే ఈ పూట నేను ఉపాసం ఉండక పోయేటోన్ని. కడుపు నిండా అన్నం తినేటోన్ని. మరి వ్యాసం రాయకపోతే ఈపూట సంతోషం ఉండక పోయేది. ఏది లేక పోయినా.. నాకే తిప్పల అని లోపల ఆలోసన్ల వడ్డడు. కొంత సేపటికి తను రాసిన వ్యాస రచన పోటీ గురించి యాజేసుకుంట – అవును, నేను కట్టపడి రాసిన వ్యాసానికి బహుమతి వస్తదా! అనుమానచ్చింది. మిత్రులంతా అనుకుంటంద్రు. నాకే బహుమతని. కానీ నేను మాదిగోన్ని కదా!....

ఆ బహుమతి తనకే ఇస్తారా?!!!! ఇవ్వరా?!!! అనుమానం బలపడ్తంది' అవును, ఇస్తారా... ఊహు... డౌటే... మంచిగా రాసానుకదా! .... ఇవ్వచ్చు. ఏదీ రాస్తేందీ అక్కడ కులం ప్రధానం. అతనిలో తర్జన భర్జనలు ఎక్కువైనై. ఈలోపు అట్టువోసిన సీ గుడ్డు బంగారయ్య నోట్లో లాల జల వూటలను పుట్టించింది. ఆ వాసన ఇల్లెనుక ఇల్లు, వాడెనుక వాడ, మొత్తం మాదిగ్గూడేనికి గుమాలించింది. పరిమలించింది.

సమాప్తం

ఈకథ 1998లో ప్రచురితం అయ్యింది.
మేమిట్లుండం కథా సంపుటి:
రచయిత – గుండెడప్పు కనకయ్య.
కాలం: 1986
వస్తువు, ఇతి: వీణవంక గ్రామం, మాదిగ గూడెం
ముద్రణ: 28–12–1998,
పబ్లికేషన్స్: ఏ.పి. దళిత్ రీసెర్చ్ సెంటర్,
ఎన్ ఆర్ ఎస్ : ఐ– 105,
యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ – 46

యక్షగానం

హే... కృష్ణా ముకుందా.... మురారీ... అనే పాటను, అల్లాహ్ అక్బరల్లాహ్... అనే నమాజుపాట ఇనపడకుండా జేసింది. ఆ ఎంటనే గంటమోగుతూ... నమాజును ఇనుపడకుండా జేసింది. సెర్సిల గంటేగుతంది. ఇంట్ల కూతకొచ్చిన కోడిపుంజు కూత వెడ్తంది. కూత కూత్తంది సగంలోని ఆపేత్తంది. సూరమ్మకు తెలివచ్చి లేలెమ్మని మాణిక్యాన్ని లేపింది. మాణిక్యానికి పిల్లలు పుట్టకపోతే సూరమ్మను కలిసింది. మాణిక్యం మట్టిలోకి జారిపోయిన మంచి మాణిక్యమే మట్టిలోకి తనకు తాను జారలే, జారేటట్టు సేసింగ్రు. మాణిక్యం లేవంగనే పక్కన బెట్టుకున్న బీడి కట్ట లోంచి బీడిదీసి కొసను కొంచెం కొరికి పారేసి నిప్పు అంటించిండు. తలజుట్టు నిండుగా ఉంది. జూలును వేషాలకోసం అందంగా పెంచిండు. బీడి తాగుతూనే బనీసు జేబులోంచి దువ్వెన తీసి, జూలును దువ్వుకొని లేసిండు. లూజుగానున్న లుంగిని బిగించి కట్టిండు, కిందనున్న బనీసు తీసి తొడుక్కున్నడు. దండెం కాడికొచ్చి బట్టల్లో సిక్కిన కండువదీసి బుజానేసిండు. మూలకు నిలబెట్టిన కట్టె పట్టిండు, సరాయించుకుంట బయటకొచ్చిండు. అటు ఇటు జూసి మూల సుక్కను జూసిండు. తెల్లారి నట్టేనని గుండె నిబ్బరం జేసికొన్నడు. తనుండేది పులివాడలో. బెల్లంపల్లి ఎల్లమ్మ ఇల్లు. సానాపెద్దిది, ఒక్కతే ముసలిదుంటది. ఆన్నుంచి గూడెం నడుమ నున్న ధరంబాయి దగ్గరికచ్చిండు. ఎవరి దగ్గరికెల్లితె బాగుంటదని! జెగ్రాలోసించిండు. మొదుగాలు మొదుగాల బిలాయ్ పోసయ్య ఇంటికెల్లాలని ఎర్రసట్టపోల్ల వాడకు నడ్సిండు. ఆ గూడెంలో అందరు దాసారపోల్లే కాని ఒక్కొక్కరికి ఒక్కొక్క పేరు సార్థకమైంది. బిలాయ్‌కి పోయచ్చాడు గనక ఆన్ని బిలాయ్ పోసయ్య అంటరు. ఆడు ఆ వాడకు పెద్ద మనిషి. సిమ్మన సీకటి. కట్టె భూమ్మీద పొదుత్తండు. ఆ సప్పుడిని కుక్కలు మొరుగుతున్నయి. మాణిక్యం ముసలోడు కాదు. నడి వయస్కుడు, ధైర్యవంతుడు. కుక్కలు మొరిగినా లెక్క జెయ్యకుండా పేట మధునని ఇల్లు దాటిండు. సిటుకారి కొంరని ఇల్లు కూడా దాటి కనపడుతున్న తోవొంటి బిలాయోని ఇంటికెల్లిండు. ఆని ఇంటి ముందటున్న జాలారిని కానక సరసర ఎల్లుతుంటే జాలట్లో కాలుపడి సర్రున జారింది. "అన్నన్నన్న..." అని నిలదొక్కుకొని, పడతాంటినె అనుకోంగనే జాలట్లో పక్కనున్న కుక్క గొంతంతా ఒకటి సేసుకొని జైయ్యిన మొరిగింది. ఒక్కదెబ్బకే తెలివచ్చిన బిలాయ్ పోసయ్య "అడియె అడియె నీయవ్వ తిన్నదరుగుత లేదే" ఇంట్లో నుంచే కుక్కను తిట్టిండు. ఎంటనే మాణిక్యం "ఓ పోసన్న నేను సింది మాణిక్యన్నచ్చిన, జెర ఇటేటు రాయె బాంచెన్" పిల్సిండు.

"ఏంది బిడ్డా గిప్పుడచ్చినవ్" అడిగిండు కడపకడ్డంగా పెట్టుకున్న గోనె సంచులతో కుట్టిన పరదను తొలగిస్తూ... వంగి మోకాళ్ల మీద సేతులు పెట్టి తొంగి సూసిండు. మాణిక్యం నెత్తిగోక్కుంట "ఇయ్యాల నా బత్తెం సెపుతె పున్నెముంటదన్న..." అడిగిండు.

"సరె అయిందానికి బిడ్డా ఐదుగురు పెద్దమనుషులను కూడా పిల్వు. ఏగిరంగా పిలుసుకురా! నేను ఏడు గొట్టంగా ఊరికిబోవాలే" తొందర బెట్టిండు బిలాయ్ పోసిగాడు.

"సరె, సరె పోసన్న జెరనువ్వెక్కడికి బోకు దండం బెడత. సిడిమలో ఆల్లందరిని బిలుత్త. నువ్వయితే మొకం గడుక్కొని గా సర్కారు బాయికాడుండు." అనుకుంట ముత్తెనవాడకెల్లి ముత్తనెల్లన్ని, మడిపెల్లి వాడకెల్లి రాజీరన్ని, నల్లోల వాడకెల్లి బందారు కొంరన్ని, పులి లింగన్ని పొద్దుపొడిసే సరికి ఐదుగురిని బాయికాడ సాపేసి కూసుండ వెట్టిండు. ఉల్లెంగల రాజిగాడు దున్నపోతుల పొలంకాడికి తోలుకొని పోతండు. ఆ దున్న పోతుల్లో ఒకటి సాపల గూసున్న పెద్దమనుషుల పక్కనే ఆగి పేడేసింది. పేడ కిందవడి అది అటిటు సిల్లుతంది. ఆదున్నోల్లు ఏమి లెక్కసేయలేదు.

"ఇగ ఇండ్ల దాసుదేంది అడుగరాదుర నీయవ్వ" అని మడిపెల్లి రాజీరు వేప్పుల్లతో పండ్లు తోముకుంట తుపుక్కున అటుదిక్కు ఊంచిండు. సర్కారుబాయి గిరకల సప్పుడు మొదలయింది. నీళ్లెత్తుకెళ్లే టోళ్లు ఒకొక్కరే అత్తంగ్రు పోతంగ్రు. బాయి ఇంటి ముందు పులి రామక్క మబ్బుతోటె లేసి అలుకు జల్లుతంది. మహేందర్‌రెడ్డి కైకిల్ల కూలీల కోసమచ్చి దారిన పోయెటోల్లందరిని అడుగుతండు.

"మల్ల కొత్తగా అడిగేదేంది గులాపోడా... పాతలెక్క లేదా" అని నిలుసున్న కనకడు జెర సిర్రుబుర్రులాడిండు.

సేతిలో తువ్వాల అటుఇటు తిప్పుతూ బరివాత ఉన్న ఒక పొల్లచ్చి బిలాయ్ పోసయ్య భుజం తట్టి "అవ్వరమ్మంటంది దాయె" అని రెక్కబట్టింది.

"ఆగు అయి పోయింది" బిడ్డ నాపుతూ పొగాకు నములుతూ తేపకు ముందు పక్కకు ఊంచుతున్నడు.

"ఏహె...అంతా మీరే మాట్లాడవడితిరి. ఆన్నిమాట్లాడనియ్యుర్రా" ముత్తనెల్లడు తన తెల్ల నల్లని మీసాలు సరిజేసుకున్నడు.

ఇంతలో "జెరపక్కకు జరుగుంగ్రి" మూడు బజార్ల కాన్నించి బతకడు కేకేసిండు. ఆ కేకకు ఆ దారినచ్చే ఎడ్లకు తొవ్విచింగ్రు.

"అరె మాణిక్యం పొద్దెక్కుతందిరా ఈల్లకేడ పనిలేనట్టుంది, నువ్వు జెల్దిజెప్పురా" బిలాయ్ పోసిగాడు తొందర వెట్టిండు.

"నీ దండం పెడుత ఓ పోసన్న జెర రాయో. లేస్తి వెందుకన్నా" పోసిగాన్ని పిల్సిండు మాణిక్యం.

"అవుతల బోలెడన్ని పన్లున్నయ్, ఈడ దీర్గిచ్చి కూసుంటే పన్లయితయా?" సూట్టానికచ్చిన ఈరస్వామి మొకం మీన అనేసిండు.

"జెర కోపం జెయ్యకంగ్రన్నా, తొందరపడితే ఎట్లన్నా" అని మొకాన్ని దీనంగా పెట్టిన మాణిక్యాన్ని సూసి, "ఇండ్ల దాసేదేందిరా పోయినేడియ్యలేదా ఐదు వందలు, ఇంటికడ్డెదు వడ్లు, ఇప్పుడుగదే ఇచ్చేది. ఎక్కువంటే యాడదెత్తం" అని తేల్చేసిండు బందారి కొంరడు.

"గంతేరా మాణిక్యం" మని వంతపాడిండు పులి లింగడు. సుట్ట సెంపలు లొట్టలు పోయే దాక తాగుతూ వాళ్ల పక్కనించే ఇంతలో ఒకలెనుకొకలు పాలెర్లందరూ పనికి ఎల్లుతంగ్రు. కొందరు "తేగం ఇంక తెగలేదా" అని అడ్కుంటవోతంగ్రు. ఆల్లనెత్తిమీద రుమాళ్లు, చేతిలో ముల్లు గట్టెలున్నాయి.

"గంతేరా మాణిక్యం" అని పెద్దమన్సులు తేల్చేసింగ్రు. అందరూ లేసింగ్రు. లేసిన పెద్ద మనుషులను జూస్తూ మాణిక్యం " అన్నలారా మరి బలి సంగేతేందని" అడిగిండు.

"బలి బలే ఐదుకతలు జెప్పు, బలిజెయ్యి, ఇగ అది తప్పుతదా? కతలు పంట కోతలయినంకనే మొదలు వెట్టు" అని ఈరస్వామి జెప్పటంలో అందరూ ఇంటి మొకాన వోయింగ్రు. మాణిక్యానికిచ్చే తేగం తెగింది.



యాసంగి కోతలైపోయినై. మాణిక్యం టైయానికచ్చిండు. బుచ్చయ్య తాత సింతసెట్టు కింద కతలు జెప్పటానికి సిద్దమైంగ్రు. ఆరు గుంజలు వాతింగ్రు. రంగు రంగుల ఒక పరదను గుంజల మీద కట్టింగ్రు. నడుమ అడ్డంగా ఇంకో పరదాను కట్టింగ్రు. ముందు భాగం స్టేజీ, ఎన్క భాగం సుతి పాడేటోల్ల కోసం. ఎర్రదానయ్య ఇంట్ల

ఏషాలు గడుతండ్రు. ఒక్కొక్క ఏషం బయట స్టేజి పరదా కాడికచ్చి వారి వారి నచ్చిన దేవున్ని మొక్కుకొని ఆ తర్వాతే ఏషం బయటకి అత్తది.మద్దెల, తాళాలు, గజ్జెలు కొట్టెటోళ్ళు, హార్మోన్యం వాయించేవాడు. ఇంకా రకరకాల వాయిద్యాలు వాయించుకుంట ఎన్క సుతి పాడేటోళ్లు సాప మీద కూసుండి ఉంటరు.

మొదుగాల మొదుగాల బుడ్రఖాన్ అచ్చి, ఆనాటి కతలో ఉన్నోళ్లను పరిసయం సేత్తడు. తనను తాను కూడా సూసేటోళ్లకు పరిసయం సేసుకున్నడు. కతలో ప్రధాన పాత్రధారి పరదా సాటునించి తన ఇష్టదైవాన్ని మొక్కుకున్నడు. తర్వాత తెరెన్క నించి "సేవకా.... " అని గట్టిగా గొంతెత్తి పిల్సిండు.

అది విని, పరద ముందున్న హాస్యగాడు "జీ....మారాజ్... సకల కళాకోవిదులు, సభికులు, సూసేటోళ్లు, ఇనేటోళ్లు తమ రాక కోసమై ఎదురుసూత్తండ్రు . మారాజ్ దయసేయండి, దయసేయండి" అని ఆహ్వానించిండు. ఎదురుసూసేటోళ్లతోటి సప్పట్లు కొట్టించిండు. రాజు పాటపాడుతూ పరదా దీసుకొని బయటకచ్చి... "రాజ వంశీయుడురా.. రాజరాజ మారాజిత నందన, రాజవీజైభవ రాజ వైంశీయుడురా..

శ్రీశ్రీ..రాజ వంశీయుడరా.. తకతక దిమితక, తకిటదిం, తకిటదిం, తకిట తకిట, తకిట్తోం, తకిట్తోం...శ్రీరాజ వంశీయుడురా" అని కత్తి దిప్పుకుంట ఎగరటం మొదలువెట్టిండు. కాలికి గట్టిన గజ్జెలు ఘల్లుఘల్లున మోగుతున్నయ్. తను పాడి ఆగింతర్వాత ఎన్కున్న సుతిపట్టెటోళ్లు సుతి అందుకొని అదే పాటను రాగ యుక్తంగా పాడుతండ్రు. పాడటం అయిపోయిన తర్వాత బుడ్రఖాన్ సూసేటోళ్లకు రాజును పరిసయం సేసిండు. అట్లాగే పాత్రలన్నింటిని పరిసయం సేత్తడు. రాజు పరద ఎన్కకువోయిన తర్వాత హాస్యం కొరకు గాని, ఇంకో ఏషం రావటాన్కి ముందుగాని, సమయానుకూలం కోసం గాని, హాస్యగాడు ప్రేక్షకులను తన ప్రతిభతో ఆశ్చర్యచకితులను సేయటం పరిపాటి. సమయ బావాన్ని పూరించటానికి పాటలను పాడుటగాని, కతలు సెప్పుటగాని జర్గుతుంది. దాన్లో భాగంగానే రాజు తెరెనక్కి వోయిన తర్వాత తెర ముందుకచ్చి ....

" తానె తందనానా దిమ్‌దిమ్ రాజవందనానా ॥2॥
అరెరె పొట్టోడు ఏందిరా...పొడుగటోడేందిరా...
ముడ్డి సుట్టు గజ్జెలున్న వాని పేరేందిర....॥తా॥
అరెరెరె.. పొట్టోడు ఉల్లిగడ్డ, ఒహో..హో..పొడగటోడు నెరుపకాయ
ముడ్డిసుట్టు గజ్జెలున్న వాని పేరంకాయ....య..య.. ॥తానె॥....
అరెరెరె...
ఎక్కింది ఏందిరా, పెట్టింది ఏందిరా, కారేది ఏందిరా ॥2॥ ॥తాన॥
అహో...హో...ఎక్కింది తాడిసెట్టు ఓహో.. హో... పెట్టింది లొట్టిరా...
తకిటదీమ్... తా...తా...కా రే ది కల్లురా...రా...రా... ॥తా॥

ఇలా పొడుపుకతలు పాటల రూపంలో పాడుతూ.... తానే సక్కని సమాధానాలిస్తూ ప్రేక్షకులను సంతోషంలో ముంచుతడు. వింటూ అందరూ కతలో నిమగ్నమయ్యారు. పక్కపొంటి రోహిని ఎండలు మెండుగా కొడ్తున్నయి. లెక్క సేయడంలేదు. ఉడుకు వడలు రయ్యుమని సూసేటోళ్లను తాకి పోతున్నయి. వడదెబ్బకు తట్టుకోక కొందరు తమకాడున్న కండువలను సెవులకు కట్టుకున్నరు. కూజలతో, పట్వలతో నీళ్ళు తెచ్చుకొని దగ్గర బెట్టుకొన్నరు. జనుముతో అల్లిన సంచులను,ఈతకమ్మలతో అల్లిన సాపలను తెచ్చుకొని వాటిమీద కూసున్నరు. కొందరు సెక్కపీటలు, నులుకతో అల్లిన పీటలు, కొందరు కట్టుడు రాళ్ళు తెచ్చుకొని కూసున్నరు. కొంతమంది యువకులు గోడల మీద కూసుండి సూత్తండ్రు. లుంగీపంచె కట్టుకొన్న ఒక యువకుడు ఏపసెట్టెక్కి మొదటి పంగ మీద ఏటవాలుగా ఒర్గి పండుకొని సూత్తండు. ఎర్రసీమలు కుడుతున్నా గాని ఓ ముసల్ది సూపు పక్కకు వోనిత్త లేదు. వడ్లు దంచే రోలు మీద ఓ ఇద్దరు కూసున్నరు. ముందు కూసున్న పిల్లల్లో కొందరు బరివాతనే ఉన్నరు. ఆళ్ల పెయిల మీద తెల్ల అట్టు(ఉప్పు) పేరి ఉంది. సెరిగి పోయిన జుట్టు, సినిగిపోయిన బట్టలు, మసిగుడ్డల్లో కలిసి పోయిండ్రు. మరికొందరు గోకుడు లేసి గజ్జిని గోక్కుంటున్నరు. కొన్ని కుటుంబాలు ఒక్కకాడ కూసొని ఇంటండ్రు. అప్పుడప్పుడు ముచ్చటగా గుసగుసలు వెట్టుకొంటండ్రు. ముత్తెనెల్లయ్యలాంటి పెద్దమనుషులు నులకతో అల్లిన నాలుక్కాళ్లపీట మీద కూసున్నరు. కొందరు తమ కండువలను ముడ్డి కిందేసుకుని కిందనే కూసున్నరు. నాకు కత అక్కర్లేదని బిలాయ్ పోసయ్య బిడ్డ కింద అక్కడక్కడ కూసిండి లేసి పోతున్న దువ్వెనను పడుతుంది. అది దొరకక ఇంకోచోట పోయి ఆలుతంది. ఆ పిల్ల , దువ్వెన పట్టుకోవాలని బస్కీలు దీత్తంది. అసొంట దూరాన ఉడుత రెండు కాళ్లమీద కూసొని తనకే ఏదైన ప్రమాదం తలపెడుతున్నారేమో అన్నట్టు గొడెక్కుతూ, దిగుతూ బెదురుగా జూత్తంది. ఊళ్లెనుండి అయిసుక్రేట్లు అమ్మెటోడు ఏనంగచ్చిండో ఎవరికి తెల్వదు గాని, పోరగాండ్లు ఆని సుట్టు సేరి కొనుక్కుటండ్రు. ఆడు డబ్బాలొంచి ఒక్కొక్కటి తీసి ఇత్తండు. ఇది మంచిగా లేదు. అద్దు అని మారాంజేసే పోరగాండ్లను కోపంగా సూత్తండు. ఆ అయిస్క్రోట్‌ని లోపలేసుకొని మరోటి తీసి ఇత్తండు. ఆడు కతను కూడా ఇంటండు. మాసిన సినిగిన గుడ్డలతో ఓ పెద్దమనిషచ్చి పక్కనే ఉన్న పెంటకుప్ప మీద ఓ రాయేసుకుని కూసున్నడు. రుమాల్‌లో దాసుకున్న సుట్టను దీసి, వేరొకడు తాగుతున్న సుట్టను అడుక్కొని తన సుట్టకు నిప్పు అంటించుకొని నాలుగు బుక్కల పొగను లోపలికి పీల్సుకొని గప్పుగప్పుమని బయటకు వదిలిండు. తిరిగి అతని సుట్టని అతనికిచ్చిండు. కారుతున్న సెమటను రుమాలుతో తుడుసుకుంట, సుట్ట తాగుతూ కతను ఆలకించిండు. అతని ఎనుకాలే ఓ జాలారి కాలువ ఉంది. దాని పొంటి కూడా నలుగురు కూసున్నరు. దానికి పగ్గంపెట్టు దూరంలో నున్న ఘంట రాజయ్య ఇంటి సూరునీడలో కూసుండి, కొంతమంది కతనింటున్నరు. బండారి కొందరని గోడమీద కూసున్నరు. ఆ గోడలు ఇల్లు కట్టడానికనీ సగంలోనే ఒదిలేసిండు. ఆ గోడనానుకొని వేప సెట్టునీడన కొంతమంది కూసుండి ఇంటండ్రు. ఆ నీడకింద దంగు రాజీరు, ఎడ్ల కచ్చురం మీద సానమంది కూసున్నరు. ఒక్కోపారి కచ్చురం ఎనుక భాగంలో కూసుంటే బరువు ఎక్కువై అది మిఠాయి లేత్తంది.

సిందోళ్లు గొంతు సించుకొని, రాగ యుక్తంగా గళమెత్తి పాడుతండ్రు. బఫూన్‌గొంతు బొంగుర్లు పోతంది. సుట్టూ పదిపగ్గాలపెట్టు ఇనపడాలంటే గట్టిగా గొంతెత్తి పాడుడాయే, కాని కిలోమీటరు దాకా ఇనపడ్తంది ఆళ్లపాట, ఆ సంగతి ఆళ్లకు తెల్వదు. గొంతు సరాన తప్పినపుడల్లా లోనికెల్లి, తెచ్చుకున్న పరుపుదాటి కల్లు ఒక గిలాస తాగి అత్తండు బఫున్. తాగచ్చినపుడల్లా నిలువెత్తు హాస్యాన్ని కుమ్మరిస్తూ సూసేటోళ్లను తబ్బిబ్బు జేత్తండు. .

"రారోరి ఎల్లన్నా- రాజుగారు రమ్మన్నరట ॥రా॥
తిన్నంతా పెద్దదట-తిన్నకూలీ తీత్తదట ॥రా॥
బతుకంతా బజారు పాలట-శరీరమంతా బేజారు పాలట ॥రా॥
రోజంతా బండలు కొట్టుదేనట-ఎట్టిసాకిరి సచ్చిన దీరదట ॥రా॥
పప్పులోలె అప్పులెదుగునట-కొడుకులు దీర్సిన దీరదట ॥రా॥
సావుతిండి, పాసికల్లట-పచ్చనెత్తురే తాగుతాడట" ॥రా॥ ఇట్లా నవ్విత్తండు.

కథాక్రమంలో యుద్ధం సంభవించిన ఏ రాజైన సనిపోయినపుడు ....

"దేవుడో జమదారుడా-మల్లెన్నదత్తవు నరుడో నరుడో నారాయణ.....
ఎండలోన ఎండినావు-వానలోన తడిసినావు,
పక్క మనిషే నిన్ను పాడుజేసేనా ॥దే॥
భుజాన నేలను నిల్పే బలం నీది-
కొండనైన పిండిగొట్టే బలం నీది,
మిగిలింది మట్టి దిబ్బేనా నీకు ॥దే॥
విశ్వాసమే నీ ఇల్లాయె-మంచితనమే నీ పాణమాయె,
బోడి సలహాలిచ్చినోళ్లె. మటుమాయం జేసిరా నిన్ను ॥దే॥
తెల్లగున్నయన్ని గోవుపాలన్నారా ॥దే॥
అరచేతిలో స్వర్గం చూయించి-
గోముఖవ్యాగ్రమల్లె పొంచి సూసారో ॥దే॥
దేశాన్ని ముంచారు-దిబ్బెక్కి కూసున్నరు.
సచ్చిన నీ పేర సమాధులుగట్ట,
సందాలు వసూలు జేత్తండ్రు బిడ్డో ॥దే॥ అని బుడ్డర్ఖాన్...
పాడుతండు, ఆడుతండు, ఎగురుతండు, అందరినీ కవ్విత్తండు. సప్పట్లమీద సప్పట్లు కొడుతండ్రు.

కథాక్రమంలో సదువు ద్యాసచ్చినపుడు.... "ఐ సా ఎ స్నేక్, ఇన్ ది కాల్వ కట్టమే, బట్టె కొడుదునుగాని, దుడ్డు కర్ర నహీహై ఇన్మై హాత్" అని మూడు భాషలను కలిపి మాట్లాడి సూసేటోళ్లను ఆశ్చర్యంలో ముంచెత్తుతున్నాడు.

కత మంచి రసవత్తరంగా నడుత్తంది. ఊళ్లె నుండి అప్పుడాలమ్మే శంకరయ్య అప్పాలు, మడుగులు, పేలాల ముద్దలు, మేదరి జల్లెడ గంపలో పట్టకొని వచ్చాడు. శంకరయ్య కుంటోడు. ఓచేత కట్టె ఓచేత గంప. బుజాన వడ్లు, జొన్నలు పోసుకోటానికి రెండు సంచులేసుకొని అచ్చిండు. ప్లాస్టిక్ బుగ్గను నములుతున్న పిల్లోడు శంకరయ్యను సూసి, మందిలో నించి లేసిండు. గిదగిద ఉరికి, తండ్రి పంచన సేరి, తండ్రికి శంకరయ్యను సూయించిండు!!. "సను కతిందామాగురా" అని తండ్రి సెప్పిండు. కానీ కొడుకు గారాబాన్ని ఒలుక బోసిండు. కతమనసున బట్టనియ్యలె...

"నీ లత్కోరు మొహంల్లా సెప్పు, కతనిననిత్తలేవు గదరా" లేసిండు. సిరాగ్గా శంకరయ్య కాడికి తీసుకెల్లి, రెండు పేలాల ముద్దలు గొనిచ్చిండు. ఇంతలో గుడాలమ్మే మల్లమ్మచ్చింది.

"ఉవ్వో......" అని కేకేసింది.

"ఓత్...నీయవ్వ .... ఎవ్వతివె నువ్వు, ఎల్లు, ఈన్నించి ఎల్లు" అని ఓ పెద్ద మనిషి మల్లమ్మ ఆ కతకాన్నుంచి పోయేవరకు పట్టుబట్టిండు. కత సురువు గాక ముందే అచ్చిన గుఱ్ఱపు ఓదెవ్వ తాటి గడ్డలు అమ్ముడుపోయే దాకా కత దగ్గర్నుంచి కదల్లేదు. ఊళ్లె నించి కారబండోడు గంట కొట్టుకుంట మెల్లగా అచ్చిండు. ఆన్ని గంట కొట్టకుమని ఓ పెద్దమనిషి హెచ్చరించడంతో ఆడు గంట కొట్టడమాపేసిండు.

ఎర్రకొంరని కొడుకు తాటిగడ్డలు తిసుకుంటనే, గుడాలు గావాలని గోలజేసిండు. కిందపడి పొర్లాడుతండు. లెమ్మంటే ఎంతకు లేవలేదు. తండ్రికి కోపమచ్చి "సరుపే అందుకుంటే నీ అవ్వ గిరగిర దిరిగి నాలక్కరువాలె. లే"... అని గద్దరించిండు. వంగి పిలగాని సేతులు బట్టి లేపిండు.

దంగు రాజీరు పక్కన పడుకున్న కుక్కను కరవటానికి కోరపెల్లి లచ్చమ్మ కుక్క నాలుక బయటపెట్టి సొల్లు కక్కుతూ పండ్లు ఇకిలిస్తూ గుర్రు గుర్రు మంటుంది. "అడియె, ఎక్కన్నించి అచ్చినవే నీ... ఈ కుక్కంబటే సత్తది" అని తన ఎర్ర తువ్వాలను పైకెగరేసిండు కొట్టినట్టు.

"....కళ్యామకాసింది, కళ్యామపూసింది కడగొట్టు సహదేవ నీకు నివాళి, శోభా శోభానమే లక్ష్మివైభోగం" అనే పాటతో కత సుఖాంతమైంది.

ఐదుకతలు అయిపోయినై. ఇక మిగిలింది ఎల్లమ్మ తల్లికి బలియ్యాలె. ఎల్లమ్మ తల్లి ఇంటింటికి తిరిగి కలికుండలో సేయివెట్టి రావాలంటే ఇండ్లు సుబ్బరంగ ఉండాలె. సుబ్బరం సేయాలంటే సైతానేషం కట్టిన సిందు జమీలు ఇల్లిల్లు తిరుక్కుంట ఊడ్వాలె. దుమ్ముపట్టిన, పాతర బట్టిన సూర్లనన్ని సీపురుతో దుల్పి ఊడుత్తండు, సాటతో ఎత్తిపారేత్తండు. ఆ సైతాన్ను రెచ్చగొట్టి సాఫ్జేయాలంటే డప్పు కొడ్తనే ఉండాలె. కల్లుముంత ఎంబటే ఉండాలె. ఎంత ఎగురుకుంట డప్పులు కొడితే అంత ఇండ్లు సాఫ్ అయితయి. కల్లు ఎంత ఎక్కువ తాగిత్తే, అంత జల్ది పనులైతయని మాదిగల నమ్మకం. గూడెమంతా దులిపి ఊడ్సే సరికి పొద్దు నెత్తి మీదకచ్చింది. బలి కోసం కొమ్ములు మెలికలు తిరిగిన గొర్రె పొట్టేలును పట్టుకొని ముత్తెనెల్లడు ధరంబాయి దగ్గరకచ్చిండు.

"నీ అమ్మ పని గిట్లనే ఉంటదా?! .. పొద్దంగవట్టె ఎవ్వడు రాడాయె ఎట్ల" అని గుల్గిండు. సేయి నొసటిమీద అడ్డంగా పెట్టి "ఓరి పోసిగో...." అని కేకేసిండు. గొర్రె అటిటు గుంజుతంది. కుడిసేతిలో గొర్రెకు గట్టిన పగ్గాన్ని గట్టిగా సంకలవెట్టిండు. సుట్టలోనున్న నిప్పును కుడిసేతి బొటనేలు గోరుతో లోపలికి ఒత్తిండు. సెంపలు లొట్టలు పడేటట్లు పొగ పీల్చి పెదవులను గుండ్రంగా సేసి సన్నగా పొగను బయటకు ఊదిండు.

మల్లోసారి "ఓరి బండారి కోరింగో..." అని కేకేసిండు. ధరంబాయి గద్దెమీద తన కండువేసి కూసున్నడు. పరుగో పరుగున అందరూ జమైండ్రు. సింది మాణిక్యం కూడా అచ్చిండు.

"అరె ఏమైందిర మాణిక్యం ఇట్లుంటాదిరా. పొద్దుంగుతంది ఇగ ఏషమెప్పుడెత్తర్రా" బిలాయ్ పోసిగాడు కోపం జేసిండు.

"అయిపోయిందన్నా. అచ్చె.....ఈలోపు మనమంతా ఆడికి పోదామని" మూడుబజార్లు సూయించిండు మాణిక్యం.

"అన్నన్న..." అంటూ ధరంబాయి గద్దె మీది నించి లేస్తున్న ముత్తెనెల్లని మోకాల్లు సిటుకు సిటుకు మన్నయి. సిన్న కొంరడు పారదెచ్చి మూడు బజార్లను సాపు జేత్తండు. ఎర్రదుర్గని జాలారి నించి, తొవ్వ మీదకత్తున్న నీళ్ళను కుప్పదిక్కు మర్రించిండు. కుప్పను తవ్వుతున్న కోడిని సూసి "స్సో.... గటుబోరాదె గీన్నే ఉన్నదానె" అని కోన్ని అటుదిక్కు కొట్టిండు.

కూసుండటానికి అనువుగా ఉండే బండను జూసి పంచెతో దాని మీదున్న దుమ్ము దులిపి మడిపెల్లి అంకూసు కూసున్నడు. బండారి కొంరడు అతనింటి సూరికింద కూసున్నడు. పక్కకే పోయి ముత్తెనెల్లడు కూసున్నడు. అటుపక్క పోతున్న కుక్క కనుమరుగయ్యే వరకు బలి కాబోతున్న గొర్రెపోతు సెవులు నిక్కబొడ్సుకొని బెదిరిబెదిరి మెడలెత్తి సూసింది. నమ్మిన మనుషులు తనను ఇంకాసేపట్లో బలి జేత్తరనే బయమేలేని దానికి, విశ్వాసం గల ఆ కుక్కను సూడంగనే బయ మచ్చింది.

కొత్తసాటలో అద్దెడు బియ్యం, పసుపు, కుంకుమ తంగెడాకుతో తయార్జేసిన పచ్చబొట్టు, బియ్యప్పిండితో సేసిన తెల్లబొట్టు, ఊదుబత్తీలు, కంకణాలు అన్నీ సిద్దంగున్నయి. ఆటితోపాటు ఒకే దెబ్బకు మెడను తెగనరికే కత్తి కూడా ఉంది. మూడు బజార్ల నట్ట నడుమ ఒక గజం

అందాద తడిపి అలుకేసింద్రు. నాలుగు పక్కల ఒకే సైజు దబ్బగీసి, పట్నమేసి, దీపాంత ముట్టించింద్రు. ఊదిబత్తీలు కూడా ముట్టించి బియ్యం పోసుంచిన గిలాసలో సెక్కింద్రు. పట్నం మీద నాలుగు మూలలకు నాలుగు నిమ్మకాయలు నడుమ కొబ్బరికాయ. దాన్ని కొట్టడానికి ఒక రాయిని పట్నం ముందు పెట్టింద్రు. దానికి రంగుల బొట్లు వెట్టి ఉన్నయి.

ఇంతలో మాణిక్యం పెండ్లం ఎల్లమ్మ ఏషం కట్టి, ఇనుప గజ్జెల తల్లి అచ్చినట్టు అత్తంది. కాలి గజ్జెలు గల్లుగల్లుమని మోగుత్నుయి. ముడ్డిసుట్టు గజ్జెలే. మెడల బంతిపూల దండలు ఏసింద్రు, ఎడమ సేతిలో సూలం తలుకు తలుకుమని మెరుత్తంది. మెరిసే కిరీటం, సేతిలో ఏప కొమ్మలు, ఎంటికలీరబోసుకొని ఉన్నది. తాళ్లతో రెండు దండ రెక్కలు కట్టబడి ఉన్నయి. ఎనుక నలుగురు మనుషులు పగ్గాలిగ్గి పట్టుకొని ఉన్నరు. అడుగెనుక అడుగేత్తూ మహా కనసొంపుగా ఎల్లమ్మ దేవత అత్తంది. పిల్లలు సూత్తె భయపడతారని పిల్లల్ని ఇండ్లల్లనే వెట్టింద్రు. ముందట దప్పుల సప్పుడు మహాజోరుగా కొడ్తున్నరు. ఎల్లమ్మ దేవత సుట్టు పెద్ద మనుషులుండి ఎవరు అడ్డం రాకుండా సూత్తంద్రు.

ఎల్లమ్మ దేవత పట్నం దగ్గరికచ్చి కండ్లు మూసుకొని ఒక కేకేసింది. అది దేవతలను పిల్వటానికని మాదిగల నమ్మకం. ఏపకొమ్మలు పట్నం సుట్టు తిప్పుతూ తాను తిరిగింది. ఆ తరువాత మొక్కి కొబ్బరికాయ కొట్టిండు మాణిక్యం. పట్నం కాన్నించి ఎల్లమ్మ కదిలింది. మొదలు మొదలు తనకిట్టమైన ఇంట్లకు వోతది. ముందు ఎవరింట్లకు బోతె ఆళ్లు అదృష్టవంతులని మాదిగల నమ్మకం. పులి ఎల్లయ్య ఇంట్లకు పోతంది. ఆమె కోసం అందరూ పెద్ద కుండలో కలి సిద్ధం సేసి పెట్టుకోవాలె. పులి ఎల్లయ్య ఇంట్లో కూడా కలికుండ సేసి పెట్టింద్రు. మెల్లగా వంగి రేకుల తలుపును ఎనక్కి జరిపి తానొక్కతే లోపలికెల్లింది. అటు ఇటు సూసి పొయ్యి దగ్గరికెల్లింది. మెల్లగా వంగి అక్కడున్న కలికుండలో సేయిబెట్టి అటు ఇటు తిప్పింది. లేవబోయిన ఆమెకు పక్కనే ఏలాడుతున్న ఉట్టి తగిలి కిరీటం తొనికింది. ఆమె ఎంటనే కిరీటాన్ని ఎడమసేత్తో పట్టుకొని సర్ది సేసుకోటానికి సేయిని ఇదిలించింది. బయట తాళ్లు పట్టుకున్నోళ్లు తత్తరపడ్డరు. మెల్లగా ఎల్లమ్మ బయటకచ్చింది. ఇట్లా ఇండ్లన్నీ తిరిగి అచ్చే సరికి పొద్దు బారెడు కుంగింది. కాసేపు దప్పుల సప్పుడాగింది.

పట్నం దగ్గరకు సేరుకున్న ఎల్లమ్మ ముందర గొర్రె పోతును నిలబెట్టి బొట్లు పెట్టింద్రు. దానిమీద కల్లు బోసి.. "బిడ్డా! సల్లంగ జెడితియ్యి" అని తోళ్ల రాజిగాడు మొక్కుతండు. అతని రెండు గాళ్ల సందున గొర్రెను వెట్టుకొని, దాని సెవులు సేతవట్టి, బెల్లంశాఖ దాన్నోట్లెబోసి...

"తల్లీ ఎల్లమ్మతల్లీ! మా గూడేన్ని సల్లంగ కాపాడుతానని సెలవియ్యి తల్లీ!" అని గొర్రెనిడిసి పెట్టిండు. రెండు సేతుల దండం పెట్టిండు. అందరూ గొర్రె దిక్కే సూత్తంద్రు. ఎపుడు జెడితిత్తదా అని రెప్ప గొట్టకుండా సూత్తంద్రు. పదిమంది పదిమాటలు మాట్లాడుతనే ఉన్నరు. రాజీరుకు కోపమచ్చింది. "అసె ఆగండహె.. నీయమ్మ మాటల మీద అక్కెరకు రాని మాటలు, ఈడ గొర్రె జెడితిత్తలేదని మేము జత్తె, మీరేమో ముచ్చట్లు" అని గరమయిండు.

"అదెంత పనిరా... తల్లి తల్సుకుంటే ఇయ్యక పోద్దా! అంతా తల్లి సేతులున్నది. మనసేతులేమున్నది" అని బిలాయ్ పోసిగాడు సముదాయించిండు. పట్నం సుట్టు సేరిన అందరి సూపు గొర్రె మీదికచ్చింది.

"అందరు మొక్కండన్నా" మాణిక్యం సెప్పి పక్కకు జరిగిండు. సిందోళ్లు, మాదిగోళ్లంతా ఒకలెనుకొకలు ఎల్లమ్మ దేవత ఎదురుగా నిలబడి మొక్కింద్రు. సిన్న కొంరదు మధురభక్తితో వచ్చి నీల్లు ఆరగించిండు. కర్రె పోసిగాడచ్చి కల్లు, బెల్లం శాఖ గొర్రె మీద జల్లిండు. దాన్ని దొరకవట్టి గొంతుకల కూడా ఇంత బోసిండు. "తల్లీ నీబాంచెన్ మంచిగ జెడితియ్యి" అని మొక్కిండు, గొర్రె పోతు లొడలొడమని సెవులూపింది.

"గట్లయితే మేమాడింటం మొత్తం జెడితియ్యాలె" అని మాణిక్యమన్నడు. సానాసేపు ఎదురు సూసింద్రు. గొర్రె జెడితియ్య లేదు. కల్లుశాఖ, బెల్లంశాఖ అయిపోతంది.

"ఏం తక్కువ జేసినం బాంచెన్, సెప్పాలె" నంటు ముత్తెనెల్లడు మొక్కిండు.కాసేపటికి ఎల్లమ్మ తల్లే గొర్రెవంక సూత్తంది. జెడ్తిత్తదని అందరికీ నమ్మకం కుదురుతుండగనే ఒళ్లంతా మెడలతో సహా దులుపుకున్నది. గొర్రె కన్నుమూసి తెరిసేంతలో దప్పులు కణకణ మోగాయి. గొర్రె తల తెగి కింద పడింది. ఎంటనే ఎల్లమ్మ ఒడుమాల బియ్యం దీసి రక్తంలో తడిపింద్రు, బిలాయ్ పోసిగాడు గొర్రె తోలు తీసిండు.

తోళ్ల రాజిగాడు లేసి మాణిక్యం మొకానికి పసుపు రాసింద్రు. తెల్లబొట్లు, పచ్చబొట్లు రక్తంతో కలిపి పెట్టింద్రు. ఎంటనే మాణిక్యం కండ్లు ఎర్రబడ్డయి. ఉడ్కుడ్కు దొబ్బదీసి మాణిక్యం నోట్లో గుక్కింద్రు. పేగులు దీసి మెడనేసింద్రు.

అక్కడున్న అన్ని బొట్లన్ని మాణిక్యం మీద జల్లింద్రు, ముడ్డిసుట్టు ఏపాకులు గట్టింద్రు. కాలికి గజ్జెలు గట్టింద్రు, బియ్యం సాట బుజాన పెట్టింద్రు, దప్పుల మోత మోగుతూనే ఉంది. జోరు ఎక్కువైంది. జనమంతా దాసుకున్న సారా పాకెట్లు తీసింద్రు. ఒక్కొక్కటే తీసి ఓ మూల కొరికిపారేసి తాగుతున్నరు. తాగిన మైకంలో ఎగరటం మొదలయ్యింది. పోతరాజోలె ఎగురుతున్నడు పులి అంకూసు. నద్వటం సురువైంది. ఈలలు కొడుతున్న యువకులు అందరికంటె ముందున్నరు. తరువాత పెద్ద మనుషులు నడుత్తంద్రు. ఇండ్లల్ల నించి సిన్నపిల్లలు అడ్డం రాకుండా తల్లిదండ్రులు జాగర్త పడ్తంద్రు.

మాణిక్యం అవతారమే మారింది. నోరు తెరిసిన ఆది పరాశక్తిగా కొంతమందికి, పట్టువిడువని విక్రమార్కుడిలా కొంతమందికి, తమ పాలిటి యముడులా కొందరికి కనిపిత్తండు. పెద్దోళ్లకు గ్దాడా బయమైతంది. ఆపదలోనున్నోళ్లను ఆదుకొనుటకు దబాదబా ఉరికినట్లే నడ్తండు. ఒక్కొక్క పిడికెడు బియ్యం ఒక్కొక్క ఇల్లుమీద జల్లుకుంట దబదబ నడ్తండు. మాణిక్యం ఎనకాల సిన్న దండులాగా మాదిగ గూడెం కదిలింది. రగతం, పసుపు కుంకుమలతో కలగలిసిన బియ్యం ఇంటిమీద జల్లితే మంచి జర్గుతదని మాదిగోళ్ల నమ్మకం. బందారి కొంరయ్య ఏప సెట్టుమీద గూడువెట్టిన గువ్వ పిల్లకు గుబులు బుట్టి, గుటగుటమని మెడలు నిక్కిచ్చుకుంట పరేసాన్‌గా జూత్తంది. పిడికెడు బియ్యం కొంరయ్య ఇల్లుమీద ఇసిరి గొట్టంగనే ఆ గువ్వపిల్ల రెపరెపమని ఎగిరిపోయింది.

సిటికారి కొంరయ్య ఇంటెనకకెల్లంగనే ఎవరో బలవంతంగా గుంజుతున్నట్టు ఒక్కసారిగా బిగుసుకు పోయిండు మాణిక్యం. ఒక్క పాదమే లేత్తంది, ఇంకో అడుగు భూమికి అతుక్కు పోయింది. "ఊహూ.. నా... " అని కండ్లు పెద్దయిజేసి కనుబొమలెగరేసి ముందటికి అడుగేయ బోతండు. పదిమంది పట్టి ఎనుకకు గుంజుతున్నట్లుంది. లేసినడుగు లేసినట్లే ఉంది. అడుగు ఎంత

ముందటికి ఏద్దామన్నా అడుగు కదలటం లేదు. అందరికీ ఒక్కసారి గుండె ఆగిపోయినంత పనైంది.

"ఓ అంటే, ఓ... అబ్బర పులంటే తోక బారెడన్నట్లు" గొంతులు ఒర్లుతున్నయి. ఆద తాతల నాటి సింత సెట్టుంది. అది కుంటి లింగయ్య అనే మాలోడిది. దాని మీద ఒక ఏల్పులమ్మ బూతముందని అందరికి తెలుసు. అదే ఆపుతుందని తెలుసు. ఎంటనే తన దగ్గరున్న కోడిపిల్లను మాణిక్యం ముందట నిలవడి కిందికి మీదికి రెండుసార్లు దిప్పి, కొరికి పారేసాడు బిలాయ్ పోసిగాడు. ఇటువంటివి జరుగుతయని ముందే తెలుసు. అందుకే ఎవరి జాగర్తల ఆళ్లున్నరు. ఆగిన చోటు ఎవరింటికి దగ్గర ఉంటే వాళ్లకుగాని, ఆ వాడకుగాని దరిద్రం పడుతుందని గూడెం నమ్మకం.

మాలోల్లు అడ్డురాకుండా సూత్తంద్రు. పెద్ద మనుషులు. దయ్యాల రామనింటి దగ్గరికెళ్లంగనే మల్ల ఆగిపోయిండు. మేకలోడిగాడు గిదగిద ఉరికచ్చి నీళ్లారగిచ్చిండు. ముత్తెనెల్లడు ముందటికొచ్చి కర్రె కోన్ని కసుక్కున కొరికి పారేసిండు. పారేసిన కోడి రెపరెపమని కొట్టుకోటంతో ఆద గుబురు సింతల్లనున్న గుడ్లగూబ ఒక్కసారిగా ఇదిలించుకొని బయటకు ఒర్రుకుంట ఎల్లిపోయింది. అందరూ దాన్ని తిడుతూ శని ఇరగడయి పోయిందనుకున్నరు. ఆళ్ల మన్సు నిమ్మలం జేసుకొని ముందుకు నడ్సింద్రు.

"ఊరిని పట్టి పీడిస్తున్న తంతులు ఇంకెన్ని ఉన్నాయోనని" ఎగురుతున్న పులి అంకుసు అనుమానం జెప్పిండు. గూడెం సుట్టు బోలెడు సెట్లు, కంకపొదలు, బండలు, రాళ్ళు, రప్పలు, సిన్నసిన్న గుంటలు, ఎనుగులు, ముండ్ల కంపలు, పిచ్చిసెట్లు, పెరండ్లు, పెరండ్లలో పెట్టుకున్న సిన్న సిన్న దేవతల గుళ్లు కూడా ఉన్నయి.

తూర్పున గొడ్లు గోసే జాగ. బొక్కలతో నిండిన తోళ్ల రాజిగాని సింత, ఆ సింతమీద జడల ఎర్రమైసమ్మ ఉంది. అది రగతాన్ని జూస్తే గానీ ఇడిసి పెట్టదని అందరికీ గుటగుటే ఉన్నది. రాల్లల్ల, రప్పల్ల పడి, ముండ్లనక ముతకనక నడుత్తంద్రు. మాణిక్యం కాలుకు ముండ్లు ఇరిగినా లెక్క జేత్తలేదు. మొసచ్చినా, సెమటలు కారుతున్నా పరుగో పరుగున అందరూ నడుత్తుంటే, ఇండ్లల్ల కుక్కలు మొరుగుతున్నయి. కోళ్ళు బెదురుతూ అరుస్తున్నాయి. దొడ్లల్ల ఎడ్లు బర్లు కూడా బెదిరి బెదిరి జూత్తున్నయి. దప్పుగొడ్తున్న ఒకడు బయటకు పోవాలని, ఇంకొకనికి దప్పునిచ్చిండు. ఎంటనే ఒక్క తీరుగా కొడుతున్న దప్పులు స్రుతి తప్పినయి.

"ఏం కొట్టుడని" పులి అంకుసు ఏప కొమ్మలతో దప్పు కొట్టేటోళ్లను కొట్టిండు. తోళ్ల రాజిగాని సింత కాడ జడలమైసి ఆపనే ఆపింది. మాణిక్యం కదులతలేదు. దానికి ఎర్రకోడిని సించి, గుడిమీద వోసింద్రు. తొవ్వ సాగింది. మాణిక్యానికి జెకమొకరాయి కాలుకు గుచ్చుకుని రగతం కార్తంది. రగతం కారినా లెక్కసేయక దబ్బదబ్బ నడ్తండు.

మాదిగిండ్ల పంపును దాటి బొమ్మల్ల గడ్డ (బొందలగడ్డ)ను దాటింద్రు. పట్నం తుమ్మ సెట్లను దాటింద్రు. మూడు తాళ్లల్ల దగ్గరి కొచ్చింద్రు. అది సౌరత్త. ఒకటి ఊళ్ళెకు బోయేదారి. ఒకటి మాల మాదిగలను ఇడదీసే రోడ్డు. ఇంకొకటి జెంగలికి బోయేదారి, ఇంకొకటి పల్లెకు బోయేదారి. ఈ నాలుగు తోవల కాడ పెద్ద ఏల్పులమ్మున్నదని అంటరు. ఆ పక్కనే పులివాడ, ఆ వాడ నీతి నిజాయితీకి ఇంకొక మెట్టు ఎక్కువ. మాదిగలకు హడల్ ఆ వాడంటే. ఆ వాడెనుకాలే ఏల్పున్నది. కాని అది సానా మంచిదని మరి కొందరి నమ్మకం. అక్కడ కూడా మాణిక్యం ఆగిపోతే పులి అంకూసు మాణిక్యం కాళ్ల దగ్గర కొబ్బరికాయ నేల కేసి కొట్టిండు. మాల మాదిగలను ఇడదీసే ఆ రోడ్డు గుండా ధరంబాయి మీదుగా మూడు బజార్లకు సేరుకున్నరు. అందరి మొకాల్లో ఒక సంతృప్తి నిండుకున్నది.

కానీ అంతా నీరసించి వోయింద్రు. పల్లేరు కాయల్లాంటివి అందరి గోసులకు. కాళ్లకు గుచ్చుకుని, నల్ల సీమలెక్క పట్టుకొని ఉన్నయి. కూసుండి ఒక్కొక్కటి తీసుకుంటంద్రు.కొందరు ఊపిరి వీల్చుకున్నరు. కొంతమంది ఆయాసంతో నీళ్ళు తాగింద్రు. తాగిన కళ్లంతా అరిగి నట్లయింది.అందరి కండ్లు ఎర్రంగున్నయి. సెమటను తుడుసు కుంటంద్రు. పెద్ద మనుషులంతా ముడ్డిమీద లుంగి పంచె, బుజం మీద కండువను సరిజేసుకుంటంద్రు. ఆ కండువను అప్పటి వరకు నడుముకు సుట్టుకొని ఉన్నరు.

దేవత పట్నం దగ్గర ఎల్లమ్మ తల్లి అట్లాగే నిలబడి వున్నది. ఆమె మీద ఎండ కొడుతంది. గువ్వలు పగిలే ఎండ. తాటలు ఒలిసే వడ గాడ్పులను లెక్కసేయకుండా ఆవిడ అక్కడే నిలుసుండి ఉంది. ఆమె దగ్గర కొంతమంది కావలున్నరు. పట్నం దగ్గర కారిన గొర్రె రగతం ఎండి నల్లబడి పోయింది. ఎండిన రగతానికి నల్లని గండు సీమలు పట్టి తింటున్నయి. కొన్ని లైనుగట్టి పట్టుకెళ్లుతున్నయి. ఎల్లమ్మ సేతులున్న ఏపకొమ్మలు నిమ్మదేలి పోయినయి. అందరూ అలసి పోయింద్రు. ఎపుడు ఇండ్లల్లకెల్లుదామా అని ఎదురుజూత్తంద్రు. దప్పుల మోతకూడా సన్నగిల్లింది. పులి అంకూసు ఎగరటమాపిండు. రొండిమీద కుడి సెయ్యేసుకుని నిల్సుండి సూత్తండు. ఎల్లమ్మ ముందరికచ్చి, నిల్సొని బెల్లంశాఖ, కల్లుశాఖ మొక్కి మాణిక్యాన్ని శాంతించమన్నడు. ఎనుక నిలుసున్నోల్లంతా శాంతించు శాంతించుమని వంతపాడింద్రు. ఎల్లమ్మ సేతులు పైకెత్తి ఈర్పులీరుస్తూ మూడు కేకలేసింది. నోరు తెర్సి మూడు సిటికేలేసి కింద కూలవడ్డది. కొద్దిసేపట్కి మామూలు మతికచ్చింది. మాణిక్యం నోట్లో నున్న దొబ్బను తీసి పాతి పెట్టడానికుంచిన గుంటలో వేసింద్రు. జాగర్తగా దొబ్బను సమాది సేసింద్రు. పేగులు దీసి తోళ్ల రాజయ్య బొక్కల పెంటదగ్గర నున్న మైసమ్మ గుడికి వేలాడ దీసింద్రు. మాణిక్యం ముడ్డిసుట్టున్న ఏపకొమ్మలు దీసేసరికి మూడుసుట్లు తిరిగి ముడుసుకొని పడ్డడు. అప్పటికే తెచ్చిపెట్టిన రెండు కుండల నీళ్లు మాణిక్యం మీద బోసింద్రు. మెల్లగా మాణిక్యం లేసి సచ్చి లేసిన పీనుగోలె అయిండు. ఎల్లమ్మ ఎనుక నడ్సిండు. ఆళ్ల ఇల్లు తావు సేరుకున్నరు. బలిచ్చిన గొర్రెను ఆరు పోగులేసుకుని తీసుకెల్లింద్రు పెద్ద మనుషులు.



ఉత్సాహమే గావచ్చు, లేక పోటీ తత్వమే గావచ్చు. లేదా ఈర్ష్యయే గావచ్చు లేకుంటే మీకంటే దేన్లో మేము దీసిపోమని గావచ్చు. కాకుంటే మిమ్ములను అడుక్కునేటోళ్ల మీద మాక్కూడ దయుంటుందని సెప్పటానికి గావచ్చు. లేకపోతే పొద్దు గడవటం కోసం గావచ్చు, మాలోల్లు సింది మాదిగోళ్లతో యక్షగానం ఏయించడం సానామంది మాదిగోళ్లకు ఇచ్చంత్రమౌంది. సంతోషమైంది మరికొందరికి.

బాలనాగమ్మ కథ మహాజోరుగా, రసవత్తరంగా నడిపిత్తంద్రు. అర్ధరాతిరైంది. గూడేం మనసుపడి సానా ఇష్టంగా మాయల పక్కీరు తంతులను సూత్తంద్రు. ఎవరి సూపు పక్కకు పడ్తలేదు. తొట్టిల పంద బెట్టిన కొడుకునూపుతూ బాలనాగమ్మ సంతోష పడ్తంది. గప్పుడు మాయల పక్కీరు బిచ్చానికచ్చిండు. పకీరు అచ్చినట్టే సూసేటోళ్లెనుక

దుమ్ము రేపుతూ జీబచ్చి ఆగింది. దాని లైట్లు మీద పడి స్టేజీ ఎలిగి పోతంది. బాలనాగమ్మ ఆ ఎలుగును సూడలేక పోయింది. అందరు జూత్తాంటనే బాలనాగు కర్రె కుక్కలా మారి పోయింది. జీబు లైట్ ఆరి పోయింది. చీకటైంది. మాయల పక్కీరు కుక్క మాయమైంది. ఆళ్లతోపాటు సింది మచ్చయ్య, నలుగురు మాదిగ పోరగాండ్లు మాయమైంద్రు. జీబు ఎళ్లిపోయింది. కత ఆగి పోయింది. మాదిగ గూడెంలో ఏడుపు మాటలతో తెల్లారింది. అందరూ ధరంబాయి దగ్గర జమైంద్రు. మూగవోయిన గొంతులు, దయా, జాలి, తరుక్కుపోయే గుండెల సప్పుళ్ళు.

ఈ త్యాగం ఎవరికోసమో గాని తెల్లారి కలువల గుట్ట మీద పీతిరి గద్దలాడుతున్నయి. కన్న తల్లిదండ్రుల కండ్లనిండా ఇంకా నీల్లాడుతున్నాయి.

సమాప్తం

ఈకథ 1998లో ప్రచురితం అయ్యింది.
మేమిట్లుండం కథా సంపుటి:
రచయిత– గుండెడప్పు కనకయ్య.
కాలం: 1986
వస్తువు, ఇతివృత్తం: వీణవంక గ్రామం మాదిగ గూడెం
ముద్రణ: 28–12–1998,
పబ్లికేషన్స్: ఏ.పి. దళిత్ రీసెర్చ్ సెంటర్,
ఎన్ ఆర్ ఎస్ : ఐ– 105,
యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ – 46
సెల్ నెం. 9441778229

L`Ê^ä•0

- _¨ll Q°O__,,ôæ H#H†%

రేకుతో సేసిన తలుపును తోసుకుంట కుక్క లోపల జొచ్చింది. తలుపు కొంరవ్వ మీద పడలంది. "అడలయొ" అని గబుక్కున అరిచింది. కొంరవ్వ అరుపుకు లోపలికి పోయే కుక్క బయటకురికింది. కొంరవ్వ నలుసుకుంట మెల్లగా కండ్లు తెరిసింది. బయటకు సూసింది. కరకర పొద్దెక్కుతంది. సింతకొమ్మల సందుకొని ఎండపొడ సూటిగా కుక్కిగడంచె మీదికి పారింది. ఆ గడంచె గలుమకు అడ్డంగా ఉంది. కాళ్లకట్ట తాడు నిగ్గక జోలె వడ్డది. ఆమె పక్కలో మాసిన బొంతపేగులు. ఆ బొంతపేగులు కొన్ని నులుక సందు నుంచి కిందికి ఏలాడుతున్నయి. గడంచె కింద ఆ పేగులతో పాటు తెగిన నులుక తాళ్లు కూడా ఏలాడుతున్నయి. కొంరవ్వ పట్టెను పట్టుకొని బలవంతంగా లేసి కూసున్నది. గుడ్డపేగులతో కట్టుకున్న దిండు. దిండు పక్కన పెట్టుకున్న సగం పగిలిన అద్దాలను సేతులకు తీసుకున్నది. కొంగుతో తుడుసుకొని కండ్లకు పెట్టుకున్నది. ఎగబాకుతున్న పొద్దుకేసి సూసింది. పొద్దెక్కిన కొద్దీ సలి కొరుకుడు తగ్గుతంది. సింతకింద కొందరు సలి మంటలు కాగుతండ్రు. కొంరవ్వ ఆ మంటకాడలకి పోవాలను కున్నది. పోలేక పోతంది. సలిమంటల పొగ అటూ ఇటూ జోక్కుంట అప్పుడప్పుడు ఇంట్లకత్తంది.

రామక్క ఎడమ సేతిలో తినే గిన్నె. గిన్నెలో అన్నం, పచ్చినెరుపకాయల కారం. తినుకుంటనే ఇల్లిల్లుకు తిరుగుతంది. ఎదురయ్యేటోళ్లతో " ఏమాయెనే పొద్దుక్కుతంది. సలనాదూరం నడువల్లాయే. ఇయ్యాల కైకిలి పోతమానే " అని అనుమాన పడుతూ, కలువ పోయేటోళ్లను తొందర పెడుతంది.

రామక్క సప్పుడలన్న అమ్మలక్కలంతా దబదబ పనులు ముగించుకొని కలువ పోవటానికి తయారైతండ్రు. రామక్క అన్నం తినటం అయిపోయింది. ఇంటిముఖం పట్టింది. కొంరవ్వను చూసి ఆగింది. "తిన్నవా అత్త " అని అడలగింది.

" ఇంక మొకమే కడుగలే, ఏం ఏగిరమత్తందే నాకు. జెర కళవ్వనైతే పంపు " మని సెప్పింది.

రామక్క "సరె పంపుత "ననుకుంట ఎల్లిపోయింది. రామక్క బిడ్డ కళవ్వ. ఐదు సదువుతంది. ఇంట్ల పనంతా సేత్తది. అప్పుడప్పుడు తల్లితోని పనికి పోతది.

** ** **

"అవ్వ బువ్వ తిన్నవానే " బయట నుండాలు చిన్నకొడుకు మాటాలు

" బువ్వెందుకు ? ఏంబట్టది. ఎటన్నవొయ్యేదున్నద ఏంది ? మీరందరు ఎక్కడోళ్లక్కడ పోండ్రాలు. పొయినంక తింటె తినేది. లేకపోతె లేదు. మెల్లగ తినేది !." అసంతృప్తి కొట్టొచ్చినట్లు కనపడ్డది.

"గట్లంటె ఎట్లనే అవ్వ, మూడు రోజులునుంచి ఒక్కపూటే తింటున్నవట. ఆరోగ్యం దెబ్బతింటది" అని హెచ్చరించిండు.

"ఎనుకట ఎన్నో రోజులు ఒక్కపొద్దున్న రోజులున్నయి. సావలె. అయినా సావుకు బయపడాలతె ఎట్లర ?. నాకేం గాదుగాని, నీ పనికిబో కొడుకా ! " సమాదాలాన పరిసింది.

" అవ్వా! జెర నామాటినే. కడుపునిండ తిను. అన్నం తింటనే మనుషులు ఆరోగ్యంగా ఉంటరు. నువ్వు సంతోషంగా ఉంటేనే మాకు సంతోషం ఉంటది!" అన్నడు.

కొడుకును కింది నించి మీద్దాక సూసింది. కొడుకు సదువైతే బాగా సదివిండు. నౌకరి దొరకకపాలయె. ఇల్లు గడవటం కష్టంగున్నది. నౌకరి దొరికిన్నాటికి నేను బతుకుతాన? కొడుకు సంపాదన ల్సుసుండాలు తింటానా? కొడుకు కట్టం బాకీ ఉన్నద ? కొంరవ్వ మనసు పరిపరివిదాలాలు కొట్టుకున్నది.

అవ్వను తేరిపాలర సూడసాలగిండు కొడుకు. తల్లి పట్టుదాల గల మనిషి. తన కట్టం ఒకరికి సెందాలంటది గానీ, ఒకరి కట్టం, సివరికి తన కొడుకు కట్టం ల్సుడా తినద్దు అనుకునే మొండాలు రకం. ఈ మొండాలు పట్టుదాలతో ఆరోగ్యం దెబ్బ తినవట్టె. అవ్వను ఎట్ల ఒప్పియ్యాలెనని తనలో తను మదన పడసాలగిండు.

"ఆయింత పాంటె ల్సుడా తినక పోతే సత్తన, సత్తె సత్తినేంది? బాలూమికెత్తొయితన ? ఏంది ? " అసంతృప్తి బయాలు దేరింది.

కొడుకు గుండె గుబెల్ మన్నది. ముసలోళ్లకు కోపమెక్కువ. ఏమన్నంటే ఇంకా ఎక్కువే మాట్లాడేటట్లుంది. ఇక నేను మాట్లాడక పోతనే నయమనుకొని "సరె నీ ఇష్టం. నేను జమ్మికుంట దాకా పోయత్త " ననుకుంట ఎల్లిపోయిండు.

కొంరవ్వ కండ్లల్లు నీళ్లు సర్రున జారి కింద పడ్డయ్. తనకు తెల్వకుండానే కడుపు రొద ఎగేసుకొత్తంది. లోపల కుమిలి పోతున్న దుక్కం పొంగింది. బిడ్డల దుర్భాలరమైన జీవితాలను తలపోసుకుంట బోరున ఏడ్వ సాలగింది. అది కొంరవ్వ ఏడుపేనని పదిండ్ల పెట్టున తెలిసిపోయింది.

** ** **

సీకటివడంగా దాలరంబాయి గిరకల చప్పుడు. " ఓ కళవ్వ సెంబెడు మంచీళ్లు తెచ్చియ్యే " కేకేసింది కొంరవ్వ.

కళవ్వ ఆకిలి ఊడుత్తంది. మాసిన ల్సుంగ, కుట్లు పికిలిన జాకెట్ తొడుక్కొని ఉంది. తలమీద దుమ్ము పడాలు చెదిరిన జుట్టుతో మంచు గమ్మికున్న సిన్న కొమ్మలా ఉంది. ఏనంక కొంరవ్వకు ఏడ పనిలేదు ఏమైన నన్నే హిత్తది, అనుకుంట గున గున ఉరికచ్చింది. అచ్చిరాంగనే "ఇద్వర్దాక ఎందుకేడాలునవ్ కొంరవ్వ " అని ప్రశ్నించింది.

" నీళ్లయితె దెచ్చియ్యే సెప్త "

కళవ్వ దాలరంబాయికెళ్లింది. బొక్కెన బాయిలేసింది. ఆ బొక్కెన అడుగుకు చెక్క అతుకేసుంది. నీళ్లల్లు బొక్కెన నింపి పైకి సేదింది. బొక్కెనకున్న పొక్కాలు గుండా నీళ్లు కారి పోతున్నయి. బాయిలు నించి బొక్కెనను బయటకు తీసింది. సేదిన నీళ్లను రొతెండాలు సెంబులో పోసింది. " సెంబు నిండలె, ఈ బొక్కెన పాలడుగాను. సెంబెడు నీళ్లన్న రాలె " నని బొక్కెనను తిట్టుకుంట మళ్లీ బాయిలేసింది. ఈసాలరి దబదబ సేదింది. సెంబు నిండాలంది. ల్సునిరాగమేదో తీసుకుంట సెంబు తెచ్చి కొంరవ్వ చేతికిచ్చింది,

కొంరవ్వ సెంబునెత్తి గొంతులు వోసుకొని గటగట తాకింది. పెద్ద బేవ్ తీసింది. " నీ కడుపు సల్లంగుండ" నని కళవ్వకు దీవెననిచ్చింది.

కొంరవ్వను ఎగా దిగా సూసింది. అన్నం దినకున్నా ముసల్ది గింతెలువలె. ఎర్ర గొల్లిదున్నట్లున్నదనుకొంటూ " అయితమాయె గానీ ఇంకెన్ని రోజులు నీళ్లు తాగి ఉంటవ్, బువ్వ తినక పోతే సత్తవ్" అని అన్నది నవ్వుకుంట.

" సత్తెమానె పోరాదే. పాయి ఆకిలూడూక పో " మమకారంతో పొమ్మన్నది గానీ కొంరవ్వ మొకంలో తపన కళవ్వ మనసును సెదురగొట్టింది. కొంరవ్వను సూసుకుంటనే పల్లెత్తు మాటరాక గడుప దాటింది.

సింత సెట్టు మీద పిట్టలు పిస పిసను పసిగట్టిన గుడ్లగూబ ఒకవైపు, డేగ ఒకవైపు కాసిపెట్టుకొని ఉన్నయి. ఎప్పుడు సందు దొరికితే అప్పుడు పిట్టలను తన్నుకొని పోవాలని మాటేసి సూత్తున్నయి. రంజాన్ ముగిసిన నమాజ్ పాలటల్సుయను ఈదర గాలి తప్పిస్తుంది. కొంరవ్వకు నమాజు ఇనిపించినవోలె పక్క సరిజేసుకొని గడంచాల ఒరిగింది.

కొడుకు ఇంక రాకపాలయెనేనని మనసు కొడుకు మీదికి పోయింది. కొడుకు ఇంట్ల ఉన్నంత సేపు నా కడుపు ఇసాలరిత్తడు. నేను తినలేదని మనాది పెట్టుకున్నడు. నేను సత్తనని బాలయపడ్తండు. సావుకెందుకు బాలయపడాలె. పుట్టినోళ్లంతా బాలూమ్మీదున్నర?

ఎన్నడైన సచ్చుడు దప్పదు. సత్తె, మంచి సావు సావాలె. కొడుకులు, బిడ్డలతో ఊడిగం సేయించుకోటం మంచిది కాదు.

మాదిగ ఎల్లయ్య అంటె దీటుగ ఉండెటోడు. పంకు పంకు ముసలోడు అయ్యేదాక పని జేసిండు. రేపు సత్తననంగా కూడా పని జేసిండు. మేము పనికెన్నడు బాధపడలె. సచ్చేదాక పని చేసే కులం మాది. ఏగిలేత్తె కట్టాన్నే నమ్ముకున్నోళం. పంటలు పండించటమే తెలిసినోళ్లం. ముసలోడు పోయెదాక దొరగారి పొలాల్లో సెమటలు కార్చినం. లోకమే బతికింది. మేం సంపాదించుకున్నదేమి లేదు. దొరగారికి శాత సేసే కాన్నుంచి మేము దగ్గర పడేదాకా అరొక్క పని చేసినం. మంచిగున్నన్నాళ్లు బతుకుపోరు సేసినం. ఉన్నదాంట్లో సర్దుకున్నం. లేంది కోరుకోలె. ముసలోడు పోయిన సంది బువ్వ వోతలేదు. ఇప్పటికీ పని సేయాలనే ఉంది. కానొక్కదాన్ని సేయలేక పోతన్న. రందికే కాళ్లు సేతులు దగ్గర పడ్డయ్. పని సేయక పోతె మా కులానికి తిండాలు పెయిన వట్టదు. కుసుండాలు ఎన్నాళ్లు తినుకుంట బతకాలె. ఎవరికోసం, ఎందుకోసం బతకాలె. సాలు.

బతికినన్ని రోజులు ఎవ్వలకు కీడు సెయ్యలె. ఎవ్వల మనసు నొప్పియ్యలె. ఎవ్వలను తిట్టలె. ఎవ్వలను కొట్టలె. ఒగల్తోటి మాటవల్లె. మా బాదేందో మేము పడ్డం. మా బతుకేందో బతికినం.నలుగురు మాకుసెయిలు జాపింద్రు. మేము ఎవ్వలకు సెయి జాపలె. బతికినన్ని రోజులు కట్టజీవులుగ బతికినం. దర్జాగా బతికినం. ఎక్కువోళ్ల లాగ కుసుండాలు బతకటం సేతగానోళ్లం. జెగానికి బరువు కావద్దని ముసలోడు అనేటోడు. కానీ ఈ కరువు కాలానికి ఏనాటికైనా నూకలు సెల్లుడు సెల్లుడే. కట్టాలను మీదేసుకోటమే తెలిసిన మాకులానికి ఎవలను కట్టపెట్టడం తెల్వదు. పుక్కిడలు కష్టార్జితం తింటూ బతకటం సుతరాము ఇట్టం లేని కులం. మంచి కోరుకునే ఈ కులానికెందుకు మంచి ఆలోచనలు? చెడు ఆలోచనలెందుకు రావు? ఈ బతుకెందుకు స్వార్థాన్ని కోరుకోదు? అలసటెరుగని మనసు ప్రశ్నలు... పెద్దపెద్ద ప్రశ్నలు... తనకు తెల్వకుండానే... ఎన్నో ఎన్నెన్నో... కొంరవ్వ మనసు పరి పరి విధాల పరుగు దీత్తంది. గగనాన్ని దాటిన మనసు. ఆవలించుకుంట మెల్లగా కండ్లు మూసింది కొంరవ్వ. రెప్పకింద కండ్లు కదలాడుతున్నయ్. సలి కొరుకుడు ఎక్కువైంది. తను కుట్టుకున్న బొంతను కప్పుకుంది. సలి సలిగా మెల్లగా నిదురలోకి జారుకుంది.

------888-----

కనకపు గుడాలు

తడుక లేనింట్లోకి కుక్క దూరినట్టు దూరిన సేర్దారును చూసేసరికి మల్లా ఏదోగోరం జరిగిందని తెలిసిపోయింది. కనకానికి.

' ఉన్నఫలానా నిన్ను పట్టుకొని రమ్మన్నడు. దొర' అని తొందర పెట్టిండు. సేర్దారు. 'తప్పుతుందా! మాదిగోన్నై పుట్టినందుకు' అని లేసి కండువ భుజానేసి ఎడమ చేత్తో రుమాలు తలకదిమి నడువుమన్నట్లు తోవ జూసిండు కనకం. ఇద్దరు బయటకు నడిసింద్రు.

గోడకు సున్నమెయ్యబోయిన సుశీల వారంరోజులు దొరికింద నలిగి నలిగి, ఒంటి బంగ్లామీంచి కిందపడి సితికి పోయింది. ఆ సుశీలను ఎవరికంట పడకుండా సమాధి చెయ్యలంటే, ఆ ఊర్లో కనకమొక్కడే సమర్థుడు. కనకం చాలా విశ్వాసపాత్రుడు. కనకమంటే దొరగాడికి భయంతో పాటు గౌరవమూ ఉంది. ఎందుకంటే తాతల నాటినుంచి వాళ్ల గోరకృత్యాలను కప్పిపెడుతూ వస్తున్నాడు కనకం.

సేర్దారు, కనకం ఆ మాట మాట్లడుకుంట, గడీల జొచ్చేది సొర్లంగనే దొరగాడు ఎదురచ్చిండు. మెట్లు దిగుతూ 'పొద్దుగాల్నించి ఎదురుసూత్తన్న యాడబోయినవ్ కనకన్న' బతిమిలాడినట్టు, సేతులు బిసుక్కుంట అడిగిండు.

'నాది సలువ గుణం కదా! యేడికి పోత, నిమ్మసెట్టు నీడే, నీకుదెల్వదా?' కరుకుగా సమాధానమిచ్చిండు.

'మరేం లేదు కనకం...' అంటూ గొనిగిండు నోటమాట పెగలక.

'నస మానేసి ఇషయం సెప్పు' మళ్లీ కనకం గొంతు మోగింది.

'నీకు దెలవందేముంది కనకం...'నక్కిండు.

'బంగ్లా మీంచి నూకేసినవ్ కదా! ఎందుకో?' మొహానకొట్టినట్టు దీర్గిచ్చిండు.

గొంతు పెగల్చుకజేని 'ఇంటికి బొమ్మంటె పోలె, బెదిరించినందుకే దబాలున దూకింది' సెప్పిండు.

అది నంగనాచి సమాదానమని తెలుసుకున్న కనకం, 'కబుర్లు, కతలు నాకు వంట బట్టవని తెలుసు కదా! నిజమూ, నిప్పూ, ఈ కనకం ఒక్కటేనని నీకు తెలుసు కదా! ' గొంతు పెంచాడు.

దొరగాడు ఇరుకున పడ్డాడు, కాళ్ల కిందకు వస్తున్న పంచె చెంగును జేబులో కుక్కి "నూకేసిన మాట నిజమే! ముందు పని జెయ్యవయ్య మొగుడా?' ఆతురతతో భయం భయంగానే సనుగిండు.

ఆ మాటలకు కనకానికి కోపం పెరిగింది. గడీల జన సంచారం లేదు. పాఠకులు మూసింద్రు, ఎండ నడినెత్తి మీదకొచ్చింది. నిప్పుల మీంచి వస్తున్నట్టు గాలి వేడిగా సురకంటిస్తుంది. రెండు పిచుకలు బంగ్లా సూరుకింద కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నాయి. దొడ్డి దగ్గర కాకి ఆకలంటూ కా...కా...అని కూస్తంది.

దొరగాడు భయంభయంగా కాకివైపు బిక్కచూపులతో చూస్తున్నాడు. కనకాన్ని అప్పటికప్పుడే చంపి పారేయాలని కోపాన్ని అనిచిపెట్టుకుంటండు. దొరగాన్ని చూస్తే కనకం కండ్లు సూర్యబింబాల్లా మండి పోతున్నాయి. తాపతాపకి గొంతు కంచువలె మోగాస్తున్నాడు. కాని దొరగాన్ని ఏం జేయలేక పోతున్నాడు. ప్రహరీగోడ పక్కనున్న శవం దగ్గరికెల్లారు. ఆ పక్కనే వేప చెట్టు, దాని క్రింద రాలి ఉన్న ఎండుటాకులు గలగలలాడుతూ దొర్లి శవం మీద పడుతున్నాయి. ఆ శవాన్ని చూస్తే కనకానికి ఎక్కడలేని కోపం వచ్చింది.కనకం పరిస్థితి గమనిస్తూ దొర రెండడగులు వెనక్కి వేసిండు. ఆ గోరకృత్యం కనకాన్ని కలువరపరుస్తూ కడుపుడికిస్తంది. 'వారం రోజులుంచుకుంటివే! ఏ ఆడదైనా ఏ మొకం బెట్టుకొని బయటకి ఎల్లుతది? ఏదైనా ఆధారం చూపెట్టి ఆదుకుంటే నీ సిరిసంపదలు తగ్గిపోతయనుకున్నావా?' ఆర్థంగా దొరను చూసాడు.

'నిజమే! కాని అది మాదిగది'

కనకం బుర్ర కోపంతో బద్దలైంది. ఆవేశం పుంజుకున్నది. మొకం రక్తవర్ణమైంది. దొరను పిసికి చంపాలనిపించింది. కాని చంపలేక పోతున్నాడు. 'కులాన్ని అడ్డుపెట్టి సమర్థించుకోటానికి సిగ్గులేదా? వారంరోజులు ఉంచుకున్నపుడు కులమెటుపోయింది? కులాలుపుట్టించి బతుకనివ్వకుండా చేస్తున్నారే. మీరంతా నాశనం అయ్యేకాలం దగ్గర పడుతంది. నాకులం దాన్ని నాశనం చేసి నా చేత్తో సమాది చెయ్యమంటున్నావ్. నా కంట్లో నా ఏళ్ళుపెట్టి సృష్టిని కనపడకుండా నిజాన్ని దాసి పెడుతున్నావ్. ఎన్ని రోజులు దాస్తావో అదీ చూస్తా! నిప్పులు గక్కుతూ బుసలు కొడుతూ... ఇయ్యాల ఈ శవాన్నిక్కడే ఉంచితే నీ గతేంటి? నన్ను, నా కులాన్ని ఏలెత్తి సూపెడుతున్నావే! ఈ సెనం నేనులేకపోతే నీవు నీ వంశం నాశనమవుతుందని తెల్సే మట్లాడుతున్నావా? అని బయటకు నడవ బోయిండు.

'బుగులు వెట్టకు కనకం, మాదిగ కులం మానవత్వమున్న ఉలం, మంచికి ప్రాణాలైనా లెక్కచేయని కులం' అని పొగిడే సరికి మనిషి కరిగిపోయిండు.

'మాదిగ కులమని నన్ను కించపరుస్తున్నావే, లోలోపనుకొని, ఈసారికి ఈ పనిచేసి పెడుత, గాని మరోసారి నేను ఏ పని చెయ్యను, ఇంకోసారి నాతావున నీ మనిషి కనపడితే.. నీ పీక, ఆడి పీక నొక్కి పంపుతనని' హెచ్చరించిండు.



పిలిస్తే పలుకుతుందేమో అన్నంత దట్టంగా ఉన్న చీకటి. అర్ధరాత్రి. దిక్కులన్నీ చుక్కల ఎండకాసినా, చుక్కల మౌనం సంగీతం వినపడనంత చీకటి. మెరుపు కూడా కనపడనంత చీకటి. గూడెం గుర్రు కొడుతుందనుకున్నాడు కనకం. పుట్ట బెదిరినట్లు గూడెం బెదిరి, తిట్ల, శాపనార్థాలతో బొంద కూడుపుతున్న తన చుట్టే చేరింది. అందులో దొరగాడు కూడా ఉన్నాడు. ఇది వరకెప్పుడు అణుకు తెల్వని కనకం సిత్రంగా జనం తావు సూత్తూ, అణుకుతుండు. అతని చేతిలో పార చేజారింది. పట్టిన సెమలను నెత్తిరుమాలుతో తుడుసు కొన్నడు. తిట్లు గునపాలై పెయిని గుద్దుతున్నయ్, సుత్తె తలను బద్దలు కొడుతున్నట్టు ఒక్కొక్క బూతు. గుండె సిద్రాలుపడతంది. పెయంతా సందులేని

అవమానం సజీవ సమాధి చేయడానికి జనం సిద్దమైరాళ్లు రువ్వుతుంటే కొలిమిలో ఎర్రగ కాలిన ఇనుప ముక్క మీద వేస్తున్న సుత్తె దెబ్బల్లా తగిలి, గాయాలై రగతం సిమ్ముతంది. పెయి మొద్దు బారింది. ఏసుక్రీస్తులా సొమ్మసిల్లి తూలుతుంటే దొరగాడికి జాలేసి జనాన్ని ఆపిండు. కలవర పడుతున్న పొద్దున చూసి ముందు పక్షుల రెపరెపలు. కలకలం. కోడికూత. కాకుల అరుపులు. ఆ తరువాత సన్నని వెలుగు, ఆపైన బంగారం లాంటి ఎండ, ఆ తరువాత బాయి గిరకల చప్పుళ్ల అలా తీరిగ్గా పొద్దెక్కింది. రచ్చబండ దగ్గర సెట్టుకు కట్టేసారు కనకాన్ని. కొన ఊపిరి, నిలబడలేని సత్తువ, మొకం మీద నీళ్లుజల్లి మెలకువ తెప్పించారు. ప్రాణంలేని కట్టెబొమ్మలా నిలబడ్డాడు. అరమోడ్పు కన్నులతో ఎదురుగా జరుగుతున్న గోరాన్ని గమనిస్తున్నాడు. దొర రచ్చబండ మీద కూసుండి నాయెం సెపుతండు. 'సెవుల సుశీల ఆత్మ సరగం సేరాలంటే ఈడికి తగిన శిచ్చ ఈ ఊరినుండి ఎలేయడం' అని అధికారికంగా తీర్పిచ్చిండు. లేని బలం తెచ్చుకొని కనకం నీరసంగా నవ్విండు. ఆయన కళ్లముందు నల్లని మచ్చలు తిరుగుతున్నాయి. గుండెల్లో దాగి ఉన్న ఆవేశం, కడుపులో ఆవిరై మసలుతుంది. దయ అనేది ఆయనకు గుడ్డుగా, ధరమం ఆయన కనురెప్పగా ఇంత కాలం కొనసాగినాయి. కాని అటువంటి దయాధరమాలు తన ఎదురుగున్న జనంలో లేనందుకు బాధపడి పోతున్నాడు. అది ఎవ్వరికి అర్థంకాక ఎవరిదారిన వాళ్లు ఎల్లిపోయింర్రు. దొరగాడు దగ్గరకొచ్చి ఏదో విచారాన్ని వ్యక్తం చేయబోయాడు. అదివారించి 'నేను నమ్మిన బంటుని, నాకు ఈ వేళ తానం లేదు గావచ్చు, రేపు ఎక్కడైనా ఉంటుంది. పెపంచకంలో నమ్మిన బంటుకు సావులేదనే సంగతి నీకు తెల్సే నిరూపించావ్, నామీద నాకు ఇశ్వాసం ఎక్కువ. అందుకే నేనే నిన్ను ఎలేసినా.... హా... ఏలెత్తి శాసించాడు కనకం. కంగుతిన్న దొరగాడు. సప్పుడు సేయకుండా తన దారి తను పోయిండు.

పెయిమీద దద్దులు తుడుసుకుంట సుక్కాని లేని నావోలె బయలుదేరాడు. ఎత సముద్రంలో ఎటుపోయినా, మనిషి తిమింగలాలు నోరు పారేసుకుంటూంటే ఏ దారెల్లాలో తోయలే. పొద్దుగూకుతంది. పచ్చులన్నీ గూడు సేరుతున్నాయి. తను కాళ్ళు రెక్కలున్న ఏ గూడులేని ఓ పెద్ద పచ్చేఇపుడు. మనుషులున్న కారడవిలో ఆలోసనా కంపల్లో ఆనాతిరి నిమ్మసెట్టుకిందొరిగిండు.

పొడుత్తున్న పొద్దుకెల్లి మూడు మైళ్ల దూరం నడిసిండు. సెట్టు, పుట్టల్లేవు. కనుసూప మేర మనిషి కానరాడు. కాని ఒకేఒక గులాబి, గుబ్బల్ల నుంచి పుట్టుకొచ్చింది. దానికింద కూసుందామంటే గుచ్చుకునేటట్టుంది. పైగా నీడే లేదు. ఇంకా ముందుకు నడిసిండు. ఏనంక సెరువెదురయింది. మెల్లగా సెర్లదిగి ఐదు దోసిళ్ల నీళ్లు దాగి దూర తీర్సుకున్నాడు. కట్టపైకొచ్చి నీడతావు సూత్తె యాడ కనిపించలే. కనపడ్డదల్లా ఓగుండు. దాని సాటుకు కూసొని కూసింతసేపు కునుకుపట్టిండోలేదో... కేకలు, పొడబెబ్బలు పెడుతూ గొంతు చినిగేటట్లు ఏడుత్తూ... ఓపిల్ల దబేలున సెర్ల దూకింది. కన్నుతెరిచి చూసెంతలో పనైపోయింది. కనకం ఆమెను గడ్డమీదేసిండు. ముకం తుడిసిండు. నీళ్లు గక్కించిండు. ఆమె లేచి భయంగా ముడుచుకొని కూసున్నది. ఆమె ముద్దబంతిలా తడిసి మెరిసి పోతంది. ఆమె వణుకు ఎంతకూ తగ్గడం లేదు. ఆమె పరిస్థితిని నిదానంగా గ్రహించి ఆమెను అక్కన్నించి లేపి తను కూసున్న ఓ గుండు నీడన కూసుండబెట్టిండు. ఆమెనుద్దేశిస్తూ ... 'పెద్దోల్లు, చిన్నోళ్లను నమ్మబలుకుతరు. నమ్మినవు, దొరోడెత్తుకెల్లిండు. నలిపిండు, నీకేమో బతుకాలనిపించలే... ఎంటనే సెర్ల దూకినవ్.' కనకం మాటలకు ఎంతంత ఎల్లిపోయి ఇసిత్రమైన ఆలోచన్లో పడ్డది ఆ పిల్ల.

'సచ్చి సాధించేదే లేదు. నీకు బతుకు లేదనుకోకు. మోతుకాకులు లేనప్పుడు తిని పారేసిన ఇత్తారాకులను సుట్టలు జేసుకొని తాగుతున్నారు మాదిగోల్లు. ఎంగిలి ఇత్తారివనుకోకు పో బేగెల్లిపో. పెంటలమీద మొలిసిన ఒక సింత, వేప, మామిడి, జామ్మొలకలు ఏది దొరికితే అది పట్టుకొని రా!... తెచ్చిచ్చి పున్నెం గట్టుకొని ఆ తరువాత సావాలనిపిత్తె సావు' అని నికార్సుగా సెప్పిండు...

అనుకుతున్న పెదాలు తడిసి మెరుతున్నయి. ఏడుపులో కూడా గంగమ్మంత అందంగుంది. తడిసిన బట్టల్లో ఆమె శరీరం ఒంపు సొంపులు దేనికదే ఎదుటి వ్యక్తిని రెచ్చగొట్టేలా చాలా పొందికగా కనపడుతున్నాయి. అందుకే దోరోడు కన్నేసిండు. కనకంతో ఏ మాట్టాడాలో ఆమెకు పాలుపోలే... మెల్లగా ఇంటిదిక్కు అడుగులేత్తంటే ఆమెనుద్దేశిస్తూ 'బొందిలో పానముండగ ఏదైనా పున్నెం జేత్తే సచ్చింతరువాత ఆత్మ శాంతిత్తది. "మరో మాట చెప్పిండు. ఎనక్కి తిరిగి సూసి, ఆయన మాట అంతయిపోయింతరువాతే మల్లా కదిలింది. ఆమె పరధ్యానంగా ఉంది. చెప్పరాని విచిత్రావస్థ ఆమెలో బయలు దేరింది. చాలీచాలనీ ధైర్యం, కాళ్లలో వణుకు, అకారణంగానే గుండెలో దడదడ, మనసంతా మాటిమాటికి బరువెక్కిపోతంది. ఏమీ ఆలోచించకుండా అట్టే అతనివైపే చూడాలనిపించిందో ఏమో. నిట్టూరుస్తూ...దోరోని సంగతి మరిసింది. అన్నీ మరసి ఆలోసనల్లో పడ్డది. తనను మొలకలెందుకు తెమ్మన్నడు, ఈ ఇసిత్రమైన మనిషిని.

పొద్దున్నే మొలకలు తెచ్చింది గంగమ్మ. ఎంతో కట్టపడి ఎన్నో మాటలకోర్చి లోకం ఆడిపోసుకున్నగాని లెక్కసేయకుండా మొలకలు తెచ్చింది. దీర్ఘంగా పదిసేనాలు ఆ పిల్లను సూసి 'నువ్వు ఊళ్లెకెల్లితె మాటల బాంబులు ఎప్పుడు ఎక్కడ పేలుతాయో తెల్వదు. అక్కడ నీ బతుకు ఇరువై ఐదు ఏళ్లు. ఇక్కడ నీకు వందేళ్లు. ఊళ్లె నీవు గన్నేరు మొక్కవి. ఇక్కడ నీవు గందపు సెక్కవి. నీ సావు నీ సేతుల్లోనే ఉంది. అని బతుకుమీద ఆశ కలిగించిండు. మతిపోయిన దానిలా కళ్లు పెద్దవి చేసి ఆయన వంక చూసింది. మనసులో కలవరం బయలు దేరింది. ఆమాటలకు ఆమె మనసు వికసించింది. మరో సృష్టికి గంజి పోసింది.



కారుతున్న చమటను పైట కొంగుతో తుడుచుకుంటంది. ఆయనేమో చిన్న కట్టెతో పొక్కతవ్వుతున్నాడు.వారిద్దరి మధ్య చాలా నిశ్శబ్దం. చెరువు మీదినించి చల్లగాలి వీస్తంది. పై పంచెతో తను ఒళ్లంతా తుడుచుకుంటున్నాడు. కాసేపాగి ఒకరి మొకాలు ఒకరు చూసుకున్నారు. పొక్కలు తవ్వుతాంటే ఇమె కాళ్ల మీద కూసొని మట్టి తీస్తంది. పొక్కలు తవ్వినంక, మొక్కలు నాటమన్నాడు.

'అయ్యయ్యో! నేను సెడిపోయిందాన్ని నా సేతేట్టితే ఎట్లా?' అనుమానం వ్యక్తం చేసింది.

'ఎవరన్నారు? మనం పరిశుద్ధులం, ఆత్మ గౌరవమున్నోళ్లం నీ మనసు సెడిందని నేననుకోవటంలేదు. పెట్టు పెట్టు 'మని ధైర్యమిచ్చి ఊరట కల్గించిండు. అతని వైపే సూసుకుంట నాటింది. తను కండువతో నీళ్లు తెచ్చి మొక్కలమీద పిండిండు.

ఇద్దరు సెర్వులకెల్లి సేతులు కడిగి గట్టుమీదకచ్చింద్రు. పొంగుతున్న ఆవిరోలె పొర్లుతున్నయ్ పేగులు ఆకలితో. పైకి శూన్యంలోకి సూసాడు. పట్టపగలే కట్టమీద పిట్టలపోరు జోరయితే అటువైపు నడిసిండు. కట్టమీది సెట్టుమీద ప్రమాదాన్ని తెలియజేస్తూ పిట్టలు అరుస్తున్నాయి. ఆ సెట్టును పరీచ్ఛగా సూత్తె పాకుతున్న పాము గుడ్లను తినటానికి గావచ్చు. అతను సూసిన సెనమే ఆ కాలనాగు కాలి బుడిదైంది. పిట్టలపోరు సద్దుమనిగింది. కాని ఆయన కడుపులోని ఆకలి గోల మాత్రం తగ్గలేదు. ఆ సెట్టుకిందే కూసొని ఆలోచించసాగాడు. మళ్లీ శూన్యం లోకి సూపు. పైన గద్దలు తిరగటం వల్ల నల్లమాటు బండమీద గొద్దును కోసింద్రని తోసింది. తడవు సేయకుండ తావు సేరిండు. అక్కడ తనకు బాగా తెలిసినోల్లు కులంగౌరవం మీద కనకానికి కూర బెడితే దాన్ని కండువలో గట్టిండు.పట్టపగలు నడిసే ఒపిక తెగిపోయింది. కారటానికి ఒంటిటో సెమటచుక్కలు కూడా అయిపోయినయి. సొమ్మసిల్లేటట్టున్న కనకాన్ని గమనించిన పెద్దరాజిగాడు 'అప్పయ్యా నల్లదిని పోదువుండని' గిదగిదురికి ఒర్రెలో ఉడుకుతున్న కొత్తకుండ దించుకొచ్చిండు. ముత్తడు మురక సూసిండు, కొండడు కొసనాలికమీద బెట్టి ఉప్పు రుసి సూసిండు. దాసుగాడు ఇత్తారి కుట్టుకచ్చుకొని పెట్టమని కూసున్నడు. 'మీరంతా ఆగండేహె' అని మోదుగాకుల్లో కనకానికి పెట్టి తిన్నమన్నడు ముత్తడు. తినేంత తిని మిగిలింది ముల్లె గట్టిండు.'మీరంతా సల్లగుండ. నేను బత్తే మీ రునం తీసుకొంటా'నని నాటిన మొక్కటవైపెల్లిండు. అక్కడ అమ్మాయేడ్వటం గమనించిన కనకం దగ్గరికెల్లి 'ఏడ్వటం ఎందుకులే'...అని ముల్లె తీసిచ్చిండు. అది వండుక రావలెనని నిశ్చయించుకొని చెప్పకనే ఇంటి దారి పట్టింది గంగమ్మ.



తేల్లు,పాములు గుట్టినోళ్లంతా కనకం దగ్గరికి రావల్సిందే. ఏ డాక్టర్ నయం సేయని రోగాలను కనకం నయం సేత్తండు. పదిహేనేళ్ల సేవ కనకానికి సేయి తిరిగినట్టయింది. ప్రతిఫలమాశించని సేవ. ఏలమంది పాణాలు సంరచ్చించ బడ్డయి. ఎలేయబడ్డ కనకం ఇపుడు అందరికి దైవం. ఆయన నీడ లేందే ఏ జీవి బతుకదన్నట్లయింది. వస్తు,వాహన, ధన, కనక, వజ్రవైడుర్యాలు మొదలగు అనేక రీతుల్లో విరాళాలు రోజు కనకం ఆశ్రమానికి చేరేవి.

దారిన పోయేటోల్లకు రేయింబవళ్లు కొత్తకుండలో నిమ్మరసం ఉంచేలోళ్లు. ఏడసూసిన తెల్లదనమే, పైన శాంతికపోతాలు మూడు కిలోమిటర్లు తిరిగేవి. బయటనించి ఏ జీవచ్చినా పొమ్మనే వరకు తిరిగి పోవాలనే ధ్యాస రాని తావది.

ఓ దినం ఒక్క మాటనే పది సార్లుచ్చరించే హరికి నోరు దగ్గర పడి పచ్చావాతమచ్చింది. ఆడికి డబ్బు తెగుంది. బాపనోడు గాకున్నా బాపనోన్ని అనుకుంటడు. కనకం దగ్గరికిపోతే నయమవుతుందని తెలిసి కూడా రాటానికిట్టపల్లె. సివరికి రాక తాప్పలే.

సుట్టు మూడు మైళ్ల దూరం సెట్టు సేముంది. బయటనించి సూత్తె కొంతమందికి అడవిలాగా కనిపిత్తది.అందులో సొరబడి కనకం దగ్గరకెల్లాలంటే కట్టమనిపించింది హరికి. అలోచించుకుంటు బలవంతానా గేటు దగ్గరకొచ్చిండు. ఆడున్న రాజు తన చేతికున్న ఐదేళ్లు చూయించి 'ఒక్కేలు

పట్టుకొమ్మ'న్నాడు.

'నీ కులమేది బాబు?' అని ఎంబటొచ్చినోడడిగాడు.

'మాదిగోన్ని' అన్నడు రాజు వినయంగా...

మాదిగోని వేలు పట్టుకోవటం అంటే విరక్తి కలిగింది హరికి. అయినా తప్పలె.

'పట్టుకొంటేనే లోనికి దారి' అన్నాడు.

గేటు దగ్గరున్న రాజు ఐదువేళ్లకు ఐదు గుణాలున్నాయి. ఆ ఏల్లు పట్టుకొంటేనే రోగం నయమవుద్దా లేదా అనేది తెలిసిపోతంది.అది అక్కడి ఆశ్రమానికి పెట్టింది పేరులా కొనసాగుతంది. వేలు పట్టుకోటానికి ఇష్టంలేని హరి అంటి అంటనట్లు మద్దేలు పట్టుకున్నాడు.

గేటు తెరచి లోనికెల్లమన్నాడు రాజు

సొచ్చేది సొరంగనే ఇకిలించి రెండుసేతుల దండంబెట్టి నిమ్మరసం అందించింది కోతి. తొవ్వకూడా సూయించింది. లోపలికెల్లుతుంటే సిరుగాలి ఊపులకు ఏసిరూముల్లో పండుకున్నట్లుంది హరికి. సప్పట్లు కొదుతున్నట్టు ఆకులు సాగతం పలుకుతున్నయ్. కనువిందు కలిగించె ఓ సెట్టు సెంటు గుమ్మరించింది. మల్లెలు గమ్మత్తుగా గుమాలిత్తున్నవి. అరటాకులు ఆహ్వానానికి రెపరెపలాడుతున్నవి. రకరకాల పూలు రాలి తోవెంబడి తనకోసమే పరిసినట్లు పడివున్నవి. అక్కడ ముంగిస, పాము, కుక్కపిల్ల, ఎలుక, బద్ధశత్రువులుగా ఉండేవన్నీ సినేహితంగా ఆడుకోటమే. ఈ ఇసిత్రం సూసిన హరికి పక్షవాతం సగం పోయింది.

కనకాంబరాలు, గులాబీలు, బంతి, చేమంతి పూలుదారికి గోడబెట్టినట్టు ప్రేమానురాగాలు ఒలుకబోత్తున్నవి. మందారాలు, నూరు వరహాలు, సెన్నంగి, సీతమ్మపూలు, గోరింటలు రకరకాల పూలు గుడారం సుట్టు ఇస్వాసాన్ని వెదజల్లుతున్నయ్.

దేవాలయంలో దేవునిలా, గుడారంలో పరిశుద్దంగా ఎక్కడో దూరంగా కూర్చున్నట్లు ఛాయగా కనపడుతున్నాడు కనకం. అతను ఏపసెట్టుకింద కూసున్నడు. హరిరాగానే కొబ్బరి సెట్టు దిక్కు సూసిండు కనకం. అంతే! అతిథచ్చిండని కొబ్బరిసెట్టు ఓ బొండాన్ని కిందపడేసింది. సంటిబాబొచ్చి కటకట కట్జేసి నోటికందించిండు. తాగిన తరువాత సింధూర ఆకులమీద హరిని పండబెట్టి నాడీని జాగరతగా సూసిండు. రాజు సెట్టు పసరు పేరు సెప్పంగనే దాసుగాడొచ్చి రసం దీసి ఒంటికి పట్టిండు.

తెల్లారి హరికి బలమచ్చినట్లయింది. పదిహేను రోజుల్లో హరి మారిండు. మరో జలమమెత్తిన మంచిగ్గాకపోవు. తన రూపు తను తెలుసుకొని రెండు సేతులెత్తి దండం పెట్టాడు కనకానికి.

నేనుగాదు చేయి అడ్డంగా ఊపి, నీకు నయం సేసింది ఈ ప్రకృతి. దీనికెట్టు దండం' అని ప్రకృతిని సూయించిండు.

అతని ఔదార్యానికి అవాక్కయిండు హరి. ప్రకృతిని తిలకిస్తూ నిజానికి మనదేశాన్ని ఉపఖండమని ఇందుకే అన్నారేమో అనిపించింది

హరికి.

హరి నడిసెల్లుతుంటే ఊరి జనమంతా ఇసిత్తరపడ్డరు. కనకం సేయి గుణమే అంతా అని కనకాన్ని పొగిడింగ్రు. కనకం ఉన్న జాగ పెద్ద దేవాలయం అయిపోయింది. అక్కడున్న ఒక్కో సెట్టు ఒక్కో కులానికి సెందిందైతే అక్కడికొచ్చే జనం ఒక్కో రాట్టానికి సెందినోళ్లు. ఫలానా సెట్టు లేదనేదే లేదు. సుట్టు సింతసెట్లు నడువ ఏపసెట్లు, ఆయనకు గుడారంగా మల్లె తీగలు, ఆయన్ని సంరచ్చించే రేగుచెట్లు, మామిడిచెట్లు, అల్లనేరేడు చెట్లు, వాడికి తోడు మాట్లాడే సిలుకలు, కోతులు, ఇస్వాసం గల కుక్కలు, గుర్రాలు, లీటర్లకు లీటర్ల పాలిచ్చే బర్రెలు, కోళ్లు, సీమకోళ్లు, బాతులు, కుందేళ్లు, ఆకాశన సంచరించు పచ్చి జాతంతా కనకానికి సినేహితులే. అటు అచ్చొచ్చినభూదేవి. ఎటు చూసినా మూడు కిలోమీటర్లు తనుకులీను పచ్చని ప్రకృతి. ఎంత ఆహ్లాద భరితమో!



దొరగాడికి పచ్చకామెర్ల రోగమొచ్చింది. ఎన్నో మందులు తిన్న రోగం పోతలేదు. కండ్లు మసకలచ్చినట్లుంది. అతన్ని సూడలేక ఓ రోజు సేర్దార్ కనకం సేత అయిదుగం సేయించుకొమ్మని చెప్పాడు.

చాలా రోజులు ఆలోచించిన తరువాత కనకం అత్తడో రాడోనని అనుమానంతోనె దొరగాడు కబులు సేత్తెరాలె. కొద్దిరోజులకు తాళలేని పరిస్థితిలో మల్ల సేర్దారును అంపిండు. ఇరవైఐదేళ్లు గడిసింది బయట కాలు మోపక. దొరిచ్చినా దొరమీది దావరొచ్చినా మా అయ్యగారు రారని' రాజు కరాకచ్చితంగా తెగేసి సెప్పిండు.

ఆ మాటలకు సేర్దారకు కోపమచ్చి 'రాకపోతే ఏం జరుగుద్దోతెలుసా? పిల్లకాకులకేమి తెలుసు ఉండేలు దెబ్బలు' అని హెచ్చరించినట్టన్నాడు.

రాజు ఏమి పట్టనట్లు లెక్కచేయలె. దాంతో సేర్దార్ఉ కోపం రెట్టింపై కండ్లెర సేసుకొని దబ్బునెల్లి దొరకు సెప్పుకుండు. ఓటికి రెండెక్కిచ్చి సెప్పేసరికి దొరకొల్లు మండింది. ఎనుకాముందేం ఆలోసించక నలుగురు తొత్తులనంపి కనకాన్ని ఈడ్సుకరమ్మన్నడు.

ఆ నలుగురు దున్నపోతుల్లాగా... ఏనుగుల్లా... రగతం తాగే రాజకీయ నాయకుల్లా ఒల్లుపెట్టి కన్ను మిన్నుగానకుండా ఉన్నరు. అప్పటికప్పుడే గేటు దగ్గరికెల్లింగ్రు. పిట్ట కొంచెం కూత ఘనంలా గేటు దగ్గరున్న పొట్టిదాసు 'ఏంగావలె' అడిగిండు.

'గేటు దగ్గరున్న కుక్కవి నీకు సెప్పేందిరాక్ష్మ పండ్లెల్లపెట్టి వెటకారంగా ఒకడన్నడు. వాని పండ్లు రాగితో చేసినట్లున్నాయి.

ఒరేపొట్లోడా! నీ అయ్యేదుండురా? ఇంకొకడు రెచ్చిపోయిండు. వాని పొట్ట గాజెలా ఉంది.

అయ్యదగ్గరికెల్లాలంటే ఈ ఐదేళ్లలో ఓ ఏలు పట్టుకో' అని చేయి చూయించిండు దాసు.

నలుగురు ఒకరి మోహం ఒకరు సూసుకొని నలుగురు నాలుగేళ్లు పట్టుకొని ఇరిసింగ్రు...

అమ్మా! మ్మా.. మ్మా.. కేక బెట్టిండు దాసు. మదుకిలోమీటర్లు దిక్కులు పెక్కటిల్లాయి. వనదేవత దిగ్గున నిద్రలేసి ఒళ్లుదులుపుకున్నట్లు చెట్టుసేమ ఒక్కసారిగా గుప్పున ఊగిసలాడింది. దాసు విరిగిన ఏళ్లను ఎడమచేత్తో పట్టుకొని తల్లడిల్లుతు మీకు బతుకుమీద ఆశుంటే ఎల్లిపోండ్రి, లేకపోతే అన్నాలమైపోతరు' అని హెచ్చరించిండు.

ఏందిరా నువ్వు పెద్ద బెదిరిత్తున్నవ్ అని ఒకడు దాసును అమాంతం పైకెత్తంగనే దగ్గరున్న కోతి ఇకిలించింది. గుర్రం కాళ్లు పైకెత్తి సకిలించింది. కనిపించని చోటునుంచి కుందేలు కీచులు, సిలుకల అరుపులు, కాకుల గోలలు, గరుడ పచ్చిపిలుపులు, సిరుగాలి సవ్వడి, బాతుల రెపరెపలు, కోళ్లు బెదిరిన కేకలు, అదనుకోసం ఎదురుచూస్తున్న కుక్కలమూలుగులు, ప్రకృతి ఆక్రందన, ఇవన్ని సూసి, ఇసిత్రపడ్డరు. ఉన్నట్టుండి భూమి కంపించినట్టయి పెద్దగాలితో దుమ్మెత్తిపోసింది. దాసును దించి బిత్తర పోతున్నరు. రెట్టింపైన సుడిగాలికి తట్టుకోలేక పోయింగ్రు. బుగులు పుట్టింది. భయంతోనే లోనికెల్లింగ్రు. కోతి నవ్వుతూ నిమ్మరసం పోసింది. ఆళ్లు తాగితే ప్రకృతి సద్దుమనిగి, హోరుగాలి తగ్గుగావచ్చు. కాని ఆ రసాన్ని తిరిగితే కోతిమీదే గుప్పింగ్రు. కోతి ఆపదలో ఉన్నట్టు ఒర్రింది. సెనంలో కోతి రాజ్యం దిగి నలుగురిపైబడింది. ఆ నలుగురిని తరుముకుంటు పగ్గం పెట్టు పరుసుకొనున్న కాలరుచ్చం దగ్గరికి తీసికెల్లినై. వాళ్లు కాలరుచ్చం రెక్కల్లో అడుగు పెట్టంగనే దంపరెత్తినట్టు పైకెత్తింది. పెడబొబ్బలతో ఒర్రుతూ గిలగిల కొట్టుకుంట, బెదురు చూపులతో సతమతమవుతున్నారు. ఎత్తిపట్టిన కాలరుచ్చం బట్టను పిండినట్టు పిండికింద పడేసి ఏందెలియనట్టు ముడుసుకొని పడడం చూసి కోతులు నవ్వుకున్నాయి. పక్కబొక్కలన్నీ పరంపరమైన ఆళ్లనుగాడిద మీదెక్కించి దొరోడికి బహుమానం పంపిండు దాసు.

పచ్చకామిండ్ల కండ్లు పెద్దయి జేసి తిప్పి తిప్పి చూసిన దొరకు సల్లసెమటలు బట్టినయి ఏమి తెలియనిస్థితిలో ఆళ్లదిక్కే సూసుకుంట కుర్సిలో ఒరిగిండు. ఆరం గడిసింది. దొరకు సావుదప్పని పరిస్థితిలో సేర్దారు బతిలాడిండు. మనకు పానం ప్రధానమని మొత్తానికి దొర నొప్పించి, టాగ మీద కనకపుగుడికి తీసుకొచ్చిండు. గేటు దగ్గరకు నిలుసాని ఇదే కనకపుగుడి అని చూయించాడు. పచ్చకామిర్లోడకదా! పైగా అక్కడంతా పచ్చగానే ఉంది. ఏది కనకపు గుడో తెల్సుకోలేకపోయిండు. పాములతో మెలగవచ్చుకానీ, సాములతో మెలగ రాదనుకొంటా ఆశ్చర్యంగా ప్రకృతిని తిలకిస్తున్న దొరను దండం పెట్టమన్నాడు సేర్దార్. దాంతో దొరోడికి కోపం ముంచుకొచ్చింది. సేర్దార్ను కొరకొర చూస్తూ ఊ.. నేనేంది, ఈ సెట్లకు పుట్టలకు, పిచ్చకుంట్ల మాదిగోళ్లకు దండం పెట్టడమేంటి?.. అధికారస్వరంతో అన్నాడు.

అయ్యా! అట్టనకు దండం పెట్టాల్సిందే! ఇది మన పనికదా! బుదరగిచ్చిండు.

దొరోడు మారాం చేస్తూ 'ఊహూ నే బెట్టరా! నా మనసొప్పటం లేదురా మొరాయించిండు.

'నువ్వు పెట్టేది మాదిగోడికి కాదు దొర' రహస్యం చెప్పినట్టు చెవిలో గుసగుసలాడిండు.

మరి? ఎవరికన్నట్లు' ఇంకా తల దగ్గర బెట్టిండు అనుకూలంగా.

'ప్రకృతికి బెడుతున్నావంతే! చెవిలో ఊదిండు సేర్దార్.

అక్కడ తనను పొగిడేది, దించేది ఒక్క సేర్‌దారే! కాని వాళ్లను పట్టించుకునేటోళ్లేలేరు.

సర్లె అని అటు ఇటు జూసి కండ్లు మూసుకుని దండం బెట్టిండు. ఆ తరువాత గేటు తెరవ మన్నట్లు గేటు దగ్గర నిల్చొంటే గేటు దగ్గర్రాజు 'సేయి సూయించి ఏలు బట్టుకొమ్మన్నడు' అయిష్టంగానే టక్కున బోటనేలందుకున్నడు దొర.

నీ అట్లంటోళ్లత్తనే గుడి అంతా కంపు వాసన. ఎల్లెల్లు మని లోనికి సూయించిండు.

ఏరా! ఆడు అట్టంటడేందిరా? భయంతో కూడిన మనసుతో అడిగిండు.

సేర్‌దార్ సప్పుడు సేయకుండ లోనికెల్లుతుంటే బాతు రెపరెప గొట్టుకుంట ఎదురొచ్చింది. నిమ్మరసం తాగమని సిలుక సెప్పే సరికి ఇసిత్రపడి దాని దిక్కే స్తూతండు దొర. సిలుక మాట్లాడే సంగతి సినిమాల్లో సూడటం తప్ప స్వయంగా చూడలేదెప్పుడు. నిమ్మరసం తాగి లోనికెల్లిండు. తొవ్వొంటి అన్ని రేగుముండ్లే కనబడుతుంటే మార్గం తెలియక ఎట్టబోయేదని అడిగిండు.

ముండ్లుకాదు దొరా అన్ని పూలె. నీకు ముండ్లోలె కనపడుతున్నయ్. కొంతదూరం పొంగనే రంగేలిసెట్టు గుప్పుమని బూడిదను కుమ్మింది. అది కంపువాసనతో కూడుకొని ఉన్నది. ఆ వాసన దొరగాడి ముక్కున తన్నే సరికి మొకం గడిగినవారా? నోరంతా కంపు గొడుతంది. చిరాగ్గా అడిగిండు.

రోజు యాభైమంది దగ్గరికెల్లటోన్ని నాకే వంక బెడుతున్నవ? దొరా.. అది నీ నోట్లకెల్లె అత్తందనుకొంటున్న మోహమాటం లేకుండా అన్నడు. ఆ తరువాత వాళ్ల నోళ్ల మీద వాళ్లకు అనుమానం తీరినంక, ఈ చెట్ల కంపే మనలను ఇబ్బంది పెడుతందని నిర్ధారించుకొన్నరు. అవున్రా? నాకు తెలియకడుగుతా! ఇంత కంపులో ఈల్లెట్లుంటర్రా! పైగా ఇది కనకపుగుడి అంటంద్రు గదరా! విచిత్రంగా అడిగిండు దొర. ఇది పవిత్రమైన గుడేకాని మనం అడుగు పెట్టినాళ్ల మంచి గాదొరా! సావదానంగా సమాధానమిచ్చిండు.

మాట్లాడకుండ ఆ ఇద్దరు ఊగేసెటుటకు దగ్గరవుతుంటె దాని ఊగటం ఇంకా ఎక్కువైంది. దాని గాలి సోకితేనే తలలుతిరిగినట్లయి, తట్టుకోలేక లోపలికి ఉరికింద్రు. మొసపోసుకుంట ఓమామిడి సెట్టుకింద నిలుసుండి వెనక్కి తిరిగి ఆ సెట్టుదిక్కు సూత్తె ఊగడం ఆగిపోయింది. గాలికూడా రావడం లేదు. ఒకిర మొకం ఒకరు సూసుకొని ఇసిత్రపడ్డరు. ఆ సెట్టు మనుషులు దగ్గరుంటేనే ఊగుతది. లేకపోతే లేదని సేర్‌దారు మల్లొకసారి వెనక్కి సూసిండు. ఇంతలో మాట్టాడెసిలుక మామిడికాయను కొరికి సరిగ్గా దొర తలమీదేసింది. 'అమ్మో!' అని పరుగుదీసిండు. దొరెంబటేసేర్‌దారురికిండు. దగ్గరున్న సింతకింద కాసేపు కూసుండి పోదామని అనుకునేలోపే కాకిరెట్ట దొర బట్టలమీద పడి సేర్‌దార్ మీద సిల్లింది. ఇట్టమనం సెట్లకిందుంటే ఈ కట్టాలు దప్పవని ఇప్పటికే సానా కట్టాల్లో ఇరుక్కున్నామని, పడుతూ లేత్తూ, సివరికి కనకపుగుడి దగ్గరికెల్లి కనకాన్ని సూసి ఇసిత్రపోయిండు. నాడు కొట్టొచ్చిన్నాడు ఎలా ఉన్నాడో ఈ రోజు అట్టాగే ఉండడం ఏం విసిత్రమని సోద్యపడ్డడు. సంకుచితమైన మానసిక వ్యథతో కనకం గురించి ఆలోసిత్తు ఏడికో ఎల్లిండు దొరగాడు. ఇంతలో భుజం తట్టినట్టయింది. సల్లటి ఆ సెయ్యి తగలంగనే కలల్లోంచి తప్పుకొని కండ్లముందున్న కనకాన్ని సూసిండు. కనకంలో అదే సిరునవ్వు అదే మృదుత్వం అదే దయాగుణం అనే సూపులు మల్లా ఆలోసన్లల్లపడ్డడు దొర.

పండబెట్టి నాడీ సూసిండు. మేక్కసాయంతో, ఊగెసెట్టు పసరు గలిపి తాగిపియ్యమన్నడు. వారందాకా మర్రి తొర్రలో పండబెట్టమని గుడారంలోకి ఎల్లిపోతున్న కనకం నడకలో ఏమి మార్పు రాలేదని అనుకుంట దొర సతమతమైన హృదయంతో ఆలోసిత్తూనే బలవంతపు కలత నిద్రతో పడుకున్నడు.

తెల్లారి కనకమచ్చి దొరను లేపి సూసిండు. పరేషాన్‌గా సూత్తున్న దొరను సూసి 'గన్నేరు మొక్క పానాలుదీత్తది. గంధపు సెక్క పానాలు పోత్తదని నేనేడానో సెప్పిన. గడిలో గడియలు లెక్కబెట్టుకొని వాళ్లంతా కనకపు గుడి నీడలో కాలాన్ని శాసిస్తాంద్రు. నువ్వేమో ముసలోడివయ్యావు. నన్ను సూత్తే ఎవరైన నమ్ముతరా. నీకంటే సిన్నోడినంటే నమ్ముతరు. అది నీ కర్మం. ఇది నా కర్తవ్యం. నీవు నలిపేసిన ఇత్తారాకు. ఈప్రకృతి ఆకృతికి తల్లైంది. ఆ చల్లని చేయి, ఈ ప్రకృతి తల్లి నిన్ను ఇపుడు ఏమైనా చేయగలదు. కానీ ఇక్కడ అన్ని గంధపు సెట్లే. భయపడకు జగంమీద నమ్మదగింది ఒక ప్రకృతినే. ప్రకృతెన్నడూ జీవాన్ని మోసం చేయదు.' అని నిజాల నిప్పులా పెట్టెనిప్పేసరికి, అవి తిట్టుల్లా పచ్చిబూతుల్లా సూటిపోటి మాటల్లా అనిపించాయి దొరకు. ఆ.... మాటలకు పెద్ద బాడిసెతో సెక్కినట్టయితంది. 'మాదిగోడేంటి నాకేంటి సెప్పటం'లోలోన మితేన్‌గాసు లాగా ఒడిసిపోతున్నడు.

నాకు తెలుసు నీ కడుపుడికిపోతుందని, కాని నీకు లాగా ఒకడెక్కువ, ఒక్కడు తక్కువ ఈ ప్రకృతెంచదు. అందరికి స్వచ్ఛమైన గాలి ఇత్తంది. అదేగాలి నువ్వు పీలుత్తన్నవ్, నేను పీలుత్తున్న.' ఈ వింత లోకం గురించి ఎన్నో తీర్ల హితవు పలికిండు కనకం. దొరగాని గుండెరాయికాదు ఇనుపకండె. దాన్ని సానదీయడం కనకం వల్ల కాదని తెలిసిపోయింది.

సానా నాత్రైంది. పండువెన్నెల పచ్చని సెట్లమీంచికనకం గుడారం మీద పడుతుంటే తెల్లని మల్లెపూలు ఇకసించి ఎండిగుడిలా చెమక్ చెమక్‌మని మెరుత్తుంటే దొరోడికి కన్నుగుట్టింది. 'ఓహో.. ఇందుకేనా కనకపు గుడి అంటరు' అని అనుకున్నడు. గుడి అంతా సెట్ల తీగెలతోనే నిర్మితమై ఉండడం చాలా అద్భుతమైన ఇషయం.



నెలరోజుల్లో ఎండలు భగ్గుమన్నయి. వాగులు, అంకలు, కుంటలు, చెర్లెండినయ్. పంటలు పాడైనయ్. సుక్కనీకు దొరకదాయె. ఏడ నీళ్లు దొరికితే ఆడికెళ్లతంద్రు జనం. కరువు ఇకటాట్టాసం సేత్తంది. పోసమ్మలకు, పెద్దావరెలకు అందరికి మొక్కుతున్న గాని కాలం కలిసిరాలేదు. జనమంతా ఉడికిపోతున్నరు. కనకపు గుడికి కొద్ది దూరంలో నున్న ఏనంక సెర్లకు సొరబడింరు. ఆరంలో సెరువండుగట్టింది. ఊళ్లల్ల నిలువ నీడలేదు. పర్రెలెండినయ్. నోళ్లు తెరిసిన బీళ్లనుసూత్తె జనం గుండెఆగడానికి సిద్ధంగా తయారు కాసాగింది.

కోళ్లు, గొర్లు, గొడ్లు, పందులను ఏమి కనపడితే వాటిని కోసుకతింటున్నరు. ఇపరీతమైన కరువు. పిల్లలను అమ్ముకుంటున్నరు. బీర,

బెండ, ఆనిగెపు సిక్కుడు తీగెలను పిండిసేసుకొని తింటున్నరు. ఎవరూ సూడకపోతె కుక్కలను కూడా కోసుకొని తినే కరువు తాండవించింది. ఎవనింట దినుసులుంటే ఆడింటిమీద పడి కాజేత్తండ్రు. కొందరైతే రేగడిమట్టి ముద్దలు సేసుకొని తింటండ్రు. ఆకాశానికి సేతులు జాపి ఆనకోసం మొరపెట్టుకొన్నా పలితం సూన్యమైంది.

ఓరోజు దొరింట్ల జొరబడి దినుసంతా ఎత్తుకెల్లి ఒడిసెదాకా తిన్నరు. గానీ తరువాత తాగుదామంటే సుక్కనీరు దొరకదాయె. ఇట్టాంటి రోజుల్లో దొరోడు కనకపుగుడి మీదికి జనాన్ని ఉసిగొల్పిండు. గూడెమెంతో కరువులో నున్నా కనకపుగుడి వైపు మాత్రం సూడలేదు. దొరోడి మాటలు నమ్మి దండు కనకపుగుడి మీదికి కదలిండు. కనకం పని దీనితోఅయిపోతది. వాడువాని గుడి సర్వనాశనం అని దొరోడు లోలోన సంతోషపడ్డడు. పదిహేనూల్ల జనం కనకం గుడికి లైను గట్టింది. వేయి ఏనుగులు ఘీంకరిస్తూ పొలాల్లో పడి నాశనం చేయటానికి వస్తున్నట్టే జనమంతా హాహా కారాలు చేస్తూ తోసుకపోతంది. వాళ్ల నోళ్లు దాహం దాహం అని ఒర్రుతున్నప్పుడు ఉమ్మి కింది పండ్లకు మీది పండ్లకు తీగల్లా అంటుకుంటంది. వాళ్ల కడుపులు ఆకలితో వెన్నంటి బొందలోంచి తీసిన శవాల్లా గాల్లో ఎగురుతున్న గాలిపటాల్లా ఎగిసిపడుతూ వస్తున్నారు. వాళ్లకు ఎదురేది పడినా స్మసి కావల్సిందే నన్నట్లు దూసుకువచ్చి టక్కునగేటు దగ్గర ఆగారు. చటుక్కున వాళ్లను ఎవరో ఎనక్కి తన్ని పట్టినట్లు సడెన్లీ బ్రేకేసి ఆపిన బస్సులా ఎనక్కి ముందుకు ఊగారు. గేటు కేసి చూసిన వాళ్లంతా లోనికెల్లితే ఏమన్నయితదో ఏమోనని ఒక్కరు కూడా లోనికెల్లడానికి సాహసించలేదు. గేటునుచూసే నీరుగారి పోయారు. గుడి లోపల నున్న కనకం బయటకచ్చి అమాయక జనాన్ని చూసేసరికి అందరూ తలలు కిందికేసుకున్నారు. అది వాళ్ల తప్పుగాదు హైందవ కాలం వాల్లమీద విసిరిన ఆకలిదని కనకానికి తెలుసు. వాళ్ల నుద్దేసించి ఇదే లైనుతో సరిగ్గా ఇక్కడికి తూర్పున మూడు పగ్గాల దూరంలో నున్న సెలమె దగ్గరకెల్లమన్నాడు. మారు మాట్లాడకుండా కనీసం కనకాన్ని తలెత్తికూడా చూడకుండా సెలమె వైపు నడిచారు. అది గజంలోతు గజంపొడుగున్న సెలిమె. చూస్తే నిజానికి అక్కడున్న మందికి మనిషో గుక్కెడచ్చేటుట్టలేవు. అవి ఇంత మందికి సరిపోతాయా? అనే అనుమానం అక్కడికి చేరుకున్న వాళ్లందరికి వచ్చింది. కానీ అదే సెలమెనించి కొంతమంది కనకం మనుషులు కుండలకు కుండలె ఎత్తుకు పోతున్నారు. వాళ్లు ఎన్ని కుండలెత్తుకపోయినా సెలిమె మాత్రం ఎట్టున్నదట్టే ఉంది. అక్కడికి చేరుకున్న జనానికి ఆ సెలిమె గురించి అంతుబట్టలె. ఆ నీళ్ళు ఎంతమందికి సరిపోతయో? జనానికర్థం కాలేదు.

సిన్నపెద్ద, బీదాబిక్కి, ధనిక, పేద, మాదిగోని సెలిమె అని తెలిసి కూడా ప్రాణం దక్కించుకోవడానికి కనకాన్ని తిప్పల బెట్టినోళ్లు, తిట్టినోళ్లు, ఆడిపోసుకున్నోళ్లు సెలిమెలో నీళ్ల తీసుకొని బోతండ్రు. వాళ్ల కట్టాలు సూడలేక కనకం వాళ్లందరికి రోజుకొక పండుసొప్పున పండ్లు దానం సేసి, రెండునెలలు పదిహేనూళ్ల మందిని, దొరను కూడా సాదిండు.

పండ్లు అయిపోయినయి. కనకాన్ని నమ్ముకున్న జనానికి ఆ తరువాత ఏం చేయాలో అంతుబట్టలె. కానీ కడుపు తరుక్కుపోయే ఏడుపులు. పిల్లల్ని అక్కున జేర్చుకొని తల్లిదండ్రుల వలపోతలు రోజు రోజు కెక్కువైనాయి. వాళ్లకు ఇకచావేమార్గం అనే నిశ్చయించుకున్నాక. కనకం ఒక్క మాట సెప్పిండు. మన దేవత ఈ వనదేవత, ఈ ప్రకృతే మనల సల్లంగ సూత్తంది. మీరు ఈ ప్రకృతినే నమ్ముకోండి ఆరాదించండి. ప్రకృతినే నమ్ముకొని ఇన్నాళ్లు నేను బతికిన. ఆ ప్రకృతి నన్నెపుడూ మోసం సేయలేదు అని ప్రగాఢ ఇస్వాసంతో బతుకు భారాన్ని వివరించిండు.

కనకం మాటలతో ఊరట చెందిన జనం ఆ నాతిరంతా ప్రకృతికి మొక్కి పుట్టకొగలు, గుట్టకొగలు, చెట్టుకింద పన్నెరు. ఎన్నెలకింద ఎక్కడబడితే అక్కడ జనం ఆదమరిసి నిద్దురోయింది. నడియామునాతిరి నిదురిత్తున్న సెట్లులేసి సప్పట్లు కొడుతున్నాయి. కనకానికి నమ్మకెక్కువైంది. ఈ రోజు తప్పకుండ ఆన కొడుతదని అనుకొంటున్నడు. సెట్ల గల గల లెక్కువయినయి. సూత్తుండగానే గాలి లేసింది. దుమారం ధూళి పైకెగిసింది. మబ్బును తాకింది అంతే..! ఏడెక్కిన నేల తడిసింది. ఏనంక సెర్వు నిండింది. పంపుదార పడ్డట్టే మూడుగంటలు మూడెకరాల తావులోనే పడింది. జనం ఆనలో సప్పట్లు కొడుతూ, ఎగురుతూ, కేరింతలు పెడుతండ్రు. ఎగిరిండ్రు, దునికిండ్రు, రేపు మన ఇండ్లల్లకు పోవచ్చని అనుకుంట సంతోషపడ్డారు. అప్పటి వరకు ఆకలితో నకనకలాడిన వాళ్ల కడుపులు సంతోషంతో నిండినయి. ఆ రోజు ఎప్పుడు ఇండ్లలకు పోదామా అని కండ్లల్లో తెల్లారనిచ్చిండ్రు. కనకం పాదం తట్టి... ఇక పోయత్తమని వాళ్లూళ్లకు దారి బట్టిండ్రు.

ఇండ్లల్లకు బోయి తెల్లమొకాలేసిండ్రు తప్ప, ఆళ్లకు ఏందోయిలె. అక్కడ మూడుగంటలు కొట్టిన ఆన ఇక్కడ ఒక్క సుక్క నీరు లేదు. అప్పటి వరకున్న సంతోషం సచ్చింది. మళ్లీ పేగులు ఆకలి ఆకలి అని ఒర్రటం మొదలెట్టినయి. ఎటుచూసినా నోళ్లు తెరిచిన బీళ్లు. ఆకలి ఆకలి, దాహం దాహం అన్నట్లున్నవి. ఆ బీళ్ల నోళ్లనించి వేడి వేడి పడలుగువ్వలు పగుల గొడుతున్నయి. కనీసం గడ్డి గూడా మొలవని నేలల జూసి బొచ్చెలు కొట్టుకోటం మొదలుపెట్టారు. అవురావురుమంటున్నరు. ఆకలితో అలమటించే ఆ జనం మధ్యలో దొరగాడు జేరి మల్లా పుల్ల బెట్టిండు. కనకం ఏదో మాయజేత్తండని, ఒక్క మాదిగోడున్న సోటే ఆన ఎందుక్కురువాలె' నని నిలదీసిండు. మాయజేత్తండనే అనుమానాన్ని పెంచిండు. తెల్లారెసరికి లావాసెల్లా సెదరైనట్లు బుసలు కొడుతున్న జనం కనకపుగుడి దగ్గరకచ్చి ఏం మాట్లాడలేకపోయిండ్రు. వాళ్లలో ఆవేశంతో ఉత్సాహం, కుతూహలం అన్నినీరుగారిపోయాయి. ఎందుకంటే కనకపుగుడి ప్రభావమే అది అని అందరికి తెలిసిపోయింది.

అచ్చిన జనాన్ని తేరిపారజూసిన కనకం ఒక్కనిముషం సడిసప్పుడు సేయక ఆ జనం దిక్కేసూసిండు. చాలా సేపటికి వాళ్ల నుద్దేశించి...

అమాయక జనమా? మిమ్ముల పకృతినే నమ్మమని సెప్పిన ఇప్పటికి మించిపోయింది లేదు. సెట్లు బెట్టండి. 'సేమంగా ఉండండి' అని ఒకే ఒకమాట సెప్పి ఎనుదిరిగి గుడారంలోకెల్లిండు. దిక్కుతెరువు లేని ఆ గూడానికి కనకపు గుడి ఆశ్రయమిచ్చింది. సలహాలిచ్చింది. వాళ్ల కండ్లు తెరిపించింది. దొరోడి అన్యాయాన్ని మట్టు బెట్టింది. ఏనంక ఎర్ల నీళ్లు తాక్కుంట కొడికొడి పాణాలతో కాలాన్ని వెల్లదీస్తుంది. అక్కడి ఆకు అలమును తిని బతుకుతంది. కాని ఎంత కాలం బతకగలదు. మనిషిని మనిషి తినే సమయాన్ని మానవత్వపు సమయంగా మార్చిన ఆ కనకపుగుడిలోనే చాలా మంది అసువులు బాసారు. ఉన్నోళ్లు మట్టి తింటూ మన్నులో గలిసిపోతున్నారు. కనకం ఒక్కడే ఎంతని చేయగలడు. కనకం మనసు క్షణ క్షణానికి కొవ్వత్తోలె కరిగిపోతంది. ద్రవీభవించిన ఆయన హృదయంలో తలుక్కున ఓ మెరుపు మెరిసింది.



ఈ పదిహేనూళ్లలో జరిగిన ఈ సంఘటనను ముందు తరాలవాళ్లు గుర్తుంచుకోవాలని తాటిసెట్టంత రాతిస్తంభాన్ని సెక్కించి కనకపుగుడి వెనుక నిలబెట్టిండు. వేల టన్నుల బరువున్న ఆ రాతి తంబం నేలకు ఆనదు. తాటాకు పెట్టి అటునించి ఇటు, ఇటునించి అటు తీయచ్చు. ఎన్ని తుపానులచ్చి, ఎన్ని భూకంపాలచ్చినా ఆ తంబం పడిపోదు. కిందకూసోదు. ఎంత మందచ్చి తాళ్లుగట్టి ఇగ్గిపదేద్దమన్నా కిందపడదు. కనకం యొక్క సేవకు ఆయనలోనీతికి అది నిదర్శనంగా నిలుస్తున్నది. దీనికింక విశేషమేమిటంటే ఎంత మంది లేవట్టినా లేవని ఆ తంబం కనకం దంపతులచ్చి ఓ చేయి వేయంగ సునాయసంగా లేచింది. తనకిట్టమైన జాగాలో దాన్ని నిలబడేటట్లు చేసిందు కనకం. అది ఇప్పటికి స్థిరంగా ఉండడం మరో విశేషం.

'కులంతో పనిలేదు గుణవంతుడే ధాత' అని ఈ ఎర్రిజనం కండ్లు తెరిసేదెప్పుడో! అంతు సిక్కటం లేదు. ఆనలు గొట్టేదాకా కనకపుగుడికిందే జనజీవనం సాగింది. పనిలేని జనం పని కల్పించుకొని ఇంటికో సెట్టుపెట్టుకుంట ఆనంద జీవితానికి సాగతం పలుకుతున్నారు.



మాతంగిదాసు

పంతొమ్మిది వందల ఎనభై మూడవ సంవత్సరమది. భూమంతా నెర్రెలువారి ఉంది. ఇవారకు ఎప్పుడు అట్ల కానట్టుంది. ఆ జిల్లంతా భయంకరమైన కరువువచ్చేటట్టు కనపడుతంది. దిగంతాలనుంచి విపరీతమైన వేగంతో సుడిగుండంలా తిరుగుతూ సమస్త జీవులలో తేమనూ, హరించివేస్తున్నది వేడిగాలి. ఆకాశాన ఒక్క మేఘ శకలమైనా లేదు. ఎండవేడికి భయపడ్డ కీటకాది, క్షుద్రజీవులు కూడా తమ తమ నెలవులు విడిచి భరించడంలేదు. ఒక కాకిపిల్ల మాత్రం తన గూటినుండి ఆహారంకోసం బయటకొచ్చింది. ఎండకు తాళలేక నీరసంగా ఎగురుతూ పోతున్నది.

మాతంగి లోటలో నీళ్లు పట్టుకొని దొడ్డికి పోతంది. ఆమె వెంట ఇంకో ఇద్దరుచిన్నపిల్లలున్నారు. యాడ కూసుందామన్నా చాటు కనపడలేదు. మడికట్లు బిళ్లల్లా తయారైనాయి. ఒక మడిలో దూరాన ఒక దున్నపోతు చచ్చినట్టుంది. దానితోలు తీస్తున్నారు మాదిగలు, దానినోరేమో భయంకరంగా తెరిచిఉంది. దాని లాగే పగుళ్లనేల వేయి నోళ్లతో, 'దాహం దాహం' అన్నట్టుంది. ఆ దున్నపోతు సచ్చి వాసన పట్టింది. ఆ వాసనొక్కసారి గుమ్మన ముక్కును తాకేసరికి మాతంగికి పేగులు బయటకచ్చినంత పనైంది. కాండ్రికిచ్చి ఊంచి ముక్కుకడ్డంగా పైటను పెట్టుకొంది. బొమ్మల్ల గడ్డ అంటే స్మశానం గట్టుమాటుకు వెళ్లింది. ఇంటికి తిరుగుముఖం పట్టింది. ఎదురుగుండా చూస్తే.. మాదిగ గూడెంలో మంటలు చెలరేగి ఆకాశంలో ఎగురుతున్న దృశ్యం కనిపించింది. తాను పొయ్యిమీద నీళ్లపెట్టి వచ్చింది. ఇంట్లో ఎవరూ లేరు. అప్పటిదాకా పెండ్లి దగ్గర ఏగిన డప్పులు ఆగిపోయాయి. ఆ మంటలు ఇంతకింతకు రెట్టింపవుతున్నవి. పెండ్లి పందిరి కాలినట్టుంది. నల్లని, తెల్లని పొగల మధ్య ఎర్రని మంటలు చెలరేగుతున్నాయి. జనమంతా కట్టుబట్టలతో పరుగులెత్తుతూ శోకాలు పెడుతున్నట్లుంది. చేతులతో నుదుళ్లు కొట్టుకుంటున్నట్టు ఛాయగా మాతంగికి కనపడుతంది. జనంలో కోలాహలం, కేకలు, పరుగులు, ఏడుపులు. తాటాకుల ఇండ్లులేసి బుసబుసమని కాలి ఎగిరిపోతున్నాయి. కంగబొంగులు పరపరమని పేలినట్లు చప్పుడవుతంది. మాతంగికి గుండెలు దడదడలాడి గూడెం దిక్కు పరుగు దీసింది. క్షణాలమీద ఇల్లు చేరింది. తనకళ్లముందే తన ఇల్లు కూలిగుల్లై, బూడిదైంది. కొంత మందేమో తమ పాతగుడ్డలు, చిప్పలు, కుండలు, నులకమంచాలు, కోళ్లగూళ్లు, ముల్లెమూటలను బయటేసుకోటానికి ప్రయత్నం చేస్తున్నారు. కొంతమంది ఉన్న కాసిన్ని నీళ్లను చల్లి మంటలార్పుతున్నారు.

సాయంత్రం నాలుగౌదుతంది. కరణం అప్పుడచ్చాడు. అప్పటికే అంతా కాలిబూడిదైంది. ఆయన లాల్చీ, పైజామా, భుజాన కండువేసుకున్నాడు. తెల్లగా కనపడితే పిల్లా, జెల్లా, ముసలి, ముతక, అంతాకట్టు బట్టలతో ఆయన చుట్టూ కుమ్మి గూడింద్రు. ఏడ్సి, ఏడ్సి కండ్లు గుంతలకు పోయి, మసి అంటిన మొకాలతో చాలామంది కళావిహీనంగా అయ్యారు. కొరివి దయ్యాల్లా కొందరున్నారు. అందరికి ఏడుపే శరణ్యమయింది. కరణం ఓదార్చుతున్నాడు. ఓదార్చుతూ.... చివర నిలుసున్న మాదిగ మాతంగి దగ్గరికచ్చి, 'అయ్యయ్యో మీ ఇల్లు కూడా కాలిందామ్మా' అని బాధను వ్యక్తం చేసాడు. అట్లనే సరికి మాతంగికి మరింత దుఃఖం రెట్టింపయింది. ఎక్కడోల్లక్కడ కూర్చుండి ఏడ్చేవాళ్ల దగ్గరికెళ్లి పలకరించి సానుభూతిని తెలుపుతున్నాడు. బలవంతాన కలుగ జేసుకున్న బాధను ముక్కునించి సీది ఎడమచేత్తో కండ్లను ఒత్తుకొని గద్గద స్వరాన్ని ఏర్పరుచుకొని అందరిని రేప్పొద్దున ఇంటికి రమ్మన్నడు. ఓ అర్ధగంటసేపుండి అన్నించి కొర్రమట్టల జారుకున్నాడు.

కాల్వల చెర్లకాలువలు అడుగంటిన నీళ్లు కొంచెం కొంచెం నీళ్లు కారుతుంటే, ఆ వండు నీళ్లలో మోకాళ్లు కడుక్కొని గూడెమంతా కరణం దగ్గరికి బయల్దేరింద్రు. ఏ ఒక్కర్లో ఉత్సాహం లేదు. నడిచే ఓపిక కూడా

లేదుగాని, ఏదో మూలన చిన్న ఆశను పెకిలించుకొని బయల్దేరిండ్రు. వారితో పాటు మాదిగ దాసుపిల్ల మాతంగి కూడా కాళ్లీడ్చుకుంట మైలు దూరం నడిచింది. కరణం అందరితో సంతకాలు చేయించుకున్నాడు. సంతకాలు పెట్టినోళ్లకల్లా పదిరూపాయలు చేతిలోపెట్టి ఇంటికెళ్లమంటున్నాడు. మాతంగి కూడా లైన్లో వెళ్లింది. 'నువ్వుండమ్మా' అని ఆమెను చివరిదాకా ఉంచుకున్నాడు. అందరెల్లి పోయినంక మాతంగిని పిలిచిండు. గొడ్ల పాకలో నీడపట్టున కూసున్న మాతంగి లేచింది. ఆమెకు నడవటానికి శక్తి సన్నగిల్లినట్లుంది. రెండ్రోజులనుంచి అన్నం లేదు. కూసుండి లేసేసరికి కళ్లముందు నల్ల చక్రాలు, సుక్కలు ఏవో తిరిగినయి. భారంగా కరణం దగ్గరికొచ్చి సంతకం చేసింది. అందరికి పదిస్తే ఆమెకు వందిచ్చాడు. "లోనికెళ్లి అన్నం తిని పో" అన్నాడు. నిజంగా ఆమెకు కడుపంతా ఆకలితో గోకుతంది. తినాలనేఉంది కాని కరణం ఎక్కువోడని సంశయిస్తూ "అయ్యయ్యో నేను మాదిగ దాసును కదా! మీ ఇంట్ల ఎట్ల తినేది?" అని అయిష్టతను వ్యక్తం చేసింది.

మాతంగి తల్లిదండ్రులకు ఇల్లు జాగకూడా లేదు. ఒక మాదిగ పెద్దాయన ఏనాడోదగ్గర తీసి ఇంత స్థలమిత్తే గూడుపక్కన గూడు కట్టుకున్నరు. ఆ గూడు కాస్తా కాలిపోయింది. తల్లిదండ్రులు, ముసలోల్లు, చేసుకుంటే తప్ప నోటికాడికి రాదు. ప్రస్తుతానికి తల్లిదండ్రులు దగ్గలేరు. తను ఒక్కతే ఉంది. మాతంగి మంచి గుణ వంతురాలు. ఇపుడు ఇంటికెళ్లి వండుకొని తినేంత ఓపిక లేదు. ఆమెకు లోపల పేగులు ఆకలి ఆకలి అని ఒర్లుతున్నాయి. అలసట సూచించే వాలకం గమనించి, ఆమె రాత్రంతా ఏడిసిందని నిర్ణయించుకున్నాడు. కరణం అన్నం తిని పొమ్మని బలవంతం పెట్టాడు. అయిష్టంగానే లోనికెళ్లింది మాతంగి. ఆకలి తీర్చుకొని బయటకు వచ్చే వరకు కరణం ఉన్నచోటనే కూసున్నాడు. ఏ అమ్మాయి, కడుపునిండా తిన్నావా? ఆప్యాయంగా పలకరించాడు.

కిందికి చూసుకుంటా తిన్నానని తలూపింది. "మల్లీ రేప్పొద్దున కలుపు" మన్నాడు. పొద్దు నెత్తిమీదికొచ్చింది. భగభగమని మండుతూ సూర్యుడు మాతంగి తలమీద నిప్పులు పోస్తున్నాడు. కింద కాళ్లు కాలుతున్నాయి. చెప్పులు కొనుక్కోవాలెననే కోరిక ఆమెకు గత రెండేండ్ల నించి వున్నది. కాని కొనుక్కోకుండానే ఎండాకాలం వెల్లిపోతంది. కాలుతున్న కాళ్లను చూస్తూ ఈసారి తప్పకుండా కొనుక్కోవాలి అనుకొంటే ఇట్లా జరిగిపాయెనని ఆలోచిస్తూ గూడెం వైపు నడుస్తంది. దూరంగా పాటలుపాడె మొండిగాని పాట సన్నగా వినిపిస్తంది. ఆకాశంలో తూర్పుదిశగా రెండు మబ్బు తునకలున్నాయి. అక్కడేమన్నా నీళ్లు దొరుకుతాయేమో అన్నట్టుగా తెల్లకొంగల గుంపు నోరెల్లవెట్టి పోతున్నాయి. ఆ కొంగ గుంపును చూస్తూ ఓ పిల్లోడు, కొంగ కొంగ బువ్వెయ్యి, దేవునింట్లపై సేత్త అనిపిడికిళ్లు పెట్టి తిప్పుతున్నాడు. తిప్పి తిప్పి దోసిల్లో చూసుకున్నాడు. వెనువెంటనే ఏడుపు మొహం పెట్టిండు. పాపం ఆకలి ఆ పిల్లగాని పాలిట శాపమైనట్లుంది. ఆ పిల్లోనికి మరో కొంగల గుంపు కనిపించింది. ఆగుంపన్న అన్నం పెడుతదేమోనని ఆశపడ్డాడు. ఆ పిల్లగాని చేష్టలు చూసిన మాతంగికి నవ్వొచ్చింది. కాని నవ్వలేకపోయింది.

***

అందరు నిద్రపోయారు. కరణం మంచంలో అటు ఇటు బొర్లుతున్నాడు. నిద్రరాటంలే. తనమనసంతా మాతంగిమీదికి పోయింది. బీరువా తీసి డబ్బెంతో లెక్కబెట్టుకుంటే ఆ డబ్బు లెక్క కూడ తెలియటంలే. తెల్లవారంగ తను మాతంగి దగ్గరికెళ్లాలని నిశ్చయించుకున్నాడు. అయినా నిద్రరాలే. తగినంత మందుపుచ్చుకున్న గాని

నిద్రరాకపోయింది. లేలేత ఎరుపు బుగ్గలు ఎలా ఉన్నాయో, ఆమెకండ్లు అలాగే ఉన్నాయి. ఎంత సేపు మాతంగి సౌందర్యమే రెచ్చగొడుతతంది. మాతంగి పెండ్లీడుకుంది. మంచి పరువం పిటపిటలాడుతతంది. ఏ మాసిన గుడ్డలేసుకున్నా కొట్టెచ్చేటంత అందం ఆమెది. ముందునించి, చూసినా, వెనుకనించి చూసినా ఏ మగాడైనా మనసు పారేసుకొనేటట్లుంది. అవయవ సొంపు బాగానే ఉంది. కాని చిన్నపిల్ల అనిపిస్తంది. ఆమె ఒకచూపులోనే వేయిమంది రంభలు కనపడతారు. అటువంటి పిల్లమీద మనసు పారేసుకున్న కరణానికి క్షణాలు యుగాలవుతున్నాయి.

రాత్రంతా అతని కండ్లు గుడ్లగూబ కండ్లే అయినాయి. ముసిముసి మబ్బులోనే లేసిండు. అంత పొద్దున లేవటం ఆయన జీవితంలో మొదటిసారి. అందరికి ఆశ్చర్యం వేసింది. ఎపుడు పొద్దెక్కాల అనే ఎదురుచూపుల్లో గోడ గడియారం టన్ టన్‌మని ఏడుగంటలు కొట్టింది. దానివైపు చూసాడు. గడియారం వాళ్ల తాతల కాలం నాటిది. చెక్కతో చేసిన అది నల్లగా తయారయింది. ఉడుకుడుకు పొగలు కక్కుతున్న టీ ముందుకు వచ్చింది. అయిష్టంగానే గుట్కు గుట్కుమంటున్నాడు. ఆలోచిస్తూ ఎప్పుడు తాగాడో తనకే తెలియదు. గిలాస కిటికి పక్కనబెట్టి మెల్లగా లేచి మాదిగ్గూడెం వైపు నడిచిండు. పొద్దెక్కుతాంటే ఎండ రెట్టింపవుతూ ఉంది. ఊరిచివరికి వచ్చాడు. ఎదురుగా చింతచెట్టు. ఆ చెట్టుకింద ఒకడు కొలిమి పనిచేస్తున్నాడు. కుర్రవాడొకడు అతనికి సహాయంగా మోకాళ్లమీద కూసోని తోలుతిత్తిని ఒత్తుతున్నాడు. కొలిమి గుఫ్ గుఫ్ మని మండుతతంది. కొద్ది దూరంలో ఓ ముసల్ది మక్కజొన్న కంకులను కాల్చి తన మనుమలకు ఇస్తంది.

అదంతా చూస్తూ కరణం మాదిగ గూడెం మద్దెలోకి వచ్చిండు. ఒక్కొక్కరే కరణానికి వంగి రెండు చేతులతో దండం పెడుతూ వస్తున్నారు. కొంతదూరంలో మొండిగాని పాట సన్నగా వినిపిస్తంది. ఓ తల్ల పిల్లోనికి పాలిచ్చుకుంట కరణం దగ్గరికి వచ్చి అతను చెప్పేమాటలు వింటంది. జొన్నలు విసురుతున్న ఓ నడివయస్కురాలు కూడా ఇసరం ఆపి దగ్గరకు వచ్చింది. ఇంకొకడు సగం సినిగిన పంచెను కట్టుకొని వచ్చిండు. సీముదు కారుతున్న ఓ పిల్లగాడు కూడా అందరికంటే ముందు నిలుసుండి కరణాన్ని చూస్తున్నాడు. ఆడి మూతికంతా అంబటి అట్టువేరి ఉన్నది.

కరణం అందరిని పరకాయిస్తూ ఇండ్లు తొందరగా వచ్చే ఉపాయం చెపుతున్నాడు. వాళ్లంతా చాలా శ్రద్ధాసక్తులతో వింటున్నారు. దాదాపు అందరి నోళ్లల్లో వేపపండ్లపుల్లలు కదలాడుతున్నాయి. ఆడోళ్ల నోళ్లల్లో మాత్రం నల్లని బొగ్గు కనపడుతతంది. చూపుడువేలుతో వాళ్లు పండ్లను తోముకుంటుంటే కొంతమందికి గదువమీదికి కారి నల్లగా కనపడుతతంది. తొందర తొందరగా మాట్లాడేసి, కరణం తనువచ్చినపనేదో చేసుకొని పోవాలని తాపత్రయపడుతూ మాట్లాడుతున్నాడు. అందరూ కనిపించారు. కానీ మాతంగి కనిపించకపోయేసరికి బాధగా ముఖ కవలికలను మార్చుకుంటున్నాడు. అన్ని విషయాలు మాట్లాడిన తరువాత ఒక యువకున్ని పిలిచి 'అందరు వచ్చినట్టేనా?' ఇంకెవరన్నా ఉన్నారా? చూడమన్నాడు.

యువకుడు చూడకుండానే అందరూ వచ్చేశారు' అన్నాడు.

మాతంగి రానట్టుందేంటి అని తన అనుమానాన్ని బయటపెట్టనే పెట్టిండు.

'ఓహో? అదా దానికి ఇల్లడుగేలేదు, అదెందుకత్తది' అన్నడు.

'అట్లనా? పాపం ఆ పిల్లకి ఇల్లడులగేలేదా? మీరంతా ఏదో సహాయం చేయొచ్చుకదా! అని అంటే ఏ ఒక్కరూ మాట్లాడలేదు.

'అయిందానికి ఆ పిల్లను ఇంటికిరమ్మని చెప్పు' మని ఇంటి ముఖం పట్టాడు.

మాతంగిని తీసుకొని ఓ పెద్ద మనిషి కరణందగ్గరకు వచ్చాడు. మండుటెండలో దాహానికి ఎలా విలవిలలాడుతారో అలా మాతంగిని చూడటానికి విలవిలలాడుతున్నాడు కరణం. ఫ్రీజ్ నీళ్లు తాగితే కడుపు ఎలా చల్లబడుతదో మాతంగిని చూడగానే అలా నిరీక్షణలో చలువదను వచ్చేసింది. పెద్ద మనిషిని పిలిచి బస్టాండుకెళ్లి పోస్టాఫీసున్నదో లేదో చూసి రమ్మని పంపించాడు. మాతంగిని దగ్గరికి పిలుచుకొని, ఆరాం కూర్చీలో కూసొని కాల్లూపుతూ 'నీకు ఇల్లడుగు లేదంటగా?' అడిగాడు.

నేరుగా చూసి మాట్లాడాలంటే మాతంగికి వనుకుబుట్టింది. అవునన్నట్లు తలూపింది.

మరి ఎట్ల, అందరికి ఇండ్లు సాంక్షన్ చేయించటానికి కెల్లుతున్నాను, నీక్కూడా ఒక ఇల్లు కావాలెగదా! జాగేమో లేదు? ఎట్లా అన్నట్టు? ప్రశ్నించాడు.

'మీ దయ అయిగారు, ఎట్లన్న జేయండి?' పెకలలేని మాటలను పెకిలించింది.

'ఇల్లడుగు చూయిస్తనే ఇల్లు సాంక్షన్ అయ్యిద్ది. లేకపోతే కాదు, అందుకే నిన్ను పిలిపించిన, మందిల మందిల నీ పని కూడా చెయ్యాలననే పిలిపించినాను. మీ వాళ్లందరిని అడిగితే ఎవ్వడూ ఇల్లడుగు ఇవ్వటానికి ముందుకు రాలే. ఏంజేత్తామో? చెప్పమన్నాడు.

మాతంగికి ఏమి మాట్లాడాలో తెలియలే. కరణం గారిది పెద్ద భవనం. అంత పెద్ద భవనంలో చిన్న పురుగు కూడా లేదు. అల్లంత దూరాన పశువుల దొడ్లో నించి ఆవు అంబా అని ఒర్లటం వినిపిస్తంది. అటువైపుచూస్తూ సరె, ఇప్పుడైతె ఇంత తలదాచుకోటానికి ఇల్లిత్త. ఆ తరువాత మీ కులపోల్లనొప్పిచ్చి జాగ జూపిత్త ఏమంటవ్' అన్నాడు.

సరేనన్నట్లు తలూపింది.

అయిందానికి నీకు ఏ ఇల్లు గావాలో ఇంటెనుక్కెల్లి చూడు, నేనిట్ల వస్తానని లేచిండు.

అయగారు మా అయ్యా, అవ్వలేరు, వాళ్లచ్చినంక వస్తాం' అన్నది అనుమానంగా.

'ఇపుడు గూడెమంతా వచ్చి ఈ ఇండ్లల్ల సొత్తరు, అన్ని అయిపోయినంక, నేనాడపిల్లను నాకియ్యమంటే నేనెక్కడపోవాలె' కాసేపాగి ఆలోచించుకో, రేపు అందరు ఇక్కడికే వస్తారు. రేపటినించి అందరూ ఈడనే ఉటారు నికార్సుగా అన్నాడు.

అయ్యా! మేము మాదిగ దాసులం గదయ్యా' అని అన్నదో లేదో

'ఇగో, గదె బెట్టద్దు. నా దగ్గర అందరూ ఒక్కటే, నాతాన అవన్నీ ఎప్పుడన్నా గనపడ్డాయా? నడువు నడువు నాకు చాలా పన్లున్నాయి. తొందరగా ఇల్లు జూత్తువుపదా! అని తొందరపెట్టిండు. మాతంగికి ఏమి మాట్లాడాలో అర్థం కాలే. అటూఇటూ కలియజూసింది. ప్రహరీ గోడపొంటి రంగురంగుల పూల చెట్లు ఉన్నాయి. ఇంకో వైపు నేలమీద ఒత్తుగా అందంగా పట్టువలె పెరిగి ఉన్న మృదువైన పచ్చిక. ఆ పచ్చికమీద బొచ్చు కుక్కపిల్ల ఆడుకుంటంది. అంతకు దప్ప అక్కడ ఏమికన్పించలె. వెనక్కి తిరిగి చూస్తే దగ్గర ఒక సుంకరి ఉన్నాడు.

నిశ్శబ్దాన్ని చీలుస్తూ 'ఇదిగో ఈ తాళాలు తీసుకుని మంచి ఇల్లు జూసుకొపో' అని తాళాలగుత్తి మాతంగివైపు విసిరేసిండు. ఆ తాళాల గుత్తి మాతంగి పట్టుకోలేక పోయింది. అవి జారి కిందపడితే, వాటిని తీసుకొని రూము వైపు నడిచింది.

వరుసగానున్న ఇండ్లపక్కకెల్లి సల్లంగా ఉన్న ఓ ఇంటి తలుపు తీసింది. ఒక్క క్షణం ఆగి లోపలికి తొంగి చూసింది. గదంతా ప్రశాంతంగా ఉంది. కిటికీనించి చల్లగాలి తెరలుతెరలుగా వస్తుంది. కొద్దిక్షణాలాగి గదిలోకి వెళ్లింది. పరీక్షగా గోడలవైపు చూస్తుంది. అంత పెద్ద ఇంట్లో నేనొక్కదాన్నే ఉండాలి అనుకొంటుంది. ఇంతలో వెనకనించి తలుపువేసిన చప్పుడయ్యింది. మాతంగి గుండెదబేల్ మన్నది. సర్రున వెనక్కి తిరిగి చూసింది. కరణంగాడి చిరునవ్వు. భయపడకుమన్న ఓదార్పు. చాలా చిత్రమైన పరిస్థితిలో చిక్కుకుపోయింది. మాతంగి వెంట వచ్చిన పెద్ద మనిషిని లోపలికి రాకుండా గేటు దగ్గరే సుంకరి అడ్డగించాడు. మాతంగి సాలెగూడులో చిక్కిన చిన్నజీవి అయిపోయింది. ఏడుపు ముంచుకొచ్చింది. ఆమెకు దగ్గరగా వస్తూ అన్నింటికి నేనున్నాను. నీవేం భయపడకు. నీకు ఇల్లు కట్టించే బాధ్యత, నీ తల్లిదండ్రులను సాదే బాధ్యత నాది. నీ తల్లిదండ్రులు ఎట్లాగు నీకు పెండ్లి చేయలేరుకదా! అని దగ్గరి దాకా వచ్చాడు. నన్నేం చేయకుమని కాళ్లు పట్టుకుని వదలటం లేదు మాతంగి. నాకేం తెల్వదు, నాకు భయంగా ఉంది, నేను చచ్చిపోతానని, చలిజ్వరం వచ్చినట్లు వణికిపోతంది. కండ్ల నీళ్లు తూడుస్తు ఓదార్చుతూనే మాతంగి ఎదమీది ఓనిని తీసిండు. కరణం భవంతి ప్రహారీపక్కనే ఓ చిన్న సైకిల్ షాపుంది. ఆ షాపు దగ్గర ట్యూబ్ పగిలిన సౌండు వినిపించింది. కరణానికి బుగులు జొచ్చి తీరి తీరని దాహంతో బయటకు నడిచిండు.

***

వింత వింత రంగులతో ఆకాశం ముచ్చటగా ఉంది. రెండు మూడు పక్షులు ఆకాశంలో తీరికగా ఎగురుతూ విన్యాసం చేస్తున్నాయి. సంకలు లేవనివ్వని సలిలో ప్రసాదరెడ్డి కుర్రానిలా నడుస్తున్నాడు. కొద్దిదూరం నడవంగానే కొంత అలసట వస్తుంది. అయినా అలసటను లెక్కచేయకుండా నడుస్తున్నాడు. ముందు పోయే అమ్మాయి పక్కనే నేను నడవాలనే కోరిక అతనిలో ఎక్కువైంది. ఆమె వెనుకనించి చాలా అందంగా కనిపిస్తుంది. ఆకాశం రంగుచీరె, బూడిదరంగు జాకెట్టూ, తలలో పూలు పెట్టుకొని వయ్యారంగా ముద్దబంతి పువ్వులా నడుస్తుంది. రెడ్డి ఆమెను వెంబడించి ఆమెకు చేరువయ్యాడు. పిల్లంటే ఇలా ఉండాలి అనేంత ధీటుగా ఉందామ్మాయి. వెనక్కి తిరిగి ఏదో చిన్న సైగ చేస్తే ఇద్దరు దున్నపోతుల్లాంటి మనుషులచ్చి ఆ అమ్మాయిని ఎత్తుకొని పోయింద్రు. ఆళ్ల ఎనుకాలే రెడ్డి మాయమైండు.

తెల్లారింది. రెడ్డి వచ్చి మూతికట్లు విప్పాడు. తేరిపార చూసి, మాతంగి ఓసి నువ్వా! పగలబడి నవ్వాడు. మాతంగికి ఏమి అర్థం కాలే. ఆమె పక్కనే కుర్చీ వేయించుకుని కూసోని, అమ్మాయిగారు, నీకతంతా మావాళ్లు ఎప్పటి కప్పుడు రికార్డు చేసే పెడుతున్నారు. అయినా, ఆ లత్కోరోడే దొరికాడా! మేము పటేల్లం ఉన్నాం కదా! అని తన ధీరత్వాన్ని చూయించాడు. మాతంగి ఒకటనటంలే, రెండనటంలే, కండ్ల రెప్పలాడిస్తూ రెడ్డి ప్రవర్తనను గమనిస్తుంది.

నా మాటిని నా పంచన జేరు, నిన్నురక్షిస్తా. ఇక ఆ కరణం గాడి తెరువు బోకు. సచ్చేదాకా నిన్ను నేను సాత్తాసూడు. మీ మాదిగలకు నేను దేవుడితో సమానం. వాడు నీకు ఇల్లత్తనని ఇప్పటివరకు ఇచ్చిండా? ఇయ్యడు. ఇదో నేనురేపొద్దున్నే నీకు ఎల్లమ్మగుడి పక్కన గుడిసె ఏపిస్తాను. నువ్వు ఊ అను. ఆ కరణం గాన్ని నీ కాళ్లకిందకి తెత్తాను. ఇక నీకు నీ తల్లిదండ్రులు ఆ గుడిదగ్గరే ఉండాలె. ఆ గుల్లోనే ఉండాలె. ఆ గుల్లో వచ్చే దబ్బంతా మీకే' అని ఏవేవో ఆశలు జెప్పిండు. అంతలో మటన్ బిర్యాని అన్నం దగ్గరికచ్చింది. వీళ్ల బారినించి తప్పించుకోటం చాలా కష్టమని మాతంగికి అర్థం అయ్యింది. కన్నీల్లు పెట్టడం తప్ప తను ఏమి చేయలే. పైగా

తను తక్కువజాతి, వాళ్ళు ఎక్కువోళ్లు. వాళ్ళు తలుచుకున్నది చేయగలరని భయపడ్డది. సరే మీరే చెప్పినట్టే వింటానని తలూపింది. చేతగాకున్న కొత్త ట్రాక్టరెక్కి పదిరోజులు దున్నాలనుకునే ప్రసాదరెడ్డి కోరిక మాతంగి తలూపటంతో తీరింది.

***

కరణం నెమ్మదిగా లేచి తళతళ లాడుతున్న గ్లాసునిండా నీల్లు తీసుకుని, గ్లాసులో ఏమన్నా పడిందా! అన్నట్లు చూసాడు. నీళ్ళు బాగానే ఉన్నాయని నిర్ధారించుకొని రెండు బుక్కలు తాగాడు. మాతంగి వంకచూసి.. ఏమీ.. నా దగ్గరికే రావన్నావట? నీకెంత ధైర్యం. వాడా ముందు, నేనా? అయినా వాడెవ్వడే నేను ముట్టుకున్న దాన్ని వాడుంచుకోవటానికి, అని మరో రెండు బుక్కల నీళ్ళు తాగి...ఇదో! ఇపుడే సెపుతున్నా, ఎల్లుండి ఉగాది. ఆ రోజు నీవెక్కడున్నా నా పక్కలోకి రావాల్సిందే! లేకపోతే నీ తల్లిదండ్రుల పుచ్చెలెగిరిపోతాయి జాగర్త' అని హెచ్చరించాడు.

మాతంగికి బుగులు జొచ్చింది. ఈ గాడిదికొడుకు ఎంతటి దారుణానికైనా ఒడిగడుతాడని, సరెనని తలూపి బయటికచ్చింది. మాతంగికి పదిహేనేళ్ల చెల్లెలుంది. దానికి పెల్లి కావల్సి ఉంది. తన బతుకు ఎట్లా పాడైపోయినట్లే! కనీసం దాని బతుకైనా నిలబెట్టాలనుకుంటంది. ఇక తల్లిదండ్రుల విషయానికొస్తే, వాళ్లు వృద్ధులయ్యారు. తన మూలానా వాళ్ళ ప్రాణాలు పోవటం మాతంగికిష్టంలేదు. వీని దగ్గరికిపోతే, వానికి పొడుచుకొస్తది. వాని దగ్గరికి పోతే వీనికి పొడుచుకొస్తది. నా సాదు తాగెటోళ్ళ దగ్గరికి పోటానికి నాకేమన్నా గులనా ఏంటి? అని ఆలోచిస్తూ రోడ్డు మీద నడుస్తంది. ఎదుకవోయినతీగె కాలికి తగిలిందన్నట్టు సంతోషంగా వస్తున్నాడు ప్రసాదరెడ్డి. అతన్నీ చూసేసరికి మాతంగికి గుండె ఆగినంతపనైంది. తప్పించుకోటానికి మార్గంలేక తలకిందికేసుకొని పోతాంటె ప్రతాపరెడ్డి దగ్గరికచ్చి 'రేపు ఉగాదికి ఇంటికిరా... కోరుకున్న చీరెలు పెడతానని' చెప్పాడు. అతనికి కూడా ఎదురు చెప్పలేక సరేనన్నది.

ఉదయం ఎనిమిది గంటలు. ఎండ చిటపటలు కొడుతూ తైతక్క లాడుతంది. పొద్దెక్కే కొద్దీ ఎండలో వేడి ఎక్కువై భరించకుండా ఉంది. గాలి అలిగినట్లు ఏ ఒక్క ఆకు కదలటంలేదు. మాతంగి తయారై, జడలో మల్లెపూలు పెట్టుకొని బయల్దేరింది. రోడ్డుపొంటి ఎదురయ్యే వాళ్ల రీతి చూస్తే చెప్పకనే చెపుతంది ఈ రోజు పండగని. అయినా అందరూ మాతంగిని వింతగా చూస్తున్నారు. అవన్నీ ఏమి పట్టించుకోకుండానే మాతంగి కరణం ఇంటివైపు నడిచింది. కరణం, ప్రసాదరెడ్డిల మధ్య ఈర్ష్యలు, పగలు, మాతంగి మీద ప్రభావాన్ని చూయిస్తున్నాయి. ఉగాదిరోజంతా మాతంగి కరణం చేతిలో కీలుబొమ్మలా నలిగిపోయింది. కాని తన మీద ఎవరికి కరుణ దయ లేదన్నట్లుంది. మరుసటి రోజు ఇంటికిపోయే సరికి, ఇల్లు కూలిపోయి ఉంది. ప్రసాదరెడ్డి దగ్గరకు పోనందుకు, అతని మనుషులచ్చి ఉన్న చిన్నపాటి గుడిసెను ధ్వంసం చేసి పోయిండ్రు. కూలిన ఇల్లును చూసి ఇంటిచుట్టూ దిగులుగా తిరుగుతూ ఏడ్చింది. తీసి పారేసిన కట్టెలను, వాసాలను ఒకచోట కుప్పగా వేస్తూ తిడుతంది. బాధపడి ప్రయోజనం లేదని తిరిగి కరణం దగ్గరికెల్లి విషయం చెప్పింది. అంతలోనే ఒక ముసలోడొచ్చి 'మీ తల్లిదండ్రులను తీసుకొచ్చి చిత్రహింసలు పెడుతండు ప్రసాదరెడ్డి' అని ఎగపోసుకుంట చెప్పాడు. మాతంగికి ఎనలేని కోపమచ్చింది. ఏ తల్లిదండ్రుల కోసం తను బతుకుందో ఆ తల్లిదండ్రులకే ముప్పువాటిల్లిందని విలవిల లాడింది. హృదయవేదన చెందుతున్న మాతంగిని చూసి కరణం చలించిపోయాడు. ఇదిగో ఈ వేయి రూపాయలు తీసుకొని ఇల్లు ప్రయత్నం చూడు. ఈ లోగా నీ తల్లిదండ్రులను వాళ్ల బారినుంచి

కాపాడే బాధ్యత నేను చూసుకుంటాను అన్నాడు కరణం. ఏడ్చుకుంటూ పోతున్న మాతంగిని పిలిచిరేప్పొద్దునే పంచాయతీ పెట్టించమని సలహాకూడా ఇచ్చాడు.

తెల్లవారింది. రచ్చబండ చుట్టూ జనం గుమిగూడారు. జనమంతా, విషయాన్ని వినుటకు తహతహలాడుతున్నారు. అరవైఏండ్ల పెద్ద మనిషి రచ్చబండ మీద కూసొని, తన దొడ్డుమీసాలు మెలివేస్తున్నాడు. అందరి ముందు తన గత చరిత్రనంతా చెప్పుకొని, కులాన మాదిగ దాసునైనందున ఇగొ గింత క్షోభను అనుభవిస్తున్నానని మొరబెట్టుకొంది. అక్కడ కుడివైపు ప్రసాదరెడ్డి వర్గం ఎడమవైపు కరణం వర్గం ఉంది. ఊ, ఉసుకో... అంటే తన్నుక సచ్చేటట్లున్నారు అమాయక జనం.

అవతలివైపు పిల్లలు ఆటలాడుతూ ఒక్కసారిగా కెవ్వున కేకలేసారు. అందరి దృష్టి ఆ పిల్లల మీదికి మర్లింది. మాతంగి భయం వల్ల కొన్ని విషయాలు మరిచి పోయినట్టుంది. గుర్తుచేసుకొంటూ తనుకూడా పిల్లల దిక్కు చూసింది. రచ్చబండ మీద కూసున్న వ్యక్తి ఊ అయి పోయిందా? ఇంకేమన్నా చెప్పేదుందా? ప్రశ్నించాడు. 'అంతా అయిపోయింది'. అని గొంతును చిన్నదిగా చేస్తూ తలకిందికేసింది. ఆ పెద్దమనిషి అందరిని కలియజూసి, ఒక పెద్ద మనిషికి మాటిచ్చి, పోక పోటం నీదే తప్పు అరి తీర్పిచ్చిండు. ప్రసాదరెడ్డి వర్గం మాతంగిని హేళన చేస్తూ వెళ్లిపోయింది. మాతంగి ప్రతిమలా నిశ్చేష్టురాలైంది. తన జీవితమెందుకో! తను బ్రతకడమెందుకో ఆలోచించుకుంటే, ఆమెకు శూన్యమే కనపడింది. మాతంగిని అగ్రవర్ణాల వారంతా అనుభవించాలనే చూస్తున్నారు. కాని ఏ ఒక్కడు తనవైపు మాట్లాడలేదు. తను వాళ్లకోసమే పుట్టినట్లుంది. తను పతిత. పదిమందిలో మాత్రం తనను ముట్టుకోరు, అనుభవించేటపుడు మాత్రం ఎక్కడ పోతుందో? ఈ ముట్టుడు రోగం. ఈల్ల నోల్లల్ల నా ముట్టు కడిగిపోత్తె అని తిట్టుకున్నది, నిట్టూర్పిడిసి, కండ్లు మూసుకున్నది కాని రెక్కలు కట్టుకొని ఆమె మనసు మాత్రం ఏదో అజ్ఞాతంలోకి ఎగిరిపోయింది. ఈ దొంగ....లకు పంచమహాపాతకాలు అంటుకోవా? అని మనల్నే అంటుకుంటాయా? అని ఆలోచించుకుంట కరణం దగ్గరికెల్లింది. అక్కడ తన తల్లిదండ్రులను జూసి, బోరున విలపించింది. కరణం మెల్లగా మాతంగికి నచ్చజెప్పి ఏడుపును ఆపించగలిగాడు.

జిల్లాకెల్లి కోర్టులో కేసుపెట్టుమని, మరో వెయ్యిరూపాయలిచ్చిండు. అదంతా మాకేం దెల్సయ్యా అని మాతంగి విన్నవించుకుంటే మీరు నడవండి, నేనువెనుకాలే వస్తానన్నాడు. అరుగుకింద ఇస్తార్లేసి ఇంత అన్నం పెడితే ముగ్గురు మనిసింత తిన్నరు. తిన్న తరువాత జిల్లా కెల్లుటకు సిద్దమయ్యారు. బయట ఎండ నిప్పులు చెరుగుతోంది. పక్షుల పికపికలు వృక్షాల గిలగిలలు ఏమీలేవు. ఈ ఎండకు ఎల్లాలంటే మాతంగికిట్టమనిపించలే. అయినా వెళ్లాల్సిందే, అక్కడ న్యాయం జరుగుతుందని కరణం గారు చెప్పారుకదా అనే నమ్మకంతో మాతంగి తల్లిదండ్రులు, చెల్లెతో జిల్లా కోర్టుకు బయలుదేరిండ్రు. కింద కాల్లు కాలుతున్నయి. సెమటలు కారుతున్నాయి. రోడ్డుపోంటి ఏదన్నా పచ్చగడ్డి కనపడితె దాని మీద అడుగులేస్తూ నడుస్తున్నారు. ఎండ విపరీతంగా కాస్తంది. ఇంకాసేపట్లో నీడ వస్తదని అనేకుందామంటే ఆకాశంలో ఒక్క మబ్బుతునక లేదు. ఏన్నన్న కాసేపు కూసుందామంటే చుట్టూ ఎటుచూసినా బీటలువారిన భూమి. సుడిగుండాలు తిరుగుతూ ఎర్రన దుమ్ములేపుతూ సుడిగాలి వడలుగా వీళ్లపైకి వస్తంది. తూ.. నీ అవ్వ... వస్తున్నవెందుకే? మాదగ్గర ఏమున్నదే... తుపూ... నీ అవ్వ.... అని ఆ సుడిగాలిని ముసలోడు తిడుతండు. భూదేవత ఒళ్లంతా కండ్లు జేసుకుని వాన సుక్కకోసం ఎదురు చూస్తంది. జిల్లాకు చేరాలంటే ఇంకా రెండుమైళ్లన్నా నడువాలె. కింద కాళ్లు మాడిపోతున్నాయి. దబదబా నడుచుకుంట పోయి కొంత దూరాన కనపడే ఆసెట్టు కింద కూసోవాలనుకున్నారు. మెల్లగా చెట్టుకిందికి చేరుకున్నారు.

కింద్దైనా మంచిదే కాసేపు కూలబడదామని అనుకొని నలుగురు కూలబడ్డారు. వానకొట్టి వెలిసిన తరువాత పడిన పిడుగుల్లా ఉన్నట్టుండి ప్రసాదరెడ్డి, అతని మనుషులూడిపడ్డారు. మాతంగి హడలెత్తిపోయింది. నలుగురిట్లో భయం సొచ్చింది. తల్లిదండ్రులు వణుకుతున్నారు. సెల్లె ఏడుపుముకం పెట్టింది. వీడు మల్లా ఏంజేత్తాడోనని వణికిపోతంది మాతంగి.

కొంచెం కంపిస్తున్న గొంతుతో మొదలెట్టాడు ప్రసాదరెడ్డి 'మీరు చేసే పని నాకు నచ్చులె, ఏదో పోనియ్యాని వదిలేత్తే ఏకంగా కోటుకే ఎల్లుతండ్రా! ఈ పని ఏంబాగాలే. మీ హోదాకు, నా హోదాకు సరిపోయే పేచీకాదు ఇది. రేపు ఊరంతా ఏమనుకుంటుంది ఎట్ల? నేనూ మీ కంటె ఆస్తి అంతస్తు, అనుభవంలోను, అరాచకంలోను నాలుగు పర్లాంగులు మీదుంట. మరి మీరు నా కాలిగోటికి సరిపోరు. అందుకే మీకు సంస్కారం చేద్దామని వచ్చాను. కానీ ఈ వయసులో నిన్ను, నీ చెల్లెను కూడా అనుభవిస్తానని అనుకోలె. ఇది మీ అదృష్టమో, దౌర్భాగ్యమో ఏమన్నా అనుకోండ్రి' అని ఇద్దరి ముసలోల్లను చెట్టుకు కట్టేయించాడు. అదే సెట్టుకింద తల్లిదండ్రుల ముందే 'మాతంగి సెల్లెను ప్రసాదరెడ్డి దుబ్బలో పడేసి అతి దారుణంగా పాశవికంగా పశువులాగా అనుభవిస్తుండగా అతని మనసులు మాతంగి చుట్టు కుక్కల్లా చుట్టుకొని అతి దారుణంగా చెరచబడుతుంటే, ఆమెఎంత పెనుగులాడినా ఏమి ప్రయోజనం లేకపోయింది. పదిమంది గోరకృత్యానికి నీరసంగా స్పృహ తప్పిపడి పోయింది. అంతటితో ఊరకోక, రెచ్చిపోయిన ఆవేశంలో ఇద్దరి ముసలోల్లను, అక్కడ దగ్గరగా ఉన్న నీళ్లులేని బావిలో తోసి, మాతంగి సెల్లెను తనెంబటి తీసుకెల్లిండు.

నావెల్లిపోయిన తరువాత వచ్చి ఒడ్డున చేరినోనిలెక్కన అంతా అయిపోయిన తరువాత కరణం వచ్చాడు. చినిగిన రైక, బట్టలూడిపోయి, పాశవికంగా చెరచబడ్డట్టు ఒంటిమీద కనపడే గాయాలు, కరణాన్ని కరుణామయున్ని చేసాయి. దాహం దాహం అంటూ నోరు తెరిచింది మాతంగి, కరణం నీళ్లు పోసి, మొకం కడిగి లేపట్టిండు. ఇంతటి దారుణమైన పరిస్థితిని తను ఇదివరకు చూడలేదు. చుట్టూ కలియజూస్తే రణరంగంలా తొక్కిసలాట జరిగినట్టుంది. చెట్టుమొదట తాడు, పగ్గం పెట్టు దూరంలో ఓని కనపడుతంది. ఊడిపోయిన చీరను దెచ్చి మీద కప్పిన కరణానికి ఒళ్లు గగుర్పాటు లేచింది. ఆగ్రహావేశాన్ని ఆపుకోలేక పోతున్నాడు. ఇది కచ్చితంగా ప్రసాదరెడ్డి పనేనని అనుకున్నాడు. పాలేరు సహాయంతో మాతంగిని ఎడ్ల బండ్లోవేయించి, సరాసరి కోర్టు గుమ్మం దగ్గరికి తీసుకెల్లిండు. కోర్టులో కేసు మొదలైంది. తీర్పు వచ్చి, న్యాయం జరుగుతుందేమోననే అరవై సంవత్సరాల మాతంగి ఆశ ఆకులు రాల్చుతంది.

***

కొం(వి)డాకుు

ఎలవారం గుడిసె, తాటాకులు, టేకాకులు ఇంకా రకరకాలైన ఆకులతో కొమ్మలతో కప్పబడి ఉంది. ఒకటే నిట్టాడు. ఆ నిట్టాడుకొరిగి కూసున్నది కరుణావతి. భూమ్మీద గీతలు ఎప్పటినించి గీస్తందో ఎవరికి తెల్వదు. తాటాకుల సందుల్లోంచి ఆమె మీద అప్పటివరకు పడిన వెలుగు కాస్తా కనుమరుగైంది. బయటి చీకటి అలుముకొన్నది. ఆకాశంలో సుక్కలు బొత్తిగా లేవు. అవతలి పక్కనించి ప్రతిధ్వని వినిపించేటట్లుయింది చీకటి. దట్టంగా ఉన్నఅడవితో పాటు దట్టమైన చీకటి. మోకాలిచిప్పమీద పెట్టిన గదువ ఎత్తడంలేదు కరుణ. ఉన్నట్టుండి కండ్లల్లోంచి వట్ట వట్ట నీళ్లు కారుతున్నాయి. గీస్తున్న గీతల్లో ఆమె కన్నీళ్లు పడి మట్టిని తడిపి కిందికింకిపోతున్నయి. గుడిసెమీద రెండు పొడుగాటి ఆకులు రెపరెపలాడటం తప్ప తనతోపాటే ప్రకృతి కూడా స్తబ్దంగా ఉంది.

కరుణ కండ్లల్లనించి నీళ్లు కారుతూనే ఉన్నాయి. నిట్టాడుకానుకొని ఉట్టిమీద కుండ, ఆ కుండతొనక్కుంట ఉండడానికి దానిముడ్డిక్రింద కుదురు సుట్టుంది. కుండలో ఒడిపిలి నూకలతో వండిన అన్నం ఉంది. ఆ తిండి కోసం ఎలుక తహతహలాడుతూ కుండమీదికి వస్తు పోతూ ఉంది. కరుణావతిలో ఒకటే ఆలోచన, ఆ ఆలోచన నించే కండ్లనిండా నీళ్లు. ముక్కునించి కారుతున్న చీమిడి ఎడమచేత్తో సీది నెలకేసి రాసింది. ముక్కు సీదిన సప్పుదుకో ఆమె చేతినిండా ఉన్న (చుడియాలు) తెల్లని గాజుల్లాంటి మట్టీల చప్పుడుకోగాని, కలుగులోకెల్లిన ఎలుక మళ్లీ కనిపించకుండా పోయింది. కరుణకు లోన ఆకలి గిలగిలలాడినా, పేగులు ఒర్రుతున్నా లెక్కచేయడం లేదు. దగ్గరికచ్చి ఓదార్చేనాథుడే లేడు. ఆమె సుట్టంతా అడవి. కాపలా గాస్తున్నట్టు నాలుగు దిక్కులా గుట్టలున్నాయి. బయట ఆకాశంలోఅలజడి మొదలైంది. యుద్ధానికి సిద్ధమైన గజ సైన్యంలా జలవర్ణమైన మబ్బులు, మబ్బుల్లోంచి చెమక్ చెమక్ మని మెరుపులూ. ఇప్పుడో, ఇంకాసేపటికో కుంభవృష్టి ప్రారంభమవుతున్నదన్నట్లు గాలి దుమారం. దూరాన ఏదో చెట్టు విరిగి పడ్డ చప్పుడు రానేవచ్చింది. ఆ శబ్దం వైపు అప్రమత్తంగా చూసింది. ఏమి కనిపించలే, అంతా శూన్యం. కానీఆ శూన్యంలోంచి మెల్లగా భర్త ముఖం తారసపడ్డదామెకు. నులు దేలుతున్న నున్నటి గడ్డం, సన్నటి మీసాలు, ఎదిగిన చెంపలు, పెదపెద కండ్లు, పెద్ద నుదురు, నుదురు అడ్డంగా చుట్టుకున్న రంగుల గుడ్డ, నెత్తిమీద సిగ, సిగలో నెమలి పించాల ఈకలు. ఆ రాజు ఆనాటినుంచే నేటివరకు కానరాకపాయె. అందరిదృష్టిలో రాజు చచ్చినకిందికే. కానీ ఆమె దృష్టిలో ఇంకా చావలె. తళుక్కున మెరిసి ఆవెంటనే ఊగుతున్న కొమ్మల మాటునుంచి, కదులుతున్న ఆకుల చాటునించి కనిపించినట్టే కనిపించి మాయమయిండు. అది చూడంగానే దోసిలిలో ముఖం పెట్టుకొని ఎక్కెక్కి ఏడ్వడం, ఆతరువాత ముక్కుచీది నేలకి రాయడం, ఆలోచించడం, అదే పనిగా ఆమెను కాలం కరుస్తూ నడుస్తుంది. ఏందిన్నా పెయికి పట్టడంలేదు. భర్తను మరిచిపోవడం తనవల్ల కావడం లేదు. ఆ బాధతో తను కుమిలి కుమిలిపోతుంటే మొగన్ని పొట్టనెట్టుకుందని లోకం పొడిచే మాటల గునపాల పోట్ల బాధ మరీ భరించలేకుండా ఉంది. అది తలుచుకొని కుమిలి కుమిలి క్రుశించిపోతున్నది.

తను ఇక విధవరాలుగానే జీవితాంతం గడపాలని ఆలోచిస్తూ ఉంది. ఏ మొగోని ముఖం చూడకుండా దొంగదొంగతనంగా తిరుగుతూ ఎలా బతకడమో? ఇంత పెద్ద అడవిలో ఒంటరిగా పోయి, ఏ పని చేసి బతకాలో ఏమో? అట్ల బతుకుదామన్నా ఎక్కడ ఏమొగోడు కన్నేస్తాడో? అనుకోకుండా తన దృష్టే ఏ మొగోని మీదనన్న పడితే ఎట్లా? ఎవరి దృష్టి ఎవరి మీద పడ్డా గుల్లయ్యేది నేనే కదా! అటు పుట్టింటికి ఇటు మెట్టింటికి అపకీర్తే కదా!... ఆ ఆపకీర్తి తెచ్చిపెట్టడం కంటే లోకంనించి తప్పుకోవడం మంచిదనుకున్నది. బయటగాలి రివ్వన మోతమోగుతున్నది. దుమ్ము, ధూళి లేసి ఎగసి పడుతంది. ఆ గాలి కొట్టే కొట్టుడుకి కరుణ కూసున్న ఎలవారం గుడిసె కూడా ఊగుతున్నది. గుడిసెలేసి కొట్టుకపోతదా ఏంది! అనిపిస్తుంది ఆమెకు.

పెళ్లి కాకముందే తన మేనమామ ఓసారి అడవిలో ఒంటరిగా దొరికిచ్చుకొని కౌగిలినిండా పట్టుకొని ఊపిరాడకుండా జేసినపుడు సింగరాజన్న జూసి బెదిరిస్తే తను ఆ సింగరాజన్న కాళ్లు మొక్కిన సంగతి మరిచిపోలే. కాళ్ళు మొక్కినందుకు సింగరాజన్న ఎవరితో చెప్పక ఆమెను ఇప్పటిదాకా కాపాడిండు. కానీ తనమీద కన్నేసిండు. ఆ విషయం తలుచుకున్నప్పుడల్లా ఒళ్ళంతా పాములు, జెర్రులు పాకినట్లు, తనను తన గూడెమంతా బల్లాలతో పొడిచి పొడిచి, చంపి కొండదేవరకు బలిచ్చినట్టు భయంతో దద్దరిల్లిపోయేది. భర్త ఉన్నప్పుడు ఆయన సంకలో జేరి ఒళ్లు దాచుకునేది. ఇప్పుడు వాళ్లిద్దరు కళ్లు గప్పిన కామంతో రుసరుసలాడుతూ అదనుకోసం ఎదరుచూస్తున్నారు. ఎప్పుడు బయటకెళుతదా! అని ఒకడు, ఆమె రగతాన్ని నంజుకుతిందామని ఇంకొకడు విలవిలలాడుతూ ఆగుడిసె సుట్టే తిరుగుతున్నారు. తన పుట్టింటోళ్లు ఎప్పుడు వచ్చి తీసుకొని పోతారో ఏమో? కరుణకు తెల్వదు? పుట్టింటి వారి కోసం ఎదరుచూస్తున్నది. ఎదురింటి సింగడు ఏడుస్తున్న కరుణను కనిపెడతాంటే తన మేనమామ అప్పుడప్పుడు కరుణ దగ్గరకు చుట్టరికంతో వచ్చి పైపై మెరుగులతో పరామర్శించి పోతున్నాడు. వీళ్లిద్దరి బారినించి కరుణ తప్పించుకోలేక ఇరుకున పడి అడకత్తెరలో పోకచెక్కలా తయారైంది.

ఉండి ఉండి ఆకాశం ఆచివరినించి ఈ చివరకు గీత గీసినట్లు మెరుస్తంది. ఆకాశం దట్టంగా మబ్బులు పట్టి, గచ్చుకాయలా ఉంది. బలిసిన ఏనుగులన్ని ఓ చోటచేరి గర్జించినట్టు, జలార్ధమైన మబ్బులు ఓచోటచేరి కురుస్తాం, కురుస్తాం, గర్జిస్తున్నాయి. ఈదురుగాలి వేగం పుంజుకొన్నది. మెలమెల్లగా వానజల్లు ప్రారంభమైంది. కరుణ తన గతాన్ని నెమరువేసుకుంటూ అలాగే కూర్చుండి, తేప తేపకు కండ్లనిండా నీళ్లు తెచ్చుకొని బోరుమంటుంది. బయ్యుమని వీచే గాలి దుమారానికి గుడిసె ఊగినప్పుడల్లా బెదిరి బెదిరి చూస్తుంది. ఒంటరితనాన్ని గుర్తుచేసుకొని కుమిలిపోతంది. బయట వర్షం పుంజుకొని గుడిసెలోపల ఉరవటం మొదలైంది. ఆరిపోయే ముందు వెలిగిన కొవ్వొత్తిల, కురిసిన వాన చుక్క, దీపంమీద పడి, మినుగురు పువ్వులా వెలిగే దీపం మలిగిపోయింది. బయట వాన, లోన గుడిసె ఊరుపు ఎక్కువై కరుణ ముడ్డికిందికి నీళ్లు పారుకుంట వచ్చినై. ఆ నీళ్లల్లో తన కన్నీళ్లు కూడా కలిసిపోతున్నాయి. తనకండ్ల వెలుగుతో, బతుకు పుస్తకాన్ని ఆరాత్రంతా మర్లేసింది. రాత్రంతా స్నానంచేసి ఫ్రెష్‌గా గులాంజామ్‌లా బయటికొచ్చాడు సూర్యుడు. గాలి దుమారానికి కూలిన గుడిసెలు వేసుకోవడంలో నిమగ్నమయ్యారు కోయరాజులు. కడుపకడ్డం కట్టిన బొంతసంచులపరదాను పక్కకని కరుణ బయటకు చూసింది. కండ్లు చిన్నగా, పెద్దగా

చేసి నిశితంగా పరిశీలించింది. కాళికాదేవి విగ్రహం ఆగ్రహంతో నోరుతెరచి తనవంకే చూస్తంది. కరుణ గుండెలు దడదడ లాడసాగాయి. తెలియని వణుకు మొదలైంది. తన మీద మనసుపడ్డ వారంతా కాళికాదేవికి అతిదారుణంగా బలికావింపబడ్డారు. ఆమె అందం అంతా మత్తు వంటింది. ఆమె ఉన్నచోట ఎవరికీ ఏమీ తోచదు. అందరూ తమ పనేమిటో, తామేం చేయాలో మరిచిపోయి ఆమెనే కనిపెడుతుంటారు. ఆమెనిండైన వయ్యారి భామ. చూడదగిన అందం ఆమె సొత్తు. ఆ అందాన్ని కోయ రాజులంతా దోచుకోవాలని లోలోన అనుకొనేవారే. కొంతమంది దుండగులు కూడా పెట్టారు. కొంతమంది లోలోన తిట్టుకొనేవారు. అటువంటి పిల్ల అరకొరగాని ధైర్యంతో కడప దాటింది.

తనకున్న రెండు చినిగిపోయిన అద్దాల వస్త్రాలు ఆమెను అందరి దృష్టిలో పడేస్తాయి. ఎత్తైన ఎత్తులకు బిగుతైన పిర్రలకు తెల్లని మాసంముతో కూడిన సొగసైన పిక్కలకు మోకాలి వరకున్న లంగ, ఎంతో అందాన్నికొనిపెట్టేది, ఎత్తులపై కట్టిన అద్దాలరైక, చనుగుబ్బలను ఎత్తినట్లు చూపేది. వీపు నడికట్టువరకు అంతా కనపడేది. చంక సందునించి పాల పొదుగులు మొగవాళ్లను మైమరిపింపజేసేవి. ఆమె గబగబా సూర్యునివైపు నడుస్తంది. కండ్లమీదికి జారుతున్న తల ఎంటికలను ఎనక్కి అదుముతూ సర సర నడుస్తంది. క్షణాల్లో కొండను చేరింది. ఆమె ఎన్ని రోజులనించి అన్నం తినకుండా ఉందో కాళ్లు పీకుతున్నా లెక్కచేయటంలే. కాళ్లకు రాళ్లు తగిలినా, ముండ్లు గుచ్చినా లెక్క చేయటంలే. కరుణ కాలి గజ్జెల చప్పుడు సింగరాజిగాడు గుర్తుపట్టాడు. ఆమె వెనుకనే బయలుదేరిండు. ఎండిన ఆకుల మీద అడుగు వేస్తుంటే, గజ్జెల చప్పుడుకు ఆకుల చప్పుడు వంతపాడినట్లవుతంది. ఆ చప్పుడే అల్లంత దూరాన కొండపై నున్న కరుణ మేనమామను కూడా ఉసిగొల్పింది. వాడు అక్కడ షికారు చేస్తున్నాడు. వాళ్లిద్దరు ఒకరికి ఒకరు తెలియకుండా కరుణ వెంటపడ్డారు.

ఎదురుగా చల్లగాలి కరుణ మొకాన్ని కొడుతంది. మబ్బులు గుత్తులు గుత్తులుగా ఆకాశంలో యాలాడుతున్నాయి. ఏపుగా పెరిగిన వెదురు చెట్లు పరపరమని చప్పుడు చేస్తూ బాగా ఊగుతున్నాయి. గాలి దుమారం ఎక్కువైంది. పక్షులు కొమ్మలమీద ఉండలేకపోతున్నాయి. కరుణ దేన్ని లెక్కచేయడం లేదు. నడుస్తూ నడుస్తూ ఒకచోట టక్కున ఆగింది. తనను తరుముతున్న పులిని తన భర్త చంపిన చోటు అది. అచ్చోట ఆ రోజే తను చచ్చిపోతే బాగుండుననిపించిందామెకు. తన భర్త పక్కనే తాను కూసుండి, ప్రాణాలు పోగొట్టుకుంటూ తల్లడిల్లిన పులిని చూసి బాధపడిన చోటు, ఆమె కనులను ఒత్తిగలించుకొని రెండు కన్నీటి బొట్లు నడిపి, ఆ చోటునించి కదిలింది. మళ్లీ నడక ప్రారంభించింది. చకాచక కొండెక్కుతూనే ఉంది. రయ్యుమని గాలి కుడిపక్కనించి ఎడమపక్క ఎల్లిపోయింది. ఇప్పుడు తనకు ఏది కనపడడం లేదు. తను నిర్ణయించుకున్నదంతా సవ్యంగా జరిగిపోవాలంటే తను చేసే పనే మంచిదనిపిస్తుంది. రివ్వునవీచే గాలికి కొమ్మలూగుతూ అపుడపుడు కరుణ మొకానికి తాకుతున్నాయి. ఇంకా చాలా దూరం అన్నట్లు నడుస్తంది. మెల్లగా వానజల్లు మొదలైంది. ముందు పెద్ద పెద్ద చినుకులు, టపటపమని ఆకులమీద బంతులు పడ్డట్లు పడ్డాయి. తర్వాత నిముషం పాటు ఏమిలేదు. చూస్తుండగానే కుంభవర్షం మొదలైంది. ఆకాశం చిల్లిపడ్డట్లు, ధారగా కుండలతో కుమ్మరించినట్లు పడుతంది. ఎక్కడికో ఏమో దాని గమ్యం దానికే తెల్వనట్లు టపటపమని తడిసిన రెక్కలనాడిస్తూ ఓ పక్షి బలహీనంగా పైగి ఎగిరిపోతంది.

కరుణ మేనమామ, సింగరాజిగాడు వానకు తట్టుకోక కాసేపు చెట్ల మొదల్ల దగ్గర నిలుసాని కరుణను కనిపెడుతున్నారు. ఆలోచన్ల మధ్య కొట్టుమిట్టాడుతూ నడుస్తున్న కరుణ పూర్తిగా తడిసింది. ఆమె అందాలు తడిసి స్పష్టంగా కనపడుతున్నాయి. ఆ అందాన్నే చూడటానికి వాళ్లు తహ తహలాడుతున్నారు. తడిసిన ఒంపు సొంపులకు వాళ్లు ముగ్దులైపోతున్నారు. ఆమె యవ్వనాన్ని ఎప్పుడు జుర్రుకోవాలా? అని ఏగిరిపడుతున్నారు. ఆమె వెంట వెల్లడం కంటే ఆమెను ఎంటనే అనుభవించడం మంచిదనుకొన్నారు. వారిలో క్షణక్షణానికి కోరిక ఎక్కువైంది. చెట్లచాటునించి బయటికచ్చారు. అనుకోకుండానే ఒకరికొకరు ఎదురయ్యారు. ఒకరిమీద ఒకరికి అనుమానం వచ్చింది. అంతలోనే వారిద్దరి ఉద్దేశ్యం ఒక్కటేనని తెలిసికొని క్షణమాలస్యం చేయకుండా చేతులు కలుపుకొని కొండపైకి ఉరకసాగారు. కరుణ ఉన్నట్టుండి వెనక్కి తిరిగి దిక్కులు పెక్కటిల్లేలా.. అమ్మా... అని కేకేసింది. ప్రకృతి మళ్లీ అమ్మా అని రెట్టింపుగా బదులిచ్చింది. కాళ్లీడ్చుకుంట వచ్చిన కరుణ కుప్పకూలిపోయింది. నీళ్లు నిండుకున్న కండ్లతోనే ముల్లుగుచ్చుకున్న పాదాన్ని చూసి భోరున విలపించింది. అటు ఇటు చూసి ఏమి తోచక ముల్లును పీకింది. రగతం చిమ్మింది. తన భర్త రగతం చిందించింది కూడా అదేచోటు, ఆ చోటు వాళ్ల బతుకుతో ఆడుకుంటుందేమో? నిండు నూరేళ్లు బతకాల్సిన ఆమె జీవితపు, రెండు ఆకుల్లో ఒకటి చినిగింది. మిగిలిన ఆకును, వేరొక ఆకుతో ఎంత అతక బెడుదామన్నా అతకదు కదా! ఆ మిగిలిన ఆకు కూడా చినిగిన కిందే లెక్క దీర్ఘంగా ఆలోచిస్తంది. సరిగ్గా ఐదేళ్ల క్రితం ఏనుగు దంతాల గురించి ఏమి తెలియని తన భర్త అదే చెట్టుకింద జీబెక్కిండు మళ్లి రాలె. వస్తాడో రాడో ఆమెకు తెలియదు. ఆలోచిస్తూ ఆ చోటునించి కనాకష్టంగా లేచింది. అటు ఇటు చూసింది. ఏ ఆకులోనన్నా, చెట్టులోనన్నా, పుట్టలోనన్నాతన భర్త కనపడతాడేమోనని, ఏడ కానరాలె.వర్షం తగ్గుముఖం పడతంది. ఆమె కొండెక్కుతుంటె పొద్దు కుంగి నట్లపిస్తంది.చాలా ప్రయాసగా కొండెక్కింది. తలను వెనక్కి తిప్పేసరికి ఇద్దరు వ్యక్తులు ఒర్లుతూ ఏదో గొయ్యిలో పడుతున్నట్టు ఊహించింది. ఆ తరువాత చుట్టూ తిరిగి చూసింది. ఎదురుగా టేకుచెట్టు. ఆ చెట్టు ఆకులు బాగా తడిసి కిందికి వంగి ఉన్నాయి. వాన పూర్తిగా ఎలిసింది. కొండకోన మీద టేకు చెట్టు. ఆచెట్టు పక్కనే ఈ కొండచెట్టు పెరగడం విచిత్రం అనుకుంది. టేకు ఆకును చూసింది. ఆ ఆకులు తనను చూసి వెగటుగా నవ్వుతున్నట్టు అనిపించింది. పక్కనున్న కొండాకులను కూడా చూసింది. అవి కూడా తనవైపే జాలిగా చూస్తున్నట్లున్నాయి. ఆ ఆకుల్లోంచి తన భర్త వస్తున్నట్లు అనిపించింది. నమ్మశక్యంగాలె. కొంచెం వంగి చూసింది. ఆకుల కిందనించి సూరీడు కనిపిస్తున్నాడు. మబ్బులను చీల్చుకొని నవ్వుతున్నట్లు సూరీడు బయటకస్తే తన భర్తేనని అనుకున్నది. ఇక ఆలస్యం చేయద్దనుకొని కొండాకులు తెంపి నోట్లో గుక్కింది. నమలటం మొదలెట్టింది. ఒకటి రెండు మూడు గుటుకల పసరు మింగింది. పసరు గొంతును దాటింది. పొత్తి కడుపులోకి చొచ్చింది.

మెల్లమెల్లగా పసరు శరీరానికి ఇముడుతంది. ప్రాణం సొమ్మసిల్లినట్లవుతంది. తన భర్తకు తాను దూరమవుతంది. ఆ ఆకులు తింటే కోరిక కలగదు. భర్త తింటే భార్యమీద, భార్యతింటే భర్త మీద మనసు కలగదు. కోరిక వచ్చి నపుంసకులు అవుతారు. ఇక తనభర్త వచ్చినా తనకు పిల్లలు పుట్టరు. అసలు కోరికే కలుగదు. అటువంటి ఆకుల కోసం ఈ కొండకు వచ్చింది. సొమ్మెసిల్లే ఆమె పానానికి భర్తను

చూడాలనిపించింది. మళ్లీ టేకాకులవైపు వంగి చూసింది. కండ్లు మసకలు గమ్ముతున్నాయి. కండ్లు మిటకరిస్తూ ఆడిస్తూ ఆకు దిక్కే చూస్తంది. తన భర్త పలువరుస కనపడింది. అస్తమిస్తున్న సూరీని కిరణాలను చాటుచేస్తూ, ఓ నల్లమనిషి తనవైపే వచ్చినట్లు అనిపించింది. పనికి మాలిన కుంటికోయిల ఒక్కటి సందర్భం లేకుండా ఎక్కడో దాక్కొని నీరసంగా కూస్తంది. ఆ కూతను వింటూ భర్తమీద ఆలోచన నింపింది. వచ్చే అతను అచ్చం తన భర్తలాగే ఉన్నాడు.ఆమెలో చిరునవ్వు బయలుదేరింది. అంతలోనే అనుమానం కలిగింది. భర్త పలువరుస కూడా కన్పించనంత చీకటి ఆమెలో ప్రవేశించి కింద పడిపోయింది.



సూర్యుడు పొడవంగనే కోటి కోట్ల పదునైన కత్తులు తిప్పుతూ పొడిచాడు. ఎనిమిది గంటలకే చిటపటలాడే ఎండ. పొద్దెక్కే కొద్దీ ఎండలో వేడి ఎక్కువైంది. మబ్బిడిసిన ఎండ ముండబోసిన బొడ్డిని నమ్మద్దంటారు. నమ్మశక్యం గాకుండానే కొడుతంది ఎండ, ఆకాశంలో ఎక్కడా మబ్బు తునక లేదు. గాలి బిగించుకొని ఉన్నది. ఎంత సేపు నిద్రపోయిందో కరుణకు తెలియదు. మెల్లగా కండ్లు తెరిచి నొప్పిగా ఉన్న ఒళ్లును భారంగా లేపి కూసున్నది. తనచుట్టు కొంతమంది వింతగాచూడడం కనిపించింది. తను ఇంతవరకు కుక్కినులుక మంచంల పండుకొని ఉన్నది. బయట రణగొణ ధ్వనులు కేకలు, కోలాహలం, మనుషుల మధ్య తను ఉన్నట్టు గ్రహించింది. ఎవరో పిల్లగాడు గుడిసెకున్న తడుక తలుపుతోసి మామ వస్తున్నాడని చెప్పి వెళ్లిపోయాడు. గుడిసంతా లోపల పొగతో నిండి ఉంది. పొయివైపు చూస్తే ముసల్ది మంటకోసం కడుపుల పేగుల్ని చిల్లులు పడేలా గొట్టాన్ని మూతి ముందు పెట్టుకొని ఊదుతంది. అదంతా చూసేసరికి కరుణకు భృకుడు ముడిపడింది. మళ్లీ ఆలోచనలో పడింది. ఇంటి ముందర కూడా జనం ఏదో తెలుసుకోవాలన్న ఆత్రుతతో హడావుడిగా అటు ఇటు తిరుగుతున్నారు. కరుణ మెల్లగా లేచి బయటకు వస్తున్నప్పుడు తను వేసుకున్న బట్టలవైపు చూసుకొన్నది. ఆశ్చర్యంతోనే బయటకు వచ్చింది. తన వేషధారణ మారినా ఏమి పరవాలేదు. కాని తను ఎక్కడుందో తెలుసుకొనుటకు ఆరాటపడ్డది. ఆశనిండిన కండ్లతో వాడంతా కలియ జూసింది. కనపడని ప్రదేశాన్ని మెడలు నిక్కబెట్టి నిక్కి నిక్కి చూసింది. తనకు కావల్సిన వారెవరూ కనిపించలే. ఒక చిన్న పోరడు మాత్రం నూనెసీసా సేతిలో పట్టుకొని మరోచేత్తో జారిపోతున్న లాగును పైకి లాక్కుంటూ నడిచిపోతున్నాడు. అటువైపే సగం కూలిన గోడలు, ఆ గోడలకు కొట్టివున్న పిడకలూ, గోడమీద రెండు కుక్కలు, దూరంగా పిల్లగాలికి ఊగుతున్న చింతచెట్టు, దానికింద బర్రెలు, ఆ బర్రెల వెన్నుల మీద రెండు మూడు కాకులు ఉన్నాయి. అల్లంత దూరాన టపటప కొట్టుకుంటున్న శబ్దం వినిపిస్తే అటు చూసింది. కోడిని పిల్లినోట కరుచుకొని పోతుంటే టపటప కొట్టుకుంటంది. ఇప్పుడు తన పరిస్థితీ అలాగే ఉంది అనుకొన్నది. వెనక్కి తిరిగింది. ఊరు ఒక పక్కగా ఉన్నట్లు కనిపిస్తంది. అంతవరకు లేని మాంసపుదండాలు ఎండ కాయగానే క్షణాల్లో ఇంటికో మాంసం దండెం వెలిసింది. రాత్రంతా మూతలు వెట్టి ఉంచారేమో గబ్బంతా ఒక్కసారే లేచింది. ఆ వాసన తట్టుకోక మళ్లీ ఇంట్లో దూరింది. ఎవరెవరో వస్తున్నారు, చూస్తున్నారు, పోతున్నారు. ఎవ్వరొక్క మాట మాట్లాడడం లేదు. ముసలమ్మ మూతిని ఎనక్కి ముందుకు ఆడిస్తూ చాలా ఆయాసంగా అప్పుడప్పుడు ఏదో మాట మాట్లాడుతంది. కరుణకు ఆ పూటంతా వేడి నీళ్లు కాసి పోసి సేవలు చేసింది ముసల్ది.

రాత్రి పదైంది. నిర్మానుషం. ఇద్దరు యువకులు గుడిసె దగ్గరికి వచ్చారు.ఏదో పిల్లి కూసినట్లనిపిస్తే ఇంకో మనిషి కూడా వచ్చాడు. వచ్చినతను నేరుగా ఇంట్లోకి వెళ్లాడు. వచ్చిన ఇద్దరు యువకులు బయటే ఉన్నారు. వారిలో ఒకడు గుత్తిలాంటిది చేతిలో పట్టుకున్నాడు. రెండవవాడు ఉన్నట్టుండీ ముఖం తుడుచుకున్నాడు. బయటి వాళ్లిద్దరు చిన్నగా మాట్లాడుకుంట లోపలికెళ్లిన వ్యక్తి ఎప్పుడస్తాడా? అని ఎదురు చూస్తున్నారు. లోపలికెళ్లిన తను ముసల్దాని మనవడు. పోతూ పోతూనే ఏవమ్మా ఎలా ఉందని ఆప్యాయంగా పలకరించాడు. కరుణ బిక్కమొకమేసి రెప్పార్పకుండా అతన్నే చూస్తంది. ఆమెకు లోపల ఏదో బుగులు సొచ్చింది. ఏంజెప్పాలో అర్థం కాలె. కరుణను పరీక్షగా చూసి, నా పేరు కొంరయ్య, కొండమీంచి తీసుకొచ్చి నీ ప్రాణం నిలిపింది నేనే. కొండకిందికి దొర్లుతాంటే కాళ్లకు, రెక్కలకు ముండ్లూ ముతక గీరుకపోయి రక్తం బాగా కారింది. అంతా శుభ్రం చేసి, ఇక్కడ పండబెట్టి పోయిన, ఇప్పుడెలా ఉంది? అని తాపీగా అడిగాడు. కొంరయ్య మాటలకు విపరీతంగా కోపం వచ్చిందామెకు. ఎందుకు రక్షించినట్టు? ఈడికెందుకు తీసుకొచ్చినట్టు? పైగా పెద్ద ఏదో ఎలగ బెట్టినట్లు చెపుతున్నాడని లోలోన కుమిలింది. కోపాన్ని తట్టుకోక లేచి విసురుగా బయటివైపు నడిచేసరికి కుక్కి మంచం కోడు మోకాలికి తగిలింది. ‘అబ్బా’ అని అరిచింది. తాకిన దెబ్బమీదే మళ్లీ తాకేసరికి నెత్తురు బయటపడ్డది. దబాలున లేచిన కొంరయ్య కారుతున్న రగతాన్ని తుడుస్తూ మరోచేత్తో మోకాలు పట్టుకొన్నాడు. కరుణ కోపంగా వదిలించుకొన్నది. తానే చీకట్లో కాలికి గుడ్డ కట్టుకున్నది. ముసల్ది దీపం దగ్గర బెట్టుకొని, దగ్గతే ఉన్న దీపం కాస్త ఆరిపోయింది. కొంరయ్య అగ్గిపుల్ల గీచాడు. ఆ వెలక్కు అతను మెరిసిపోతున్నాడు. వయసుకు తగ్గ అందం అతనిలో ఉంది. మంచి కుర్రాడిలాగే ఉన్నాడు. ఆ వెలుగులో అతన్ని చూస్తే తన భర్తలాగే అనిపించాడు. కరుణ ఉన్నట్టుండి భోరున ఏడ్వసాగింది. బయటనున్న ఇద్దరూ దబాలున లోన జొచ్చిండ్రు. కరుణ కంగారు పడి ఏడ్పాపింది. లోపలికచ్చిన ఇద్దరు కాసేపు చూసి పరిస్థితిని గమనించి, ఏమన్నా ఎల్దామా? ఉందామా? అడిగిండ్రు. కొంరయ్య వాళ్లతో తినిపోదామని చెప్పిండు. సరెననుకొన్నవాళ్లంతా క్షణాల్లో తిండికి సిద్ధమైండ్రు. ఆకాశంలోని సుక్కలు గుడిసెలోపలినించి స్పష్టంగా కనపడుతున్నాయి. ఇంట్లా బయట ఒకేరకంగా ఉంది. కారు చీకటిలో వాళ్లకు ఏమి కనిపిస్తుందోగానీ, తెచ్చుకున్న అన్నంతో ముసల్ది వండిన ఎండు తునకల కూర కలిపి తింటున్నారు. ఆ కూర చాలా మంచివాసన వస్తంది. కరుణకు నోరూరి, బుక్కనిండా ఊరిల్లు వచ్చాయి. వాళ్ళు తింటుంటే చూసిన కరుణకు ఆకలి విపరీతంగా ముంచుకొచ్చింది. అప్పటి వరకు ఆకలి అనే ధ్యాస లేకుండా ఉన్నది. కరుణను గమనించిన కొంరయ్య తింటావా? ప్రశ్నించిండు. తింటానన్నట్టు తలూపింది. దొంగల జూసి మొరుగుతున్నట్టు బయట కుక్కలు మొరుగుతున్నాయి. మళ్ల వర్షం వస్తదేమో అన్నట్టు గాలి మొదలైంది. గొంగడి కప్పుకొని ఉన్న ముసల్దాన్ని కొంరయ్య చూసి, ఆ పిల్లకు కూడా అన్నం బెట్టు అన్నడు.

ఆ పిల్ల మన అన్నం తింటదారా? అని ఎదురు ప్రశ్న వేసింది.

తింటనమ్మ అనే మాట సన్నగా వినిపించింది. కరుణ ఇక ఆకలికి తాళలేకపోయింది. ఏది పెడితే అది తినేటట్లు ఉంది. ఉడుకుడుకన్నం ఎల్లపాయేసి నూరిన పచ్చి మిరపకాయల తొక్కు నాలుగు బుక్కలు తిన్నదో లేదో నాలుక మండిపోయింది. ఆ యిల్లు కారుతంది. ఎన్ని నీళ్లు తాగినా ఆ కారం నాలుక మీద మండుతూనే ఉన్నది. ఇంత పులుపేసుకొని తిను మంట తక్కువైతదని ముసల్ది గొడ్డుకూర పులుపేసింది. కలిసి బలవంతాన ఒక్క బుక్కపెట్టింది. నాలుకకు రుచికొట్టింది. తను ఇదివరకు ఎన్నో జంతువుల మాంసాన్నితిన్నది. కాని ఇంతరుచి ఎక్కడా దొరకలేదు. తింటూ ఉంటే ఇంకా తినాలనిపించింది. ఆ అన్నం మీద ఏ పంచభక్ష్య పరమాన్నం పనికిరానంత పస కలిగి ఉంది. ఎంత దిన్నా ఇంకా తినాలనిపిస్తుంది. తనివితీరడం లేదు. కొంచెం స్పీడు పెంచినా కడుపునిండా అన్నం తిన్నది. నీళ్లు తాగి బేవ్ మని బేవు తీసింది. కొద్దిసేపటికి ఆమెకు నిద్రమత్తు కలిగింది. తనుకోల్పోయిన ఐదు సంవత్సరాల నిద్ర ఉప్పెనలా వెన్నంటింది. కండ్లనిండా మత్తు పొరలు కమ్ముకొస్తున్నాయి. కుక్కి మంచంలో ఏ ఒరుగుడు ఒరిగిందో పక్క బొర్లించకుండా పన్నది. తెల్లారే సమయానికి ఎడమ పక్కకు పొర్లింది. మేల్కొన్న మనసు మాత్రం రెక్కలు కట్టుకొని ఏదో అజ్ఞాత లోకాలలోకి విహరించుటకు వెళ్లింది. ఆమెకు లోకమంతా చీకటిగా కనిపించింది. కానీ అందులోకొంరయ్య ముఖం మాత్రం మిలమిల మెరిసిపోతంది. కోయరాజుల కులంలో ఒకలి రగతం ఒకలికి అంటితే చాలు పెళ్లి అయినట్లు భావిస్తారు. ఇప్పుడు తన రగతం కొంరయ్య నంటినప్పటినించి, ఆమె మతి చలించింది. ఆలోచనల్లో అనురాగం గట్టిపడి ప్రేమరూపం దాల్చుతంది. కరుణకలల ఒడిలో చక్కగా విశ్రాంతి తీసుకొంటంది. పన్నెది కుక్కి మంచం అయినా సుఖ నిద్ర పట్టింది. ఆ కుక్కిమంచం పక్కనే కోళ్లగూడుంది. అందులో కర్రె కోడిపుంజు అందరి కంటే ముందు నేనే మేల్కొన్నానని తెలియజెప్పుటకు గొంతు చించుకొని కూసింది. కరుణ ఉలిక్కిపడి లేచింది. ఇల్లంతా కలియజూసింది. గొంగడి కప్పుకొని ముసల్ది పొయికాడనే పండుకొని ఉన్నది. కండ్లు మాత్రం తనవైపే చూసినట్లనిపించి దృష్టిని మరల్చుకుంది కరుణ. బారెడు పొద్దెక్కినట్లుంది. ఆకుల సందుల్లోంచి ఎండ గుడిసెలోన పడుతంది. కోడి పుంజు కూస్తునేఉంది. కరుణ విసుగు చెంది దాన్ని వదిలితే రెపరెప కొట్టుకుంటూ గడపకడ్డంగా నున్న తడకమీదికెళ్లి బయటకు దునికి వెళ్లింది. కరుణ ఆ పుంజును చూస్తూ, కప్పుకున్న దుప్పటి పక్కకని లేచింది. ఆవులిస్తూ నోటిదగ్గర మూడు చిటికెలేసింది. ఆ తరువాత ఊడిపోయిన ఎంటుకలను కొప్పేసింది. తడక పక్కకు జరిపి ఆవలివైపు చూసింది. అల్లంత దూరాన ఆవు పెండేస్తున్నట్టు గమనించి ఆవు దగ్గరికి ఉరికింది. ఆ పెండను తెచ్చి సూరు కిందేసింది. సీపురందుకొని ఆకిలి ఊడుస్తూ ఆలోచించింది. తను ఇక్కడికి వచ్చి సరిగ్గా నెలఅవుతంది. కొంరయ్య వస్తున్నాడు. పోతున్నాడు. ఎప్పుడు వస్తాడో, ఎప్పుడు పోతాడో తెలియదు. వచ్చినప్పుడల్లా 'ఎలా ఉంది ఆరోగ్యం' అని మాత్రం అడిగి, ముసల్దానికి ఓ ఇరవై రూపాయలు చేతుల బెట్టి పోతండు. ఆలోచించుకుంటూనే పన్లన్ని పూర్తిచేసుకున్నది. మెల్లగా ముసల్దాని దగ్గర కెళ్లింది. నెలరోజులైనా ఆ ముసల్దాని దగ్గరికి పోయి పలకరించలేదు. తన గతాన్ని అప్పటిదాకా చెప్పుటకు నిరాకరించిన కరుణ పూసగుచ్చినట్టు ముసల్దానికి చెప్పింది. ఎందుకంటే రాత్రి కలలో తనగతాన్ని అంతా నెమరువేసుకొన్నది. ఇపుడు దాన్ని ముసల్దాని ముందు పెట్టింది. వెంటనే ముసల్ది ఎనకాముందేమి ఆలోచించకుండా, ఊళ్లె కెళ్లింది. ఏం చేయాలో అర్థం కాలేదు. ఒక్కతే దిగాలుగా కుక్కి మంచంలో కూలబడింది. ఎంత సేపు తన స్థితిని గురించే ఆలోచిస్తూ ఉంది. ఎవడో బిచ్చగాడు ఇంటిముందు నిలబడి కేకలు వేస్తున్నాడు. చాలా సేపు పిలిచి పిలిచి వాడు వెళ్లిపోయాడు. ఆ ఇంట్లోనుంచి చూస్తే ఎదురుగా వేపచెట్టు కనపడుతంది. అది అపుడపుడు గాలికి సన్నాయి, వాయిద్యం చేస్తున్నట్టు ఊగుతంది. ఉన్నట్టుండి తుఫాను ఎలిసిపోయినట్టు వాతావరణమంతా నిశ్శబ్దంగా ఉండిపోయింది. ఆ నిశ్శబ్దాన్ని చీలుస్తూ 'రేలా రేలా... రేలా రేలా...' అని పాడుకుంట బుర్రను మీటుతూ ఇద్దరు కోయరాజులు ఊర్లో జొచ్చిండ్రు. వాళ్లు దగ్గరవుతున్నా కొద్ది మా వాళ్లు వస్తున్నారనే సంతోషం కలిగింది కరుణకు. కుక్కి మంచాలనించి లేస్తుండగా ఆ మంచం కిర్రుమని శబ్దం చేసింది. తడక తీసి బయటకు చూసి అవాక్కయిపోయింది. చపుక్కున తడక మూసింది. కుక్కి మంచాన్ని తడకకు అడ్డంగా పెట్టింది. సింగరాజుగాడు, తన మేనమామ, కేవలం కరుణ కోసమే నన్నట్టు వాళ్ల చూపులు అటు ఇటు పడుతున్నాయి. మనుషులున్నచోట బతుకుదామన్న బతకనిచ్చేటట్టులేరు. తనను వెదుక్కుంట ఇక్కడిదాకా వచ్చిండ్రు. ఇక వదిలేటట్లు లేరు. కరుణ ఇంటిముందు వేపచెట్టు కిందనే తిష్టవేసి కూసున్నారు. వచ్చే పోయే వారికి చేయి చూసి అదృష్ట జాతకం చెపుతున్నారు. వాళ్లను చూసేసరికి కరుణకు బుగులుజొచ్చింది. ఊళ్ళెకు పోయిన ముసల్ది ఇంటికి ఇంకా రాలేదు. భయంతో కరుణ గుడిసెలో ఓ మూల మొకం చాట చేసుకొని కూసున్నది. పొద్దు నెత్తిమీదికచ్చింది. మూలకు గూసున్న కరుణకు మూత్రంతో కడుపు ఉబ్బుతున్నది. బయటకెళ్లితే తప్పకుండా వాళ్లు చూస్తారు. పోకపోతే మాత్రం ఉచ్చ పడేటట్లు ఉంది. ఇంట్లో పోస్తే ఇజ్జత్ మానం పోతది, చాలా ప్రయాసగా ఉంది. ఆమెకు క్షణక్షణం, గుటుకు గుటుకుమని బెంగ, మూత్రం తలకెక్కిందేమో ఏమో ఆమెకు చెమటలు పట్టినయి, అయినా బలవంతంగా ఆపుకుంటంది.

ఉన్నట్టుంది గాలి దుమారం లేచింది. లేచిన దుమ్ము ధూలీ ఆకులు, గడ్డి, కోయరాజుల మీద పడసాగాయి. వర్షం వచ్చేటట్టుందని ముల్లెమూట సర్దుకున్నారు. క్షణాల్లో గూడెం నిర్మానుష్యమైంది. దాక్కుని ఉన్న కరుణకు కొంచెం భారం దిగినట్లనిపించింది. ముసలమ్మ ఇంట్లో అడుగు పెట్టిందో లేదో చల్లని వానజల్లుమొదలైంది. కరుణ దబాదబా బయటకు వెళ్లి భారాన్ని తగ్గించుకొని ముసలమ్మ దగ్గరికచ్చింది. అంతలోనే దుఃఖం పొంగుకచ్చింది. కరుణ వేదనంతా తనవేదనే అన్నట్టు ఊళ్లకెళ్లి తెచ్చిన సొంటికొమ్ము, దారాన్ని చూయించింది. అదిచూసిన కరుణకు మళ్లీ ఆనందం క్షణాల్లో పొడచూపింది. వెంటనే ముసలమ్మ కాళ్లమీద పడి ఆనంద భాష్పాలతో తడిపింది.

ఆరోజునించి కరుణకు నిద్ర రావడం లేదు. కొంరయ్య ప్రతిబింబం తనను ఉక్కిరి బిక్కిరి చేస్తంది. కండపుష్టిగల ఆజానుభాహుడు కొంరయ్య, మంచి అందం, అందానికి తగ్గ గుణం ఉంది. ఆయనెప్పుడచ్చి తననేలుకుంటాడో అని ఎదురు చూస్తంది. కొంరయ్య రాక పదిరోజులైంది. రోజులెక్కువైన కొద్ది అతని మీద కోరిక ఎక్కువవుతంది. అలసి సొలసిన కండ్లకు మళ్లీ నిద్ర కరువవుతున్నది. ఆ ఎదురుచూపుల్లో ఎంతో అనురాగం, ప్రేమ, గట్టి పునాదులు వేసుకొంటంది. గ్రహణం పట్టిన సూర్యునిలా మెల్లగా ఓ రోజు వచ్చిండు. ఆ రోజు కరుణకు ఎంతో సంతోషం, ఎంతో భయంరెండూ కలిగాయి. చకచకా పనులు చేసి వేడివేడి వంట చేసి పెట్టింది. తనే వడ్డించింది. ఆమెకు గాభరా ఎక్కువైంది. ఆ పిల్ల చేష్టలు మరోరీతిల కనిపించేసరికి ఆమె గురించి ఆలోచించడం వేస్తు అనుకున్నాడు. గోడనానుకొని కూలబడ్డాడు

ఆలోచనలతో.

ముసల్ది కొంరయ్య పక్కకచ్చి 'పెద్దముండనైపోయిన, ఇంకా ఎనాళ్ళో బతకను. బతికుండగానే నాకోమంచి పనిచేసిపెట్టరా? అని సొంటికొమ్ము కట్టిన దారాన్ని చూయించింది. ఆ తరువాత అమ్మాయి చరిత్ర వివరించింది.

ఏది చెప్పినా మీరేదిచేసినా నేను చెప్పేది ఒక్కటే ఆపదలో ఉన్నదనే తీసుకొచ్చానుగానీ, చేసుకోటానికి గాదు' అని విషయాన్ని దాట వేసాడు. అతని మనసు వికలం చెందినట్లయింది. కరుణకు కోపమచ్చింది. నేను తాగిన మందు ఎందుకు కక్కపోయించినవ్' ఆ మందు అట్లే ఉంటే ఈ రోజు నేనే నిన్ను కాదనుకొనేదాన్ని' అని బాధను వ్యక్తం చేసింది.

అతను ఆమె దిక్కే చూస్తున్నాడు. ఆమె కిందికి మొకమేసుకొని మొకాన్ని చిట్లిస్తూ నేను ఒంటరిగా ఉంటే నా ప్రాణం పోయేటట్టుంది. బతికించినోనివి ఏలుకుంటే ఏలుకో? లేదంటె నేను ఏ చెర్లనన్నా పడి చస్తాను' ఏడుపు మొదలు పెట్టింది.

నేను ఏమిటో పూర్తిగా అర్థం చేసుకున్నావా? చేసుకొనే ఈ నిర్ణయం తీసుకున్నావా? అని కోపంగా నిలదీసిండు.

'నాకు అవన్నీ తెలువయి రెండవసారి పెళ్లి చేసుకోవద్దు మాకులంలో గాని నీవు తీసుకొచ్చినావు. పైగా నా చెమట, నీ చెమట, నా రగతం, నీ రగతం కలిసిపోయినాయి. చావమన్నా చస్తాను. నా పట్టాన నన్ను పోనియ్యి, లేదంటే పెండ్లి చేసుకో' అని తనూ నిలదీసింది.

'పెండ్లి చేసుకోడం నావల్ల అయ్యేపనికాదు'

'పోనీ ఇంట్లోనే తాళికట్టు'

'అది అంతకన్నా చేసేపనేకాదు' కొట్టి పారేసిండు.

'అయితే నేను నా రాజ్జెమెల్లి కాలికాదేవికి బలికావటమే నీ కిష్టమన్నమాట'

'అట్లయితే ఇన్ని రోజులు ఇక్కడ ఎందుకు ఉంచెవాన్ని' వీళ్లిద్దరి సంభాషణను వింటున్న ముసలమ్మ మధ్యలో కలుగజేసుకొని కొంరయ్య దగ్గరకు వచ్చి, "బిడ్డా! నా మాటిని ఇది కట్టరా" తాళిని సూయించింది. ఆమె మాటను పట్టించుకోలేదు కొంరయ్య.

'పిండిన పాలు పొదుగులోనికెన్నడైనా పోగలదా? అట్లాగే నేను ఇంటికెల్లడం అసంభవం' అని బల్లగుద్దినట్లు చెప్పింది.

'చూడమ్మ నా బాధను అర్థం చేసుకో నిన్ను పెంచి పోషించే స్తోమత నాకు లేదు'

'నిధితో పనిలేదు, మనకు ఇదే విధి, విధినిమార్చగలిగే శక్తి నిధికి ఎప్పుడూ లేద'ని ఉద్బోధించింది.

'సరే అయితే నా మీద నాకు ఎప్పుడైతే నమ్మకం ఉందో! ఆ నమ్మకంతోనే మనిద్దరం జీవితాంతం కలిసి ఉందాం. అంతేకాని పెండ్లి పేరంటాల జోలికి నన్ను మాత్రం ఈడ్వకు'.

'అయితే మనం భార్యాభర్తలమనడానికి గుర్తేమిటి?'

'గుర్తులేకపోతే మనం భార్యా భర్తలం కాలేమా?'

'ఎట్లాగో చెప్పు'

'అయితే హిందూ కల్చర్‌ను మాత్రం నేను ఒప్పుకోను',

'సరే నీ ఇష్టమున్నట్టు చెయ్యి."

'ఒక కొత్త సంప్రదాయాన్ని మొదలు పెట్టాలె. అది మాదిగ కులానికి చెందినదిగా ఉండాలె. దాన్నే సంస్కరణ పెళ్లి అంటారు." అని చెప్తూతూ రెండు నిమిషాలు ఆలోచించాడు."

"ఇద్దరం కలిసి ఒక ఫోటో దిగుదాం. ఆ ఫోటోలో నీకు నాకు మధ్య చెప్పుల జతను పెడదాం. ఆ జత ఉంటేనే పెళ్లి అయినట్లు లేకపోతే లేదు. దానికి ముందు నీ ఎంటికలన్ని నాలా కట్ చేయించుకోవాలి. నీ చేతికి, నా చేతికి గడియారాలు, ఉంగరాలు మార్చుకుందాం. ఆ తరువాత ఆత్మవిశ్వాసంతో దండలు మార్చుకొందాం. ఇంతకంటే ఎక్కువ ఏమి అక్కర్లేదు. ఏమంటావ్"? సరాసరి ఆమెను చూస్తూ అడిగిండు. ఆమె బాగా ఆలోచించింది. కాని ఆమెకు అది చాలా వెటకారం అనిపించింది. ఆయన కోసం ఇవన్నింటినీ లెక్కచేయద్దు నాకు ఆయన కావాలి. ఎలాగైతే నేం? అనుకొని రెండు నిమిషాలు ఆలోచించుకుంది. తరువాత గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అంతే తన పది సంవత్సరాల పట్టుదలను కాకి డ్రెస్సుముందు కాలరాసిండు. బతుకుమీద చిగురాకును మొలపించుకొని చెట్లకు చేమకు గుడ్‌బై చెప్పిండు.

పెళ్లయింది. కరుణ కోల్పోయిన ఆరు సంవత్సరాల వసంతం ఒక్కసారి గుప్పుమని వికసించింది. ఆమె కోరికలు రంగుదాల్చాయి. ఆమె బుగ్గలు ఎరుపువర్ణాన్ని పొందాయి. నిజానికి కరుణకు ఏ అలంకరణ అవసరంలేదు. మంచుతో తడిసిన మందార పువ్వులాంటి ముగ్ధ సౌందర్యం. విశాలమైన కన్నులు నల్లగా సొగసై ఉన్నాయి. ఆ కళ్లు అమాయకత్వంతో పాటు జీవితపు గుమగుమలను కోరుకుంటున్నాయి. ఆమె శరీరచ్ఛాయ పదారువన్నెల పసిడిచ్ఛాయతో పోటీ పడుతుంది. ఆమె అందం కొంరయ్య బిగి కౌగిటినిండా పులకరించింది. కులమేదైతేనేం, ఆశ్వాదించే ఆనందం కోసం. ఆయన పొందు వేయివసంతాలను చూయించింది.

గుట్టుగానే సంసారం సాగిపోతంది. వర్షాకాలం అయిపోయి చలి హెచ్చుతున్నరోజులవి. సంకల్లేవనివ్వనిచలి వాళ్ల బిగి కౌగిల్లో వేడై కరిగిపోతంది. కాలం చుట్టలుచుట్టుకొని పండుకొన్న కొండ చిలువ వలె ప్రశాంతంగా కదులుతంది. జీవితమంతా నెమ్మదిగా నీరసంగా, నిరానందంగా సాగిన కరుణ జీవితం పరవళ్ళు తొక్కేవేళ.

ఒకనాడు పది గంటలు దాటింది. చిమ్మచీకటి, దూరం నించి కీచురాళ్ల చప్పుడు విరామం లేకుండా వినిపిస్తుంది. మురికి వీధులన్ని దాటిమాదిగ గూడెం చొచ్చేముందు జీబు ఆగింది. దాన్లోనించి ఐదుగురు యువకులు దిగారు.పాతికేళ్ల వయసులో ఉన్నారు. పలుచని లుంగీలు కట్టుకొన్నారు. లోపల బాడీలు కనిపించేలా తెల్లని అంగీలు వేసుకొని ఉన్నారు. నోటినిండా పాన్లు ఒక్కొక్కరే ముసల్దాని గుడిసెవైపు వస్తున్నారు. వారిలో విచిత్రమైన ఉత్సాహం ఉంది. గుడిసెకు కొద్దిగజాల దూరంలో కొన్ని క్షణాలు నిలబడ్డారు. లోపల ముసల్ది పేగులు పడి పెట్టేటట్టు దగ్గతంది. ఆ దగ్గుకు కొంరయ్యకు మేలుకొచ్చింది. ఇక మళ్లీ నిద్రపట్టలే. బయట ఏదో మనుషుల అడుగుల చప్పుడు వినిపిస్తే

పరకాయించాడు. ఇంటిచుట్టూ మనుషులు నిలబడ్డట్టు ఛాయగా కనిపించిందతనికి, గుండెల నిండా గాలి పీల్చుకున్నాడు. దడ ఎక్కువైంది. అతనికి బతుకుమీద ఆశ కలిగి గుడిసెకున్న సన్నటి దారినించి తప్పించుకోవాలనుకున్నాడు. గుడ్డిగా వెలుగుతున్న దీపాన్ని తువ్వాలతో ఆర్పి లేచి కూర్చున్నాడు. ఎన్నో క్షణాలు పట్టలే. లోనికొక్కడు రానేవచ్చిండు. కొంరయ్యలో చలనం లేక ప్రతిమలా కూర్చుండి పోయాడు. గుండెమాత్రం దడదడ కొట్టుకొంటంది. కొంరయ్య చేతికి చూస్తుండగానే బేడీలు పడ్డాయి. కరుణ నోరు తెరిచిందిగాని ఏమి మాట్లాడలేకపోయింది. ముసల్దానికి వనుకుతోపాటు గుండెలో నొప్పి తీవ్రమై ఉన్నదున్నట్టుగానే లేచి నిలబడి ఎంటనే కిందపడి పోయింది. కొంరయ్యను తీసుకెళ్లారు. అడ్డం తిరిగిన కరుణను ఇంట్లో నూకేసి తడుకబెట్టారు. ఆమెకళ్ళు తెరుచుకునే ఉన్నాయి. ఆమె నిలువెత్తున నీరైపోయింది. కొద్దిసేపటికి అల్లంత దూరాన జీబు వెళ్లిన చప్పుడయ్యింది. ఆమె బంగారురంగుఛాయ నీలవర్ణము కాసాగింది. అందాల చిరునవ్వు నీరుగారి పోతంది. శరీరచ్ఛాయ ముడుతలు పడసాగింది. తాను మళ్లీ ఒంటరైంది. సరిగ్గా ఆరు సంవత్సరాల క్రితం ఇలాగే తన భర్తను తీసుకెళ్లారు. ఇప్పుడు అలాగే జరిగింది. పోయిన భర్త తిరిగిరాలే. ఏం జేయాలో అర్థంకాలే. వస్తాడో రాడో తెల్వదు. ఆమె లావణ్యం కుంటిదవుతుంది. వేదన రెట్టింపుగా ఎదిగిపోతంది. రేపు వస్తాడేమో, ఎల్లుండి వస్తాడేమో, ఇప్పుడు వస్తే బాగుండు, ఇంకాసేపట్లో వస్తాడేమో అనుకున్న కాలం దూరమవుతంది. ఆమె మనసు మల్లా కొండాకుల మీదికి మర్లసాగింది.



బయోగ్రాఫ్‌కు చివరిలేఖ

మనిషికి కావాల్సిన సామాన్లన్నీ దొరికే టట్లు, ఆ సివరి నించి ఈ సివరి దాకా ఉన్నయి దుకాన్లు. వాటి మోకాలమీద షెడ్యూలు కులాల సేవా సహకార సంస్థ వారి ఆర్థిక సహాయంతో అని రాసుంది. వరుసగా కట్టించిన గా దుకాన్లు ఓపెనింగు సేయటానికి ఇ.డి. దొర వచ్చిండట. గా రోజున గీ పోరగాన్ని సానా మెచ్చుకున్నడు. ఎందుకంటె గీ పోరగాడు సానా కట్టపడి పట్నంలో ఐదు పెద్ద సెప్పుల దుకాన్లుపెట్టి లచ్చాధికారి అయ్యిండట. గా ఇ.డి. ఓపెనింగ్‌కు రానైతె అచ్చిందు గాని, ఫ్చ్, ఆడున్న యెవరాన్ని నచ్చలే. ఆడ పెద్ద పెద్ద నిలువెత్తు లౌడు స్పీకర్లు భోంభోంబున మొత్తుకొనే రణగొణ ధ్వనులు, రంగురంగుల కాయితాలు, జెండాలు, తోర్నాలు, పెద్ద పెద్ద బానర్లు ఆల్‌పోస్టర్లు, సిన్నసిన్న బుగ్గల లైటింగ్ అగరొత్తుల వాసన, తాంబూలంలో టెంకాయలు, పసుపు కుంకుమలు, నొసల్ల మీద బొట్లు సానామంది, ఓహోహో సందడి సందడి, ఏడ సూసినా... హంగామా హంగామా మొత్తంగా కర్సు బాగానే సేసింద్రు. అగో... గా... కర్సు సేయటమే ఇ.డి. దొరకు ఇట్టంగాలె. మనసు నొచ్చుకున్నడట. కోపం కూడా అచ్చిందట. గింతగనం కర్సులు జేత్తె పైకి రావటం కట్టమని సెప్పిండట. అంతేకాదురో.. పెద్ద సదువులు సదివిండు గదా...గాయన సానాపైకొచ్చే ఇషయాలు సెప్పిండట. గంతెందుకు గీ పోరడు ఎట్లపైకొచ్చిండో సూడుంట్రీ అని స్టేజీమీదెక్కిత్తే గా పోరడు తన కతంతా సెప్పిండు. ఏంటో తెలుసారా? ఛ... నీ కతంటే, ఆడిదే, నీయవ్వ ఆడి దిక్కుంది అదృట్టం. ఇగ జెప్పుత ఇను.

మన పల్లెక్కడ, పట్నమెక్కడ, గీ బుడ్డ పల్లెనించి గా పట్నమెల్లాలంటే సామాండమేనా! అసలు తలుసుకుంటనే ఉచ్చబడుతంది. ఇప్పటికీ పట్నం బోవాలంటె ఎవడన్నా ముందుకత్తడా? ఏంటీ? ఈన్నించి పట్నం యెల్లాలంటే ఊరు ఊరంతా జడుసుకుంటరు తెలుసా? కాని ఆడుమాత్రం నువ్వు గింజంత జంకలేదట. ఏందిర నీ యక్క నెత్తి గోక్కుంటున్నవ్, ఇటు జూడేహే... పట్నంల ఉన్నోళ్లు మనుషులు గారా? ఆళ్లు మనుషులైతే మనల మనుషులోలె జూత్తరు, పట్నమనంగనే గింత పిరికెందుకు? అనుకుంటనే భాగ్గెనగరం ఎస్‌పరెస్ బండెక్కిండట. నీయక్క ఎక్కిండో లేదో బోగికిద్దరు ముగ్గురు సొప్పున ఎన్నిబోగిలున్నయో అంత మంది బిచ్చగాళ్లెనట. ఒగడు ఈనంగపాట పాడుకుంట పోతె, ఒకడు ఆనంగ పాట పాడుకుంట అత్తడట. పదిపైసలు, ఐదు పైసలేత్తె తీసుకోరంటరో, పావలా, ఆటనకు తగ్గరంట. ఎయ్యకపోతె నీలుక్కుంట, గులుక్కుంట తిట్టుకుంట పోతరట. నీయవ్వ, కన్నుమీద రెప్పేత్తమంటె అప్పాలోడు, బిస్కెట్లోడు, అరటి పండ్లోడు ఒకడెనుక ఒకడు అరుసుడేనట. ఏదన్న నడుమ టేసనచ్చిందంటే కిటికీల పొంటి కంకులమ్మెటోళ్లు, జామకాయలమ్మెటోళ్ల లొల్లే లొల్లట. ఆ లొల్లికి ఏదో టేసనచ్చిందని ఎంటనే తెలిసేదట. గింతమంది గిట్లకట్టాలు పడతాంటె గీ బిచ్చగాళ్ల దోసుకోటానికి గా దొంగ ... ఎట్టా మనసొప్పుతదో కదరా!... అట్లనో ఇట్లనో సికిందరాబాదు రేలు టేషన్ల దిగిండట. అబ్బో! గాడ సందు లేకుంట జనం ఉన్నదట. ఆ జనం సందుల్లో నించి సానాకట్టంగా టేసను బయటకత్తె, నీయక్క ఉసికెవోత్తె రాలకుంట జనమట. ఆ జనాన్ని సూత్తె బుగుల్జొచ్చి ఇంటిమొకాన ఎల్తామనుకున్నడట. కానీ ఈడిదాకచ్చినకదా అనుకొని, అటొ ఇటో తేల్సుకొనే ఎల్దామని సంచిలో పత్తా దీసి ఒకన్నడిగితే వాడు పక్కకు నూకి ఎల్లిండట. మెల్లగా కంట్రోలు రూం దగ్గరికత్తె ఆళ్లు యాడుంటరు. అర్ధగంట ఆనికోసం నిల్సున్న ఆడు రాలేదట. గంట సేపు టేషన్ దగ్గరే అయిందట. ఏ బస్సెక్కటమో తెల్వదు. అందుకే ఏ బస్సచ్చినా తనెక్కే బస్సు ఎంతసేపటికి రావడం లేదని అనుకుంటున్నాడట. అచ్చిన బస్సులేమో ఆక్కుండానే సర్రున దూసుకపోతాయట. గప్పుడు సూడాలె... వారి... గా బస్సులు బల్లుల్లా, నల్లుల్లా, కిటకిటలాడుతున్న పయాణీకులతో కిక్కిరిసి ఉంటాయట. ఓపిక చేసుకొని నడుద్దామంటే ఎంత దూరమో తెల్వదాయె. నీయక్క యిట్ల మనసున బడతాంటె... ఆసుమాన్ రంగు బస్సొక్కటి నాంపల్లి బోడువెట్టుకొనచ్చిందట. దాని పక్కకు రాజహంస అని రాసిఉందట. దాన్నెక్కి నాంపల్లి దగ్గర దిగి పత్తా అడిగితే ఎవడూ సెబుతలేడట. రోడ్డు అవతలికెల్లి అడుగమని ఒక పాన్ సాపోడు సెపితే ఇకజూడు రోడ్డు దాటాలంటే సానాకట్టమట. ఒకడు బరబరమని సైకిల్ మోటార్ రయ్యున ఉరికించిండట. ఎర్రలైటు పడ్డాగాని సెవులు చిల్లులుపడేటట్లు మొత్తుకుంటున్న ఒకాటోడు ఇస్పీడు మీద అత్తుంటడట. నీయవ్వ జెరయితే ఈనికి తాకునట. ఆటోడు గ్యాస్‌నూనె పోసి నడిపిత్తడంట. నీయవ్వ గాసునూనెతోని ఎట్ల నడుత్తయో కదరా. అన్ని సైకిల్ మోటార్లు, లారీలు, బస్సులు, కార్లు, రణగొణ ధ్వనులు ఊసికెవోత్తె రాలని మంది. పిటపిటలాడే దుకాణ్లు. అదంతా సూత్తె ఈ అడ్రస్ దొరకడం కట్టమే అనిపించిందీడికి. పట్నమంటే తమాసనుకున్నడు. నాంపల్లి రైలు టేషన్ దిక్కెవడు పొమ్మంటె మెల్లగా నడుసుకుంట ఎల్లిండట. నీయక్క పక్కనున్న కలక్టరేటునే ఎవ్వడు సెప్పలెదట. ఎందుకు సెబుతరు. ఎవ్వడిపని ఆడు సేకుటుంటడు. పక్కోడు నాశనమైపోయిన కనీసం సానుభూతి కూడా చూయించరట. గంతుకే కదా మనం పట్నంబోం. సానా బద్మాష్‌లు ఉంటరని ఈడికి తెల్వదు. మెల్ల మెల్లగా కాల్లెటరు పట్టుకొని కలెక్టరేట్‌కెల్లి సూత్తె నీ యక్క ఏయ్ మందిదాకా లైన్ గట్టింరట. మాసిన గడ్డాలు, జబ్బకు సంచులేసుకొని లోతు కండ్లతో బిక్కుబిక్కుమని ఒకనెనుక ఒకడు, అంతా మన ఎస్సీ, ఎస్టీలేనట. ఆడ ఇ.డి. గారు ఇంటర్వ్యూలు నడిపిత్తండట. ఓరివారి ఇంటున్నవా... ఇది మాత్రం సెవునబెట్టు. గా ఇ.డి. గారంట ధీరశాంతునిలా కనపడ్తడట. సెప్పలేనంత ఓపిక కొట్టొచ్చేటట్టు కనపడ్తడట. నాతిరి ఎనిమిదిగొట్టే దాకా ఇంటర్వ్యూలు చేసిండట. గందుకే గాయనకు 'భారతీయ ఉద్యోగ రత్న' అనే బిరుదు కూడా అచ్చిందట. బిరుదుకు మించి కట్టపడతడట. యేటా ఎంతోమందికి శిచ్చణలిప్పిచ్చి, లోన్లు ఇప్పించి, సొంతగా పనిచేసుకొని బతికేటట్టు స్తేతడట. ఆయన ఉద్యోగమే అదట. ఆరేయ్ నీకు తెల్సారా! మా సంటోడు కూడా పేపర్లో గీ సంగతి గురించి సదువంగ నేనిన్న. నీయక్క ఆ ఆఫీసంతా దినం ఓజాతరోలె ఉంటదట. గటువంటి ఆ ఇ.డి. సారు ఇంటర్వ్యూలో గీ పోరెడు సెలట్టయ్యాడట. కోర్సు రాంగానే సరిపోలె. గక్కడే అచ్చింది పెద్ద సిక్కు యాడుండి సేత్తడు కోర్సు. నీ యక్క ఎవ్వన్నడిగినా కరినారం అని సెప్పంగానే మరోమాట మాట్లాడకనే తీసిన తలుపులు మూసుకుంటున్నరట. అడిగిన పదిండ్లలో ఇల్లుకిరాయికి దొరకలె. దొంగ... లం... తా కులం అడుగుతున్నారట. కొంతమందైతే బాపనోళ్లకే ఇత్తమని, కొందరేమో విజిటేరియన్‌కే ఇత్తమంటున్నరట. నీయవ్వ మనోడేమో అబద్దమాడడాయె, నిక్కచ్చిగా మాదిగోన్ని అంటే ఎవడిత్తడు కిరాయికి. తిరిగి తిరిగీ రాతిరైపాయె, దొంగతనాన పబ్లిక్ గార్డెన్ల పండుకొని తెల్లారినంక ఇల్లుకోసం తిరిగిండట. లాడ్జింగ్‌లకు పోతే ఎన్ని డబ్బులడుగుతారో తెల్వదు కదా! ఇల్లు దొరకలేదట. తీసుకబోయిన పెంకాసులు అయిపోతున్నాయట. ఇగ మనోడు పెండ్లిగాలేదంటే దగ్గరికే రానిత్తలేరట. నీ యవ్వ అట్లిట్లని వారం

గడిచిన ఇల్లే దొరకలేదట. ఎత్కంగా ఎత్కంగా సివరికి కరితాబాద్‌లో ఓ ఇల్లు దొరికిందట. ఎట్ల దొరికిందో తెలుసా? ఈసారి మనోడు మున్నూరు కాపోన్నని సెప్పుకొంటె ఇల్లు దొరికింది. నీయవ్వ అంత పెద్ద పట్నంల కులం పువ్వోలె ఇకసించి ఎలా ఇర బూస్తుందో ఇంటున్నావురా! అన్నే గంత కుల మర్యాదుంటే ఇక ఈ బుడ్డ పల్లెలుంటం పెద్ద లెక్కా? నీ సమాజం పాసుకొల్లినే .... కులం పునాదుల మీద సమాజం ఎలా నడుత్తందో సూడు. నువ్వద్దిగరా.. నీయక్క అదంతా సూత్తాంటే పెయ్యింతా జేపురిత్తంది సూడు. వారీ ఇంటున్నవా కిలాసులు నడుత్తాంటే... గా ఇ.డి. ఓరోజు సెకింగ్‌కచ్చి షెడ్యూలు కులాల సేవాసహకార సంస్థ పథకాల గురించి ఇవరించిండట. 'ఇదొక్కటే సేత్తె బతకలేరు, పక్కపొంటి ఏదన్నా సేసుకోంండ్రని' కూడా సెప్పిండట. బతుకుదెరువు గురించి సాన వివరాలు జెప్పిండట. అగో గప్పుడే ఈడి మనసుల పడ్డది ఏదన్నా సెయ్యాలని. ఇక అదే మనసుల బెట్టుకొని తిరుగుతుండట. ఓ రోజు సానా పొద్దు పొయ్యాక సిన్నగ నడుసుకుంట పబ్లిక్ గార్డెన్‌కెల్లిండట. రోడ్డు పక్కన అంతా బిచ్చగాళ్లె. ఏద్దామంటె ఏమున్నది, చేతుల ఫైలుతప్ప. యాడతిరిగినా మనసొప్పటంలేదట. నాంపల్లి బిడ్జెక్కి రెడ్‌హిల్స్‌తోవ బట్టిండట. నీయక్క ఆ బిడ్జెక్కి దిగేటప్పుడు గూడ బిచ్చగాళ్లేనట. పూరిగుడిసెలు బోలెడన్ని రోడ్డుపొంటె ఉన్నాయట. అటు ఇటు గుడిసెలేసి ఉండడం వల్ల తోవంత ఇరుగ్గా ఉంటదట. ఆ ఇరుగ్గుండా నడుసుకుంట ఎల్లుతున్నడట. ఆలోసన్లోపడి పోతుంటే ఏమున్నదిగా సేతులున్న ఫైలునించి కాయితాలు ఏవేవో కింద పడ్డాయట. నీయక్క పడేది పడంగనే సిత్తుకాయితాలేరుకునేటోడు టక్కున తీసుకుని బోరెంసంచిలో కుచ్చుకున్నడట. అది సూసిన సైకిల్ సాపోడు ఈ పోరగానికి సెప్పితే పాణం గుటుక్కుమన్నదట. నీయవ్వ ఎంబటే పేపర్లేరుకునేటోన్ని పట్టి తన సిల్కులు తాను ఎతుక్కునేటాళ్లకు నీయవ్వ గా పోరి బంగ్లా మీంచి. ఎవఁరా అది అని గీడు పైకి సూసె, నీయక్క ఏసూపులు పడ్డాయోగాని ఆ సూపులు పది నిముషాలపాటు పక్కన ఎవరత్తున్నారో, ఎవరు పోతున్నారో తెలియకుంట అయిపోయిందట. ఇగ గాళ్ల పాతకథ ఏందంటే... వారీ.. పేద్ద పుక్కిడి పురాణం.

కరీంనగర్లో ఉండగానట గా పోరీ తెల్లారంగనే బుర్సేసుకుని తోముకుంట బంగ్లామీంచి గీ పోరగానికి బీటేసేదట. నైటీ ఏసుకుని తన అందమైన స్ట్రక్చరు, ఇంకెవరికి లేదన్నట్టు పిటపిటలాడించేదట. ఆ పట్నం పోరగాళ్లకు ఏమన్న పనా! పాట, నీయవ్వ తినటం, ఏరగటం. నీ... ఏరుగగూడ దూరం పోవుడు లేదాయె. కడపదాటి బయటికెళ్లితే నీ యక్క పిటపిటలాడే వయస్కు రంగు రంగులు బూసి, అందరు నన్నే సూడాలని రోడ్లమీద పిర్రలన్ని తింపుకుంట మొగ పోరగాళ్లను రెచ్చగొట్టుడాయె. గీ పోరీ గటువంటిదే, ఈ పోరగాడు పొద్దుగాల్నె ఆంధ్రభూమి పత్రిక ఇంటింటికేసెటోడట. పొద్దు పోతందని రయ్యి రయ్యిన గీడు మూలమీంచి పోతాంటే, నీయక్క ఎనుపబర్రోలె అచ్చి సైకిల్‌కు సైకిల్ గుద్దిందట. పాపం పోరగాడి కాలుకు మూడు కుట్లు పడినయి. నా గుర్తు ఈ పోరగాడికి ఇంకా ఉంది. గప్పటినించి ఆ మూలమీదికొచ్చి సూత్తె నీ మదం గుద్దల... గా పోరీ తన పెయినే సూసుకుంట సైకిల్ తొక్కేదట. జెరగప్పటినించి ఈల్లిద్దరికి కొద్దికొద్దిగా ఓరసూపులు కల్సినాయనుకో... ఇగ ఎప్పుడు కల్సినా నవ్వుకునేటోళ్లట. గటువంటిపోరీ గీ బంగ్లామీద వక్కడ వక్కడ నవ్వుతుందేమి? అని ఇసిత్రంగా సూత్తంటే. ఓ మోటర్ సైకిలోడు సర్రున బిరేకేసి సైకిలుకు గుద్దనే గుద్దిండట. ఏందిరసామీ, సత్తార్రా. జెరమెల్లగ బోరాదుండ్రని ఓ ముసలోడు అనుకుంట వచ్చి, ఈనితో గలసి పడ్డోల్లనిద్దరినిలేపిండ్రట. నిముషమైందో లేదో పదిపగ్గాలు పెట్టు ట్రాఫిక్ జామైందట. గప్పుడే ఆంధ్రభూమి పత్రికను ఈలైన్ల గూడా ఎయ్యాలనుకొని బంగ్లామీదిపోరిని సూసుకుంటనే ఇంటికెల్లిండట. ఆటైమప్పుడు గా పోరీ మాట్లాడాలని అనుకున్నదట కాని కింద ఎవర్నో సూసి ఆగిపోయిందట.

ఇగ మెల్లమెల్లగా సాన్నాళ్లు అయిపోయినాక, ఓ రోజు గీ పోరడు ఆ పత్రికను గా పోరింటికి తీసుకెల్లె. గంతపొద్దుగాల గా పోరగాండ్లు లేవటానికేమన్నా అది పల్లెటూరా ఏంది? లేకపోతే ఆళ్లేమన్నా మాదిగోళ్లా?. పోరి తండ్రి తీసుకున్నడట, నీయమ్మ పదిరోజులు ఇపరీతంగా పయత్నం చేసినా గా పోరీ లేవదాయె. బయటికి రాదాయె. గీ పోరగానికి మనసున పట్టదాయె. ఎపుడు ఏది జరుగాలో అది జర్గద్దిగాని నువ్వునేను ఏగిరపడ్డట్టు పన్తయితయా? గా పోరే ఓ రోజు పేపర్‌కోసం ఎదిరి చూసిందట. గీ పోరడు ఆ రోజే లేటుగా ఎల్లిండట. నీయవ్వ పేపర్ బాడుకావ్ రాలేదని గమలలో నిల్సుండి రుసరుసలాడేది కాస్త గీ పోరన్ని సూసి నిలువునా నిట్టేడయిందట. ఇచ్చిన పేపర్ను తీసుకొని సిత్రంగా అనుకుతున్న పెదవులను దగ్గరబెట్టి కన్నార్పకుండా సూసిందట. ఈ పోరనికి సూడాలనుండె, మరి లోపలికెల్లెవలన్నత్తెట్ల, పైగా పొద్దు బోవట్టె అవతల ఇండ్లల పేపరు ఎయ్యాలెగదా! గీని పరిసాన్ గీడికుంటే గా పోరె జెరమెల్లగ "నువ్వు ఇట్లా" అని ఆనబోయిందో లేదో నీయక్క అవును నేనే నీకోసం.. అని పండ్లికిలించి పైడిల్‌మీద కాలుబెట్టి కనుమరుగైండట. గానాటి నించి గా పోరీ పొద్దున్నే గీ పోరగాని కోసం ఎదురుసూసేదట. ఈ కథ ఇట్లుందా?

ఇగ కాలేజీలో కూడా ఇద్దరు ఒకరోజున కల్సుకునే సరికి గా పోరీ అందంతోనే పాటు మనసు ముడేసుకున్నాడట. గీ పోరడు లాయరు సదువుతాంటే మొదట సంతోషించింది ఆపిల్లేనట. నల్లనిరోడ్డు, పచ్చనిజెట్లు సున్నమేసి ఉంచిన సిమెంటుబల్ల ఆ బల్లమీద కూసోని ఇగ పొద్దుపోయేదాక ముచ్చట్లే ముచ్చట్లు. పోరడు ఎర్రగ బుర్రగున్నడు పైగ ఏమి సెడ్డలవాట్లు లేనోడు. ప్రేమ ఒక్కలెక్క దాన్లో సంతోషం గుణకారంలా రెట్టింపైదట. దుఃఖం భాగాహారంలా కొట్టుడుపోయిందట. స్నేహం ఒక కూడికలా పోగుచేసుకొని శత్రుత్వాన్ని తీసివేత్తే, ఆకర్షణ అవగాహన, ఇష్టం, తాదాత్మ్యత, స్పర్శ, కామం, ఓర్పు అనే ఏడు గుణాల వాళ్ల ప్రేమ ఇంద్రధనుస్సై మెరిసిపోతంది. కలుసుకున్నప్పుడల్లా.

ఓరోజు తోటోల్లు సినిమాకెల్లుతాంటే గీ పోరికి కండ్లు గుట్టె సెలోమని ఈ పోరగాన్నెగేసింది.

మనం సిన్మాకెల్లితే నీకు ముప్పు అని ఎంత సెప్పినా ఇన్లే. సినేహితం, సినేహితంగా ఉంటమే మంచిదని ఇతబోధ సేసిండు.

ఎవరికోసమో మనము దగ్గరయ్యామా? అని యెడమొగం పెడమొగం పెట్టె.

ఇగ గా పోరడు ఎంటనే నల్లబడ్డాడు. సేతిలో సెయిబడె ఏమున్నది తార్నాకకు బోయిరి, ఆరాధన టాకీసులో జీవనరాగం సిన్మా మార్నింగ్‌షో ఇడుదలయ్యె.



రోజెనుక రోజు కాలంబాయె, నీయవ్వన్..., గాపోరీ ఓరోజొచ్చి, నాకు పెండ్లిసూపులరోజు దగ్గరకచ్చింద'ని జెప్పటంతో పోరని గుండె గుబేలుమన్నది. మరి ఏం జేయతలసుకున్నవ'ని పోరడగితే, ఏమున్నది, పెద్దల్జూసి సేసిన పెళ్లి ఎవలన్న కాదంటరా? అనిపోరగాన్ని ఓ ఆటపట్టించింది. గప్పుడే సెట్టుమీద ఓ పిట్ట గొంతు ఎవరో పిసికినట్లు రెప రెప కొట్టుకుంటాంటే ఆ సెట్టుమీద ఎండిన ఆకులన్నీ ఈల్లిద్దరిమీద రాలవట్టె. అన్నించిలేసి రోడ్డుదాటుతుంటే సైలెన్సర్‌లేని ఓ స్కూటర్‌మీద బర్ర్ బర్రమని శబ్దం చేస్తూ ఓ జంట రయ్యుమని పోయింది. అల్లంత దూరాన గేటు తీయమని వి.సి.కారు హారను గొడుతంది. గేటుముందర ఇగ ఈ పోరడేమో మొకం సాటుసేసుకొని కండ్లనీళ్లు తెచ్చుకొంటండు. ఎందుకంటే ప్రేమ గుమగుమలు ఆగిపోతే, తరువాత ఇడిపోయే ముల్లు బాధే ఎక్కువగదా. ఆ పిల్లేమో ఇసుమంత బాధలేకుంట హుషారుగుంది. పైపైనలేని ప్రేమను మొకంమీదికి తెచ్చుకొని ఆ జంట బాయ్ సెప్పుకొని ఎవరిదారిన వాళ్లు ఎల్లిపోయింద్రు.

బలబలమని తెల్లారుతుంటే కృష్ణా ఎస్ప్రెస్ పోవుటకు సిద్దంగుండి కేకపెడుతంది. పాలు సర్పరా జేసేటోల్లుకూడా బయలుదేరింద్రు. గీ పోరడుకూడా పేపరు తీసుకెల్లి గాపోరి ఇంట్లో కింద పారేసి సూడకుంటనే ఇల్లుదాటిండు. రెండోరోజు కూడా అట్లనే పారేసి పోయిండు. కాని మూడోదినం గా పోరి ఆర్డర్ పాస్‌సేసి ఇంట్లోకి గుంజుకపోయింది. తల్బెట్టింది. ఇట్టం ప్రేమగా మారాలంటే అలిగిపోవుట కాదు. దానికి గవురం కూడా తోడ్పడాలె అన్నది. నిదానంగా ప్రేమ నీలో ఎంత ఉందో ఎదుటి వ్యక్తిలో అంతకంటే ఎక్కువే ఉంటుంది. కాని ఇద్దరి మధ్య దూరం పెంచితే ప్రేమ నవించవచ్చుకదా! అని పెడమొగమేసిండు.

కాని ఓర్పుంటే ప్రేమ ఫలించి వెలుగొందుతంది నీకు తెలుసుగదా! అప్పుడే ఆవేశపడ్డావెందుకు? ఏ మనిషి నమ్మకాన్ని కోల్పోతాడో ఆడ ప్రేమని కోల్పోతాడు. అందుకే ఆ మనిషిని ఆలోచింపకుండా అందించేదే అమృతమైన ప్రేమ అని నా ఉద్దేశ్యం. తనక్కావలసిన వ్యక్తి తన పరోక్షంలో కూడా తన గురించి మంచైనా చెడైనా ఆలోచిస్తాడంటే అంతకు మించిన ప్రేమ యాడుందని ప్రశ్నించిందామె. గీ పోరడేమో మొకం గూడ సూడక బాధాకరంగా ఉండే నీ అక్కం....., వయస్సులోనున్న పోరికి ప్రపంచమంతా ప్రేమమయమేకదా... గా పోరీ పరువం ఎరుపెక్కి అమాంతం అలుముకొని ఉక్కిరి బిక్కిరి సేసింది. ఈ పోరడు బతిలాడబట్టె అద్దు, అద్దు అని దూరం దూరం బోవట్టె. మానవ సంబంధాలన్నీ ఉల్లిపాయల్లాంటివి. ఎర్రరంగులో మెరిసే తొక్కపైనుంటేనే అవి బాగుంటాయి. లేకపోతే కన్నీరు తెప్పిస్తాయి ప్లీజ్. నా గురించి తెలుసుకో నేనెవరో నీకు తెలియదు, నా గురించి పూర్తిగా తెలుసుకో.. అని ఎంతసెప్పినా...ఆ పిల్లిండ్లే.

స్త్రీ పురుషుడిలో ఏమి చూడదు. అతని మేధస్సు, పర్సనాలిటి, విజయాలు, ఇవన్నీ ఏమి ఆమెను ఆకట్టుకోవు. కేవలం తనని అతడు గుర్తించాడా లేదా అని తప్ప, స్త్రీ తనకిష్టమైన పురుషుని తాకాలనుకుంటుంది. ఆ స్పర్శ, అబార్షన్‌కు దారితీసిన తను శీలం కోల్పోయినట్లు భావించదు. ఒకవేళ ఆ తప్పులను ఎవరైనా ఎత్తిచూపితే తప్ప. ఇవన్నీ నాకు అక్కర్లేదు. నువ్వు ఒక పేద విద్యార్థివి అయితేంది. లాయరు సదువుతున్నవ్, నాకు బాగా నచ్చినావు. ఆడోళ్లంతా కండ్లు పొడుసుకునే అందగాడివి. అయినా ప్రేమ కలుగటానికి ఎన్నో సంఘటనలక్కర్లే. మనసు బీడుమీద వానసినుకుల్లాంటి ఓ చిరునవ్వు. ఓ కనుచూపు చాలదా.....!? నువ్వు ఇంకొకరికి దక్కద్దు. నాకే సొంతం కావాలెనని మంచంలో నూకేసిందట. మంచి ఉడుకుమీదుంది గిత్తె. పోరడేమో జెరనుకాడుతుండె అస్సలు రాజీ పడతలేదు. ఇంట్లో ఎవరూ లేరు. మంజీర నీళ్లు హౌజ్ నిండి కిందపడిపోతున్నాయట. అయినా గా పోరీ లెక్కచేయలే. ఇంతలో తలుపుగొట్టినట్టు టక్ టక్... మని సప్పుడయ్యింది. పోరని.... పాతాళం పట్టినయి.. గుండె దడ ఎక్కువయి పెయ్యంతా జల్లు జల్లు మనవట్టె. గా పోరీ బిర్రునరికి తలుపుదీసి పాలపాకెట్ తీసుకొని మళ్లా తలుపుపెట్టింది. గప్పుడు పోరడు హిమాలయ పర్వతాన్ని తనమీద దించినట్టు గుండెబాధను దించుకున్నడు. మంచాల గూసున్న గా పోరన్ని అమాంతం బెడ్‌మీద పాడేసి మీద కూసుంది. రేపు చేత్తున్నాడని గోలగోల సేత్త 'అరె చుప్... నువ్వేం మొగోడివయ్యాబాబు' అని తనకు తానే ప్రశ్నించుకున్నది. మళ్లా సంభాలించుకొని పోరన్ని లైన్లకు తీసుకొచ్చుకోవాలని 'గొప్ప వాళ్లెపుడు సామాన్యంగానే కనపడతారు. అటువంటి వాన్ని దొరికించుకోవడం ఉత్తముల లక్షణం. అట్ల నిన్ను నేను దొరకవట్టుకున్నాను. అని రెచ్చగొట్టింది. మాదిగ బుద్ధి, మటన్ తిన్న శరీరమాయె, గా మాటకు రోసమచ్చింది గీ పిల్లోనికి. సామిరంగ ఆ రోజంతా పరుపుల ఫైటింగ్ మా జోరుగ జేసింద్రట. అట్ల ఆరునెల్లు కనపడ్డపుడల్లా, తావు దొరికినపుడల్లా ఫైటే ఫైటు.

వారి కథ గిట్ల జోరుగ నడుత్తాంటే ఓ రోజు పిల్ల కనపల్లె. కాలేజీ అంతా వెతికిండు. దాబా హోటల్ దగ్గరికెల్లి అడిగె, కల్సుకునే తావు దగ్గరికెల్లె, లైబ్రరీలో జూసె, బ్యాంక్ దగ్గర జూసె, సెట్టుమాటున, పుట్టమాటున, గుట్టమాటున, ఏడ జూసిన కానరాలె. ఫోన్ జేత్తామనుకునేగాని, భయమేసింది. ఇదివరకెప్పుడు జెయ్యకపాయె. గా పోరీ రేపురానని కూడా జెప్పలె. గీ పోరడు పచ్చి పచ్చిగా తిరిగి పచ్చయిపాయె. ఆ రోజంతా మనసుల మనసు బట్టలె. ఆకలిగాలె, నిద్రబట్టలె, తెల్లారి పేపరు తీసుకెల్లిన గాని గా పోరీ కనిపించపాయె. ఓ రోజు, రెంద్రోజులు, మూడు, నాలుగు ఆరం అయిపాయె. పోరనికి పిచ్చిబట్టవట్టె. ఇగలాబంలేదని తెగించి ఇంటికెల్లిండు. అబ్బోగాడ జూడువారీ, గా పోరీ అన్నగాడు సూసి సూడంగానే కొట్టకొట్టరావట్టె. పిల్లగానికి ఉచ్చబడ్డది. నోటమాటరాక గుటికిల్లు మింగుతున్నడేకాని, ఒక్కమాట పెకలదాయె. ఓర్నియవ్వ గాబాడ్‌కావ్ తంతా, చంపుతా, చీరుతానని ఎగురబట్టె. తండ్రేమో జెరాగురా! అని ఆపవట్టె. గింత జరుగుతుందా, గాపోరీ గీ పిల్లగానికి కనపడదాయె, వంటరూముల నున్న తల్లి సెంగు బొడ్లోసెక్కి పిల్లగాడెట్లున్నాడోయని, సూసుటకు వచ్చినట్లు వచ్చి సూత్తున్నదట, జెమిని టీవీలో ఏకవీర సిన్మా డైలాగులు ఇనపడుతున్నాయట, ఇట్ల గొడవ జరుగుతుంటె అచ్చెటోళ్లు, పొయ్యేటోళ్లు జామైరి. ఇంగ గా పోరీన్ని ఇంటి ముందర సానాసేపు వుంచితే మంచిదిగాదని తండ్రిగాడు వార్నింగిచ్చి తలుపుమూసుకున్నాడట. అంతటితో ఆగిపోలె, లైబ్రరీ ముందర ఉన్న ఓ సెట్టుకింద గీపోరడు సిన్నబోయి కూసొని ఆర్టుకాలేజీ దిక్కు ఓసారి, రోడ్డుమీద బస్సెల్లుతుంటె దానివైపు ఓసారి, అచ్చెపోయె వాహనాలన్నింటిని పరీచ్చగా సూత్తుంటే ఆ పోరగాని ముందటికెల్లి జంటలు జంటలు పోరగాల్లు పోతుంటే ఆశగా.. నిరాశగా... సూత్తుండె. పోరితో పెంచుకున్నాడు, బాగా పెరిగింది మమత ప్రకృతిలో పంచుకున్నాడు తగ్గలే బాధ. పంచుకున్నా, పెంచుకున్నా గతం యాడబోతది, మెరిసే నీళ్లల్ల, కదిలేమేఘాలల్ల, నిల్సిన కొండలల్ల, గాపోరిని సూత్తనే ఉన్నడు. మరి వారీ గా బాధను మర్సిపోవాలంటే దుఃఖమే సరియైన మార్గమైతే ప్రపంచమంతా దుఃఖాన్నే కోరుకోదా...?

ఒక్కుదుటున గాలి ఎడమదిక్కునించి గప్పున అచ్చేసరికి కిందున్న ఆకులన్ని గీపోరని మీద పడుతున్న లెక్కజెయ్యలె. గింతలో రోడ్డు మీద ఓ పోరగాడు బస్సెక్కుటకు ఉరికి ఉరికి అడ్డంపడి మూడుపొర్లు పొర్లుతుండడం గీ పోరని దృష్టిలో పడింది. లేపుదామని గబుక్కున లేసి, మళ్లీ కూసుండె, దానెనుకనే సైలెన్సర్ లేని ఓ స్కూటర్ అందరి దృష్టిని తనమీదికే తెప్పించుకొని పరుగుబెదుతాంటె, స్టూడెంట్స్ అంతా అడ్డం తిరిగింద్రు, అక్కడేదో యుద్ధభూమి తయారయ్యేటట్లుందని అనుకొంటండు. ఇంతలో స్టూడెంట్స్ ముందకచ్చి స్కూటర్ను పట్టి ఏందిరా, ఇదో స్కూటర్, నువ్వోమనిషివని, బండిమీదికెల్లి గుంజింద్రు, స్కూటరోనికి అనుకుబుట్టి, పోరగాళ్ల గదువపట్టుకోబట్టె, ఇంకోసారి ఈ క్యాంపస్‌లో కనపడితె బిడ్డా బతుకవ్ అని బెదిరించడం కనబడ్డా... గీ పోరనికి ఉలుకు పలుకు లేదాయె. గీ పోరదు మెల్లమెల్లగా బంగారమటువంటి సదువు మానేసిండు. ఆ పిల్లను మరిసిపోవాలన్నా ఈనివల్ల గావటం లేదు.

లాయరు కోర్సు సేయాలని జీవితధ్యేయంగా పెట్టుకున్న పోరదు కష్టపడి సదివి, సీటుసంపాదించి, రెండేళ్లు దీచ్చగా సదివిన సదువును ఇడిసిపెట్టె. గప్పట్నించి జీవితం మీద ఆశపోగొట్టుకున్నాడు. పిల్లమీద బెంగతో తల్లడిల్లిపోతంటే సానా రోజులకు ఓ ఉత్తరమచ్చింది. ఇంటన్నవారా! గా ఉత్తరం పోరి రాసింది. ఏమని తెలుసా?... సాలా ఇసిత్రంగా ఉందట.

డియర్ డార్లింగ్,

నన్ను సెమించు, ఇవరాలు సెప్పకనే నిన్ను బాధపెట్టాను. గారోజుల్లో మనం క్యాంపస్‌లో తిరుగుతుండగా మా అన్నగాడు సూసి, డాడీతో సెప్పేసిండు. డాడీ డాడీ, సెల్లె మంచి పార్టనర్‌ను సూసుకున్నది. సెల్లె గురించి పికర్లేదు. పెళ్లిసూపులు అక్కర్లేదని, ఇక పెళ్లి సూపులు నాకేలేటని, నా పెళ్లిసూపులు ఆపేసాదు. దాంతో నేనునిన్ను సస్పెన్సులో పెట్టే నాకునేనుగా మొత్తం అర్పించుకున్నాను. కాని చివర నీ కులం మాదిగ కులమని, నీకు సిప్పగతిలేదని, తెలిసిన తరువాత అన్నయ్య నన్ను బంధించి, నాకు మూడవనెల అయినాగానీ, అబార్షన్ చేయించీ బలవంతపు పెళ్లి చేయించాడు. ఏది ఏమైనా నేను మాయనతో భౌతికంగా గానీ, మానసికంగాగానీ, శారీరకంగాగానీ, సుఖం పొందటం లేదు, కండ్లల్లో నింపుకున్న నీ ప్రతిబింబ బయోగ్రాఫ్. తో నాశృంగార జీవితానికి తృప్తి కలుగుతుందే తప్ప, ఇంక ఈ జీవితానికి అసంతృప్తే శాశ్వతంగావచ్చు బాధాతప్తురాలనైన నన్ను విముక్తి చేస్తావని ఆశిస్తూ నా కోసం ఒక మంచి నిర్ణయం తీసుకొని, మధనపడుతున్న నా మనసును శాంతింపజేస్తావని ఆశిస్తూన్నాను.

నీ బింబాన్ని ఎదపై ప్రతిబింబంగా నిలుపుకొన్న నీ ప్రేయసి...

అగో గా ఉత్తరంలో సిప్పగతిలేదనే మాట గీ పోరనికి పౌరుషాన్నిచ్చింది. గా ఒక్కమాటతోనే కుమిలికుమిలిపోతూ.. లాయరు సదువునాపేసి సంపాయించాలనే డిసైడ్‌జేసుకొని గీ ఇ.డి.గారిసంస్థల అప్లయ్ చేసి లోను సంపాదించిండు. కష్టకాలంలో గీలోను సాంచనై ఇష్టమచ్చినట్లు ఖర్చుపెట్టక, పైస, పైస కూడవెట్టి ఇగొగింతటోన్ని అయిన గిదంతాగా ఉత్తరం జెయ్యబట్టె, దానికి తోడు రోడ్డుమీద తిరుగుతున్న నన్ను జబ్బ సరిసి ఆదరించిన గీ ఇ.డి. గారి సలవవల్ల, గీ రొండు ఇషయాలవల్ల నేను గింతటోన్నైన అని గా పోరదు నాకు సెపుతాంటె ఎంత ఆనందమైందో తెలుసారా?

దోషులెవరు !?

'బిచ్చంబాబు' అడగ్గానే రూపాయి తీసేయబోయిన భర్తను చూస్తే భార్యక్కోపమచ్చింది. కనీసం బిచ్చమేసుకోటానికి కూడా ఈ మాదిగోడికి స్వేచ్ఛలేదా? దొరసాని' అన్నట్లు వ్యంగ్యంగా చూసాడు గాలయ్య.

'నువ్వు బిచ్చమేత్తె ఆమె తీసుకుంటందా ఏంటి?' అనినికార్సయిన అనుమానాన్ని వ్యక్తం చేసింది.

బిచ్చపుదాన్ని చూస్తూ... 'నీ పేరేంటమ్మా' అడిగాడు గాలయ్య.

'భారతి'

మరినేను మాదిగోన్ని, తీసుకుంటావా? అనుమానం వ్యక్తం చేసాడు.

మెడ గోక్కుంట బిచ్చపుది 'సకల భోగాలతో పాటు, సకల కట్టాలనుభవిత్తున్న దాన్ని, నాకేం ముట్టుడు బాబు, ఎయ్యి!' మని బొడ్డుల గిన్నె సాపింది. గాలయ్య నవ్వుతూ. రూపాయేసిండు.

'ఈ బిచ్చగాళ్లు కలిస్తే చాలు తీరని ముచ్చట' గొనుక్కుంట నిట్టూర్చింది గొంతెమ్మ.

ముసల్ది బోగాలు, గీగాలు అని మాట్లాడుతంది, మరి ఈ గతెందుకు బట్టిందో! నని ఆలోచిస్తూ ముసల్దానివైపే చూస్తున్న గాలయ్య పక్కకచ్చి ముసల్ది, 'పదిపైసలెయ్యమంటే ఎయ్యని ఈ పాడులోకంలో రూపాయేసి, నా కడుపు ఇసారిత్తన్నవ కొడుక, నువు సల్లంగుండ' దీవించింది. బొక్కినోరు వెనక్కి ముందు కాడిస్తు మాట్లాడితే కోస్తాంధ్రలో తుఫాన్ పడ్డట్టు, గాలయ్య మొకం మీద తుప్పుల్లు పడ్డయి.

గాలయ్య 'లోకాన్ని తిట్టద్దమ్మా' హితవు చెప్పాడు.

'లేదు బిడ్డా! లోకం మునిగిపోయే కాలం దగ్గర కొచ్చింది.'

దీనమ్మ కడుపుమాడ లోకాన్నే అడుక్కుంట లోకాన్నే తిడుతదట సూడె' అని గొంతెమ్మని సూసిండు. గొంతెమ్మ మాట్లాడకుండ గుడ్లప్పగించి చూస్తూ గాలయ్య సేతిలో జామకాయ వెట్టింది. గాలయ్యసేతిలోని జామకాయ మీద ముసల్దాని దృష్టిపడేసరికి దాన్ని కూడా ముసల్దానికేఇచ్చిండు.

'బిడ్డా! నేను సత్తాననుకున్నప్పుడల్లా నీలాంటి కొడుకులచ్చి ఇట్లనే ఏదో ఓటి పెట్టి సావకుంట జేత్తంగ్రు. సావు బతుకుల మద్దె కొట్టుమిట్టాడుతున్న, ఏ కొడుకు జివిగంజి వోత్తడోఏమో? పెద్దోనికి సుఖాలేసుఖాలు నడిపోనికి కట్టసుఖాలు, సిన్నోనికి ఎప్పటికీ కట్టాలె. 'ఏం జెప్పాలె బిడ్డా! నాదో పెద్ద సెరిత్ర' అని నిట్టూర్చింది.

బస్సత్తందేమోనని చూస్తూ గాలయ్య 'ఎందుకూ? నీ కొడుకులు గట్లయింగ్రు, జమీను సరిగా పంచివ్వలేదా ఏంటి? ప్రశ్నించిండు.

పెద్దోడు పైస కోసం ఏదైనా సేత్తడు. ఆనికి పెద్ద పెద్ద సదువులున్నయి, కరుణ, దయ, జాలి,

ఏమీ ఉండవు, ఆనికిందోన్ని పైకి తెత్తానంటూనే దోసుకుంటడు. తల్లిని నన్ను కూడా లెక్కసేయకుండ సర్వం దోసుకొని తాకట్టు పెడతాంటే మీలాంటోల్లనడిగి, అప్పు తీర్సలేక ఇట్లా అయిపోయింది నా బతుకు' జీవితంలో అంతా పోగొట్టుకున్న దానిలా సెప్పింది.

'మరి నడిపోని సంగతేంది?' అడుగుతూ బస్సత్తందేమోనని మల్లా అటువైపు జూసిండు.

'ఆడు సిన్న ఉద్దోగి, పిల్లలెక్కువ, అద్దిల్లు, తెచ్చే జీతం సరిపోదు. ఒక్కడు సెత్తేనే కుటుంబమంత బతుకాలే. సేవింగని, అదనీ ఇదనీ మాగ సేత్తడు. కాని ఎప్పటి సిప్ప ఎనుగుల్లె. బోనసులు, అడ్వాన్సులుఅవీ, ఇవీ అచ్చినా, ఓటిలతో జీతమెక్కువచ్చినా పన్ను కట్టాల్సిందే! ఆ పన్నులు, ఈ పన్నులు, అన్ని పన్నులు కడుతూ కాలం ఎల్లబోసుకునేటోడు. ఇగ సిన్నోనికి మాత్రం గడియ రికాముండదు, గవ్వరాకడుండదు. అందరి సానుభూతి ఈనిమీదే. కాని ఎవ్వరు ఒక్కపైసా పెట్టరు. ఈనిపేరే సెప్పుకొని మిగతావాళ్లు ముడుపులతో కడుపులు నింపుకుంటరు. పెద్ద పెద్ద స్కాంలు గూడ జేత్తరు. వీడు కట్టపోతు. కడుపు మాడ్సుకోటమే తెల్సు. జీవితమంతా మడత కుడుములు తినటంతోనే సరిపోతది. ఆస్థికలే వాని ఆస్తి. ఇదీ బిడ్డా! నా కొడుకుల సంగతి. ఇట్లాంటోళ్లను కన్న. కాని ఎవర్ని సిన్నసూపు సూడలేను, సూడను కూడా! నాకు అందరూ సమానమే. ఎవరి బతుకు ఆళ్లు బతుకుతాంటె సూత్తున్నాను. నా రగతం అయిపోయే వరకు పీల్సుక తిన్నరు. తింటున్నారు. సచ్చేదాకా తింటూనే ఉంటారని, తెలిసి తెలిసి బిచ్చం అడుగుతున్న అని ముసల్దాని కతంత ఎల్లబోసింది.

గాలయ్య ముసల్దానికి పెద్ద సేరిత్రే ఉంది అని నవ్వుకున్నాడు. కొద్ది సేపటికి పక్కనే ఒకడు గిన్నెలో ఏసినట్టే ఏసి పైసలు తీసుకోటం చూసింది. వాన్ని తిట్టిన తిట్టు తిట్టకుండ బండ బూతులు తిట్టుకుంట పోయింది. మేదీపట్నం బస్టాపు అది. బస్సుకోసం చూసి, చూసీ భార్యా భర్తలిద్దరికి విసుగచ్చింది. ఎంత సేపటికి బస్సురాకపోయేసరికి నిల్సున్న దగ్గర్నించి కొంత ముందుకి జరిగింద్రు. ఇంతలో పోలీసు జీబచ్చి వాల్లముందు ఆగింది. గాలయ్యకు పానమంతా గాలిగాలయింది. జడుసుకున్నడు. కాని జీబుతోలె డ్రైవర్ 'నమస్తేబావ' అనుకుంట దిగిండు. జీబులో నున్న సి.ఐకి కోపమచ్చి 'గొల్లోనికి మల్లెపువ్విత్తె గోసిల బెట్టుకున్నట్టు నువ్వేందిరా! గీడ ఆపి మాట్లాడుతున్నవ్! తుపూ... నీయవ్వ, మాదిగబుద్ది పోనిచ్చుకోవైతివి గదరా! అని సిర్రుబుర్రులాడిండు. అక్కడ బస్సుల కోసం ఎదురుచూసే ప్రయాణీకులంతా గాలయ్య దిక్కే సూత్తండ్రు. వచ్చే బస్సులు వస్తూనే ఉన్నయ్, పోయే బస్సులు పోతూనే ఉన్నయి. పోలీసు జీబును సూసిన మక్కజొన్న కంకులు అమ్మేటోడు, పల్లికాయ కాల్సేటోడు, అరటి పండ్లమ్మేటోడు, పటాలమ్మేటోడు, కారబండోడు, అక్కన్నించి సూత్తామనేసరికి జారుకున్నరు. సర్రున గాలయ్య ముందరికి ఆటో తెచ్చినవాడు కూడా మెల్లగా జారుకున్నడు. ఆ సుట్టుపక్కల కేవలం ప్రయాణీకులే మిగిలింద్రు.

జీబుడ్రైవర్ గాలయ్య ద్వారా తన ఊరి క్షేమసమాచారాలు తెలుసుకొన్నడు. జేబులకెల్లి వంద రూపాయలు తీసిచ్చి 'అవ్వకియ్యిబావ, మంచిగానే ఉన్నానని సెప్పు' మని దబదబ జీబు

ఎక్కడానికెళ్లిండు. కొరకొర చూస్తున్న సి.ఐని పట్టించుకోకుండా, జెర రాస్‌గానే, 'నన్ను నిలబెట్టి రెండు గంటలు ఏసి హోటల్లో లావాదేవీలు చూసుకున్నపుడు లేని ఏ గిరం ఇపుడచ్చిందేంటి సార్!?' నవ్వుకుంట సురకంటించిండు.

పరేషాన్‌గా సూడటమే సి.ఐ. వంతైంది.

అదిగాదుసార్! మీకైతే బండ్లుంటయి, ఫోన్లుంటయి, దబ్బులుంటయి, మాకేముంటయి!? గిటవంటోళ్లు పోతె జెర మతులాపు పంపుతం. నిజంగా నువ్వు నమ్ము నమ్మకపో! సార్, ఉత్తరమేసినా మా ఇంటికిపోదు' అని జీబు కదిలించాడు డ్రైవర్. సి.ఐ తేలమొకం ఏయాల్సి వచ్చింది. జీబెల్లి పోంగనే నీయక్క సర్రున ఆటోవాడు గాలయ్యకు బెత్తడు దూరంలోనే పెట్టిండు ఆటోను. గాలయ్యకు ఎక్కడా లేని కోపమచ్చింది. కాని ఏంజెత్తడు, ఆటోవానికి సేచ్చ ఉందనుకున్నడు. పోయిన అమ్మకం దార్లంతా మల్లా వచ్చి చేరింద్రు. పల్లికాయ కాల్సి అమ్మేటోని బండిలోంచి పొగ విపరీతంగా గాలయ్య గొంతెమ్మల మీది గుమ్ముతంది. దాని తాకిడికి భరించలేక దగ్గుతూ జెర దూరంగా జరిగింద్రు.



వీణవంక బస్టాండ్‌లో దిగింద్రు. బస్టాండ్‌కు ఉత్తరంవైపు సానా పురాతనమైన పెద్ద మర్రిచెట్టు. దాని ఊడలు కొన్ని భూమికంటుకొని ఏలాడుతున్నాయి. సెట్టుకింద సెప్పులరత్తయ్య సెప్పులు జేత్తండు. ఆయన్ని గాలయ్య సిన్నప్పటినించి సూత్తండు, మరి గాయన ధనవంతుడయ్యే దెప్పుడో గాలయ్య కర్థం కాలే. ఆయనకు జెర ఏసుమతం మీద నమ్మకం గూడా ఉన్నది. అందుకే పేదోల్లకు పైసలు దీసుకోకుండానే పాతసెప్పులను కుడుతడు. ఆయన చెట్టుమొదట కూసాని, చెట్టుకు ఓ బోర్డును కూడా కట్టిండు. ఆ బోర్డుమీద 'ప్రయాసపడి భారం మోయుచున్న ప్రజలారా నాయొద్దకు రండి, నేను మీకు విశ్రాంతిని కలుగజేతు' నని రాసుంది. ఆ సెట్టుకు కొంచెం దూరంలో కోమటి రాజశేఖర్ ఇనుప సామన్ల దుకానం ఉన్నది. ఆ సెట్టుకింద సానామంది కూసుంటరు. కూసోటానికి అక్కడక్కడ కట్టుడు రాళ్లలాంటివి ఉన్నాయి. బామ్మర్ధి సెప్పిన మతలావు, పంపిన వందరూపాయలు, పంపియ్యాలెనని ఆ సెట్టుకింద ఎవరన్నా లస్మక్క పల్లోల్లు ఉంటారని గాలయ్య చెట్టు కిందికెల్లిండు. సుట్టు పదూళ్ళోల్లు కలిసే చోటు అది. ఇంతలో గాలయ్యను మేర రవీందర్ పిలిసిండు. పాపం ఎన్నాళ్ల నుండో పాతబట్టలే కుట్టుకుంట బతుకుతండు. అతను సంగం బొందయ్య, బట్టల దుకానం ముందర కుట్టుమిషను పెట్టుకున్నడు. ఆయనకు పోటీ అనేకం కుట్టుమిషన్లున్నయి. పదిహేనూళ్లను కలిపే పెద్ద దుకాణంగా బస్టాండ్‌లోనే ఉంది. దాదాపు ఏ ఊరోనికైనా ఆ దుకాన్లో ఖాతా ఉంటుంది. లస్మక్క పల్లోడు ఒకడు ఆ దుకాన్లకత్తె వానికి పైసలిచ్చి, మతలవు పంపించిండు.

ఇగ అక్కన్నించి గాలయ్య తానింటికి పోవాలంటే రెండు కిలోమీటర్లు నడవాలి. కోమటి, అవుసుల, బాపన, కాపు, కంచరి, గౌండ్ల, సాలె, కురుమ, కమ్మరి, వడ్ల, తెనుగు, గొల్ల, మేదరి,

మేర వాడలు దాటిన తర్వాత ఒక కిలోమీటరు దూరంలో మాలగుడెం, మాలగూడెందాడితేగాని మాదిగ గూడెం రాదు. పెద్ద బజార్‌గుండా పోతే ఎవరన్నా ఏమన్నా అనుకుంటారని, మాదిగోళ్లంతా తుర్క, కటిక వాడల మీదుగా, కోనేటి పంపులకెల్లి, వెంకటేశ్వరస్వామి గుడెనకనించి, ఒంటిస్తంభం పక్కగా, పోసాంపంపు, మాదిగిండ్ల పంపులోంచి పోయేవారు. సానా రాత్రి అయింది. ఇప్పుడు అడ్డదారి గుండా పోవడం భార్యాభర్తలకిద్దరికి క్షేమంగాదని నడి ఊళ్ళెనుంచే పోవాలని నిశ్చయించుకున్నాడు.

చీకట్ల నించి గాలయ్య రావడం కనిపెట్టిన మేర రాజయ్య పెండ్లం 'ఏంపోయే కాలమచ్చిందని ఎదురొత్తండని' పక్కనే ఉన్న సాలె ఇంట్ల జొచ్చింది. సిన్న పోరన్ని పట్టుకొని అందంలో గంధపు సెక్కలా వాళ్లు, ఆముదంలో మడ్డిలా వీళ్ళు పుట్టారో ఏమో తెలియదు. ముంతలో మీద మిటారి, లోన కొటారన్నట్లు, కోమటి కుంకుమయ్య బయటకచ్చి 'ఏడుంటున్నావురా?' అడిగిండు.

'భూమ్మీదనే' నని కరుకుసమాధానమిచ్చాడు గాలయ్య. కంగు తిన్న కుంకుమయ్య 'అబ్బో నీకందులుగాల గా సంగతి మాకు తెల్వదా ఏంది!' మెల్లగా ఇనీఇనపడనట్లు అన్నాడు.

ఆన్నించి గడిముందరకచ్చిండు. తన సిన్ననాడు తన తండ్రి దొరసాని దగ్గరకు పోయి, దొరసాని కాలుపట్టి, కొలత కొలిసి, సరిగ్గా కాలునిండా సెప్పులు కుట్టించేవాడు. ఆనాడు లేని, ముట్టుడు ఇగో ఇప్పుడున్నది. ఆనాటి రోజుల్లో ఈ గడిసుట్టూ కాపలా కాసింది మాదిగోల్లే. ఆనాటి నించే నేటికి మాదిగోనికి పడారి దాటే అవకాశమే లేదు. అట్ల గడిల జరిగిన పాత గుర్తు జేసుకుంటా సమిండ్ల రత్తయ్య సింతలకిందికచ్చిండు. ఆడికి రాంగానే ఏదో భయం ఆవరించినట్లయింది. ఎనిమిదే అయ్యింది. దిక్కులన్నీ సుక్కల ఎండ, కటికసీకటి గాలయ్యను గొంతెమ్మను గుప్పెట్లో పెట్టుకున్నది. గొంతెమ్మ భయంతోగాలయ్య చెయ్యిని పట్టుకున్నది. కనీసం ఇంకా పదినిమిషాలన్న నడువాలె. ఎడమ పక్క గుబురు గుబురు సింతలు, కుడిపక్కగెట్టు మాదిరిగా నున్న పట్నం తుమ్మచెట్లు, ఆ చెట్లమధ్య పెద్ద పెద్ద గుండ్లు, రాళ్లు ఆరాళ్లను మధ్యనేసుకొని కొమ్మల్లా పొడుసుకొచ్చిన పుట్టలు. ఆ కొమ్మలన్నీ ఆకుల్లేనివే! ఆ ఎండిన కొమ్మలకు అక్కడక్కడ మెరుస్తున్న పాముకుషాలు. ఎనకనించి గాని, ముందునించిగాని ఏమచ్చినా తెలియదు. బొందల్ల గడ్డనించి నక్కలు గూస్తే వాటిని ఖండిస్తూ ఇండ్లల్ల మాదిగ్గూడెపు కుక్కలరుస్తున్నాయి. ఆ అరుపులు వినుకుంటా సగం దూరం బెక్కుబెక్కుమని నడిసారు. రడగబ్బు వాసన వచ్చింది. బొక్కల వాసనది. పశువుల బొక్కలన్నీ ఏరి ఒక్కర దగ్గర వేసిన కుప్పనించి ఆ వాసన వస్తంది. భయం భయంగా, ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకొని ఇల్లు చేరినట్లు చివరికి ఇల్లు చేరింద్రు.

వానాకాలం అయినందున మేఘాల చాటుకెల్లి మందకోడిగా సూర్యుడు మెల్లమెల్లగా బయటపడుతున్నాడు. ఆకాశాన్ని పొడుస్తూ కిరణాలు తెల్లవారుతున్న తనాన్ని తెలియజేస్తున్నాయి. గొంతెమ్మ, గాలయ్యకు నిదురబట్టలె. తెల్లారెదాకా ముచ్చట్లే బెట్టుకున్నారు. మొకమన్నా కడుక్కుందామని

ధరంబాయి మీదికచ్చిండు గాలయ్య. ఆ బాయిమీద మాదాసి మొండయ్య నీళ్లు సేదుకుంటండు. గాలయ్య బాయిమీదికి రాంగనే పాముని చూసిజడుసుకున్నట్టు మొండయ్య దబాలునా బాయికిందికురికి '....., ఏవూరు గీ ఊర్ల తగులబడ్డవు, బాయిమీద నీళ్ళు సేదేని కనపడుతలేదుర' నీ అవ్వ...., మాదిగ..., సెప్పుతో కొట్టేను, దిగు ....., దిగు అని సెప్పుదీసి కొట్టకొట్టబోయిండు. గాలయ్య తెల్లమోహం ఏసిండు. నోరు దగ్గరబడ్డట్లయి, ఏమనాలో కూడా తెలియలె. మాదాసి మొండయ్య తిట్లకు దరిదాపుల నున్న మనుషులు ఇండ్లల్లకెళ్లి బయటకచ్చిం(డు. మొండయ్య తిడుతూనే ఉన్నడు. గాలయ్య ప్రతిమయి పోయిండు. ఓ పెద్ద మనిషచ్చి 'దిగుబిడ్డా, ఆళ్లు కులమెక్కువోళ్లు, మనం కులం దక్కువోళ్లం, ఆళ్లు సేదుకపోయినంక, మనం బాయిమీదికా రావాలె' నని ఆ వెనువెంటనే 'పోనీ మొండయ్య మావ, ఆనికి తెల్వదు, తెలిస్తే గిట్లెందుకు జేసు, తెల్వకనే జేసిండులే, పొద్దుగాల పొద్దుగాల, జౌడమెందుకులె' అని సముదాయించిండు.

గాలయ్య బుర్ర దిమ్మెదిరిగి పోయింది. వచ్చేపోయేటోళ్లంతా గాలయ్యను 'ఎప్పుడచ్చినవయ్యా'! అని అడుగుతూ వారి వారి పన్లు జేసుకోటానికెళ్లుతం(డు. మొండయ్య తిట్టుకుంటూనే నీళ్ల బిందెత్తుక పోయిండు పోతున్న మొండయ్య వైపే చూస్తూ ఉండిపోయిండు గాలయ్య. మొండయ్య పోయిన తర్వాత గాలయ్య బాయిమీదికెళ్లి నీళ్లు సేదుకొని మొకం కడుక్కొనే లోపల మాలగూడెమంతా చౌరస్తా దగ్గరికి రానేవచ్చింది. మాలగూడేన్ని చూసి మాదిగోళ్లంతా ఎటోళ్లటు తప్పించుకొని పోతం(డు. కొడుతారో, చంపుతారో ఎందుకచ్చిన గొడవని ఎటోడటు పోతాంటే, మిగిలింది ముగ్గురే పెద్దమనుషులు. వచ్చిన మాలగూడెమంతా తలోమాటంటు గాలయ్య చేత దండుగ బెట్టించారు. అది చాలదన్నట్టు మాదిగ గూడేన్ని హెచ్చరించుకుంట వారి వారి పనుల్లోకెళ్లిం(డు. గాలయ్య ఆలోచన్లో పడ్డడు. తన హైదరాబాద్ జీవితానికి, ఈ పల్లె జీవితానికి ఉన్న తేడాను ఆలోచిస్తూ ఉండిపోయాడు. గాలయ్యకు దండుగ బెట్టాననే బాధ అస్సల్లేదు. మాదిగోళ్లండ్ల ఉన్న అనైక్యత గురించి వాళ్ల జీవితంలోని రాజీతనాన్ని గురించి బాధపడుతున్నాడు. ఎందుకు వీళ్లు రాజీ పడుతున్నారు? వీరి రాజీ బతుకులకు విముక్తే లేదా? వీళ్లల్లో ఎంత చైతన్యాన్ని నింపితే పైకి వస్తారు? అని మదనపడుతూ దృష్టిని తన ఇంటి సూరుకిందికి మరల్చిండు. అక్కడ లేత వడ్ల గొలుసులు కొన్ని సూరుబొంగుకు కట్టి ఉన్నాయి. వాటిమీద పిట్టలచ్చి వాలి బుక్కుతున్నాయి. ఆ బొంగుసీ(ద్రంలో ఎలుక బయటకు మూతిపెట్టి సూత్తంది. ఆ ఎలుకను చూసి, పిట్టలప్పుడప్పుడు బెదిరిపోతున్నాయి. ఆ దృశ్యాన్ని చూస్తూ ఇంటి దగ్గరికచ్చిండు.



పులి దుర్గడు దగ్గుకుంట బయటికచ్చిండు. చెవులను కప్పుతూ తువ్వాలను నెత్తికిసుట్టి మూలసుక్కను చూసిండు. తెల్లవారుతున్నట్టు తెలియజేస్తూ ఆసుక్క చెమక్, చెమక్ మని తళ తళ మెరుస్తంది. మూలకున్న పారకట్టెవట్టి ధరంబాయి దగ్గరికచ్చి గొద్దుపొత్తుళ ఉన్నోళ్లందరిని పిలిసిండు.

పొద్దెక్కుతదని అందరిని తొందరపెట్టిండు. లోటుపోసిగాడు బిలాయ్‌పోసిగాడు, ముత్తెనెల్లడు అందరూ జమైంద్రు. నాలుగు పగ్గాల దూరంలోనున్న వేపసెట్టుకు కట్టేసుంది ఆవు. అందరూ దానివైపు చూశారు. దానిమీద రొమ్ము ఏమి లేదు. నడుము కూడా ఇరిగేటట్టుంది. గంగడోలు కూడా గోమార్లు పట్టి ఉంది. చర్మంమీద గండుదోమలు వాలి ఉన్నాయి. ఆ దోమలను పోగొట్టుకోవడానికి అది తోకాడిస్తంది. బక్కగా జవసత్వాలు లేకుండా ఉంది. మొత్తం పదిమంది పొత్తుల. గాలయ్య కూడా పది రూపాలిచ్చిండు. అతని ముందరే దాన్ని పడేసింద్రు. పక్కీరొడొచ్చి ఏదో మంత్రం సదివి ఆ ఆవును కోసిండు. తెల్లారేసరికి పోగులు పడనే పడ్డయి. పది పోగులేసుకున్నరు. సుంకరి ఈరమల్లడచ్చి, పులి దుర్గని ఎకనాల కూసున్నడు. వాళ్లు సీకట్లోనే పనంతా సేయడం సూసిన ఈరమల్లడు, నిర్ఘాంతపోయిండు. వచ్చిన ఈరమల్లన్ని ఇక్కడెందుకుంచడమని అదింత ఇదింత కోసి ఎడమచేత్తో కొంత మాంసం పెట్టిండు దుర్గడు. దాన్ని ఈరమల్లడు దోసిలినిండా పట్టుకొని బాగా చూసాడు. అందులో ఇచ్చుర్లు, పేగులు, పొట్టపర్ర,....., గొంతుక, బొంత, ఇంత మాంసం కనపడ్డదతనికి, కోపంగా 'నీయవ్వ పోయిన దసరకు గిటువంటి కూరే బెట్టింద్రా? పూర్తిగా అన్నాలం జేత్తంద్రు.' అన్నడు. అది విన్న దుర్గడు 'దంచినమ్మకు దక్కిందే బోనమని, పూట గడుపుకోవాలేగాని, మంచికూర పెడితే ఎవడూకుంటడు' నవ్వుతూ అన్నాడు. ఆ మాటిని ఈరమల్లడు కోపంతో చిరచిరలాడుతూ దోసిల్లకూర వాళ్ల నడుమ పారేసి, తువ్వాలను విదిలించి భుజానేసుకొని, నీ యవ్వ మీ మాదిగోళ్లకు పొగరత్తంది, మేమేమన్నా కనపడుతన్నమా? బొత్తిగా మా కులమంటేనే, సిన్నసూపు సూత్తంద్రు, మీ సంగతి జూత్త.' నని పెద్ద పెద్ద జంగలేసుకుంట తొవ్వెక్కిండు. ఇదంతా గమనిస్తున్న గాలయ్య 'పోనీ పోనీ' ఏంజేత్తడో సూత్తాం' అన్నాడు.

'అరె గాలి నీకు దెల్వది నువ్వూరుకోరా! గీ మాలోల్లతో పెట్టుకొనేదాని కన్నా! బండకట్టుకొని బాయిలపడి సచ్చింది మేలు' అని దుర్గడు పోతున్న ఈరమల్లన్ని పిలిసి అదిగాదు ఈరమల్లు మావ, నీ కేమి! తోటుంది, దొడ్డుంది, ఎడ్లు, రెండెకరాల పొలం, బాయి, ఏం తక్కువ నీకు, గీ మాదిగోళ్ల సొమ్ముకాసపడితే, ఏం పెద్దోడవయితావే! ఏదో! రాని కాడికా రాయే నమనిపోవాలెగాని' అని మల్లా సురకంటించిండు.

ఈరమల్లనికి పొయ్యిల ఉప్పేసినట్లయింది. మాడిన బొగ్గోలే మొకం బెట్టిండు. సురసుర గాలిందేమో ఏమో! మాట్లాడుతూనే నా రీతి రివాజేంచుతాంరా...! మాదిగ ..... అని కింద పారకట్టె తీసి దుర్గని నెత్తిమీద ఎయ్యనే ఏసిండు. దుర్గని తల పగిలింది. ఆవు రక్తంలో దుర్గని రక్తం కలిసింది. దెబ్బేసిన ఈరమల్లడు కంటికి కనపడకుండా పారిపోయిండు.

భగ భగ మండుతూ ప్రపంచాన్ని కాల్చి పారేస్తానన్నట్టు సూర్యుడు కోపంతో కొండెక్కుతున్నాడు. ధరంబాయి దగ్గర ఒక్కనెనుక ఒక్కడు మాదిగ గూడెమంతా ఏకమైంద్రు, పండుగ్గోలె, నోట్లె మన్ను గొట్టిండని, గొడ్డు పొత్తులనున్న పదిమంది ఉడుకుతున్నారు. ఒక్కొక్కడు ఒక్కొక్క గుదుప పట్టుకొని,

దసరా పండుగ రక్తంతోటే తడువాలె. ఈ ఊరు ఓ రణ క్షేత్రం గావాలెనని అరుస్తున్నారు. దానికి తోడు గాలయ్య వాళ్లందరికి హితబోధ చేస్తూ 'నిన్ను నేను, ఇయ్యాల దుర్గడు, రేపు మీరు, ఇట్లాంటి అన్యాయం ఇక జరుగకుండా ఉండాలంటే, ఛలో మనం తిరగబడాల్సిందే! మనకు జరిగిన ఈ అన్యాయాన్ని ముందు, ఈ ఊరు పెద్దకు జెప్పాలె. ఛలో నడువుండ్రి, అని గడీలవైపు తొవ్వదీసిండు, గూడెమంతా, ఆడ మగా, పిల్లా జెల్లా, ముసలి ముతకతో సహా గడీలకు లైనుపడింది. పెద్ద సైన్యం అయింది. చూసేవాళ్లకు భయం జొచ్చింది. ఈ ఊరు ఇగ బతుకదనుకుంటున్నారు. మాదిగ గూడెమంతా ఊళ్లె సొర్లంగనే, అగ్రవర్ణపోర్లంతా తలపులేసుకుంటండ్రు. ఎనుక దుమ్మురేగి మనిషి మనిషి కనపడకుండా పోతంది. ఓ అంటే ఓఅంటూ గడి గేటు ముందటి కచ్చిండ్రు.

గడి చుట్టూ మాదిగోళ్లు కావలి గాత్తండ్రు గాని, గేటు దగ్గర మాత్రం మాల జంగడున్నడు. ఇసుమంత గూడ భయపడకుండ మాదిగ గూడేన్ని గేటు దగ్గర ఆపిండు. గాలయ్యకు విచిత్రమైంది. ఇంతమంది ఒక్క మాలోన్ని చూసి ఎందుకు ఆగిపోయిండ్రని. గాలయ్య ముందుకొచ్చి 'దొర దగ్గరికెల్లి మాట్లాడాలె, బోనియ్యి' మన్నాడు.

గాలిగాన్ని చూడంగానే జంగనికి కోపమచ్చి 'నీయవ్వ మాదిగ...., యాడబుట్టచ్చినవురా? నేను మొగోన్నేనని ముందటి కత్తన్నవా' అని ఎగతాలి జేసిండు.

'మంచిగ రానియ్యి మాటలు' హెచ్చరించిండు.

'ఏందిరా! మాటలు మంచిగచ్చేది, మీ మాదిగోళ్లకు దొర గడీల అడుగుబెట్టే అధికారం ఎవడిచ్చిండురా! ఎన్ని గుండెల్రా మీకు' అని బొచ్చలచెయ్యేసి సూకి అటకాయించిండు.

వెనక్కి తూలిన గాలయ్య నిలదొక్కుకొని 'నువ్వు పోనిత్తవా? పోనియ్యవా? గాలయ్య మర్యాదగా అడిగిండు.

'ఒక్క అడుగే ముందుకేస్తే పుచ్చులు, పుచ్చుల్లేవాలె' నని బరిసెలేపి భుజానేసుకున్నడు.

గాలయ్య ఒక్క క్షణం లేటు జెయ్యకుండా తన దగ్గరున్న గుదుపతో జంగని పుర్రెమీద బాదిండు. జంగడు కుప్పకూలిండు.

'నీకు లేని ముట్టుడు, నాకు ఎక్కన్నించి వచ్చింది..... ' కంటూ గాలయ్య జంగన్ని తొక్కుతూ గడీల జొచ్చిండు గాలయ్య వెనుక మాదిగ గూడెం జొచ్చింది.



తూర్పుదిక్కు మెల్లమెల్లగా ఎరుపవుతుంది. ఇంటి ముంగట గద్దెమీద కూసుండి సూత్తె, కొండల అంచులు తేటగా కనపడుతున్నయ్. కిరణాలు సెట్ల కొమ్మల మధ్యనించి గాలయ్య మీద పడుతున్నాయి. అవతలివైపు గద్దెమీద దుర్గడు కూసుండి సుట్టు తాగుతండు. గాలిగాడు నిన్న జరిగిన విషయాన్ని చెపుతూ వేప చెట్టుమీదికి చూసిండు. ఆడ తేనెటీగలు కలిసికట్టుగ నుండటాన్ని ఆలోచిస్తుండగా

మాదిగోల్లు ఒర్రుకుంట ఉరుకుతున్నట్టు గమనించిన గాలిగాడు 'దుర్గన్న నువ్వు ఈన్నె ఉండు. నేను బోయిసూసత్తా!" నని ధరంబాయి దిక్కు పరుగు దీసిండు. మాదిగోళ్లంతా నోరెల్లబెట్టి సూత్తంద్రు. అవతలివైపేమో మాలోల్లంతా. కట్టెసాము జేసుకుంట మాదిగ గూడెం మీద కత్తంద్రు. ఇగ మాదిగోళ్లు నాశనమైపోటం ఖాయమనిపించింది. మాదిగోళ్లు, మాలోల్ల కంటె బలవంతులే, ధృఢకాయులే. అయినా మాలోల్లంటె ఉచ్చ బోసుకుంటరు. మాదిగోళ్లు ఒక్కొక్కడు బక్కగున్నా నలుగురు మాలోల్లను తన్నగలడు. కాని వాళ్ల ఆత్మ న్యూనతా భావం వాళ్లను రాజీ పడేటట్టు జేస్తున్నదని గాలయ్య అనుకున్నడుమే. ఏమన్నా గొడవ జరిగిందంటే చాలు మాలోల్లు కట్టెసాము జేసుకుంట మాదిగోళ్లను అలల్లాడిస్తరు. ఆ కట్టెసామును జూసి మాదిగోళ్లంతా ఎవరింట్ల వాల్లు దాక్కుంటరు. ఇపుడు కూడా ఇంట్ల దాగున్నా మాదిగోళ్లను గుంజి కొడుతంద్రు. మాదిగోళ్ల పుర్రెలు పగులుతున్నయి. ఆడోళ్లను కూడా బట్టలిడిసి కొడుతంద్రు. మరి ఇంతదారుణం ఇక ఆగెటట్లు లేదు ఎట్లా! అని గాలయ్య ఆలోచిస్తున్నాడు. జంగన్ని కొట్టినప్పటినించి మాలోల్లకు మనసున బట్టలేదు, రాత్రంతా నిద్రపట్టలేదు. రాత్రికి రాత్రి గూడుపుఠాని జరిగింది. మాలోల్లు ఏకమైంద్రు. మాదిగోల్ల తాట ఒలుస్తున్నారు. మాదిగోళ్ల మీద దయతలిచేవాడే లేడు. గాలయ్య బాయిమీద నిలుసుండి సూడటం తప్ప ఏం చేయడం లేదు. ఏం చేయాలో తోచటం లేదు కూడా! దరంబాయి మీదున్న గాలయ్య మీదికి 'గీడెరా గీడు, లొల్లికి కారణం, గీ .... ను ఉతుకుంద్రి' అని ఈరమల్లడు గుదుప మర్రేసి పైకి అత్తాంటే గాలయ్య పరుగువెట్టిండు. గాలయ్యెంట పదిమంది మాలోల్లు పడ్డరు. ఇగ గాలిగాడి సెరిత్ర అయిపోయిందనుకొంటునరు. చూసేవాళ్లు అటురికి ఇటురికి తప్పించుకుంట ఒక రాల్లకుప్ప దగ్గరికచ్చిండు గాలయ్య. 'ఇగ రాంద్రి నీ ...' అని రాళ్లు పట్టి వచ్చేవాళ్లమీద ఇసిరిండు. వచ్చిన పదిమంది మీద రాళ్లవర్షం కురిపించిండు. అందరూ చేతులున్న గుదుపలు పడేసి, వెనక్కి తిరిగి పరుగో పరుగని, ఉరికింద్రు. గాలయ్యను చూసి మిగతా మాదిగోళ్లంతా రాళ్ల కుప్పలను జూసుకొని కుప్పమీద కూసున్నరు. 'ఇగ రాంద్రి, నీ ..., ఎవడత్తడో రాంద్రి. మీ అంతు జేసే దాకా వదలం."

  

మహావీరులు

- జి.కే

మాష్టి కిట్టయ్య మహీజోరుగా ఎగురుతూ కత జెప్పుతండు. తనతో పాటు తన కొడుకు శంకర్ సుతి పాడుతండు. చాపలో నలుగురు కూసుండి తబలాతాళం,హార్మోన్యం వాయిసున్నారు. వాటికనుకూలంగా లయబద్ధంగా నాట్యంచేస్తూ ప్రేక్షకలోకాన్ని ఉద్రుతలూగిస్తున్నాడు.

రామరామయ్య హిందుదెవో...

నా తనయులారా మీరు దేవో......

పనుమటి బాజు దప్ప దేవో.....

అన్ని దిక్కుల పోవచ్చు దేవో

“అమ్మా కుంతీమాత అన్ని దిక్కుల పొమ్మంటు పనమటి కద్దంటున్నవ్ ఎందుకమ్మ ” అని పక్కన కొడుకు శంకర్ అడుగుతే దానికి కథకుడు కిట్టయ్య....

బిడ్డలారా... అటువైపు హిండబాశూరడనే... దేవో

రామరామయ్య హిందుదేవో...

రాక్షసుడు ఉన్నాడు... దేవో

వాడు ముల్లోకాలకు భయపడడయ్య !దేవో...

వాడు బలవంతులకు బలవంతుడయ్యో దేవో...

వాని చేతిలో గనుక చిక్కితే దేవో...

అని సుదీర్గ రాగాలతో మాదిగ లోకాన్ని మైమరిపింప జేస్తున్నాడు. మాష్టికిట్టయ్య అంటే పది జిల్లాలకు మాదిగలకు తెలిసినోడు. ఐదు సంవత్సరాలకోసారి వచ్చి, త్యాగం అడుక్కుంటాడు. పనిలేని వేళల్లో మాదిగోళ్లు కాలక్షేపం కోసం ఎంతో త్యాగం జప్పి ఐదుకతలుజెప్పించుకుంటారు.

అందరూ మనసుబెట్టి కత ఇంటున్నారు. కిట్టయ్యకి ఎగిరినపుడల్లా చెమట వస్తే తలపాగాకున్న జుట్టు తీసి తుడుచు కుంటున్నాడు. నడి నెత్తి మీద ఎండ కొడుతంది. వేడి, వేడి వడలు అన్ని వైపుల నించి వస్తూ అక్కడున్న వాళ్లను మాడ్చుతంది. చాలామంది తలలకు గుడ్డలు కట్టి ఉన్నాయి. అందులో మొగోళ్ళు, కొంత వయసుమీద పడినోళ్ళు పంచెలు కట్టుకొని పెయిమీద ఏమి లేకుండానే ఉన్నారు. వారిదగ్గరున్న చిన్నచిన్న పంచెలతో గాలికోసం అటుఇటు ఊపుకుంటున్నారు. అందరి దృష్టి కత మీదే ఉంది. ఎంత ఎండగా ఉన్న కిట్టయ్య మాత్రం లయబద్ధంగానే రొప్పుతున్నాడు. అంతలో మేర రవీందర్ ఉరికచ్చి మందిలో దాక్కోటానికి ప్రయత్నం చేసిండు. అతన్ని తరుముకుంట ఓ పది మంది గౌండ్లోల్లు వచ్చింద్రు. కత వినే వాళ్లంతా భిత్తరపోయి వాళ్లవైపు జూస్తున్నారు. మాష్టి కిట్టయ్య కతనాపిండు. మేర రవీందర్ గసుపోత్తండు. వానికి నిండా చెమటలు పట్టినయి. గౌండ్లోల్లు మందిని తోసుకుంట పోయి రవీందర్ను పట్టి రెండుమూడు అందుకోనే అందికున్నారు. మాదిగోళ్లు అడ్డమచ్చింద్రు.

ప్రేక్షకులేమో ఒక్కొక్కరే లేచి రవీందరు దిక్కే చూస్తున్నారు. విషయానికత్తె, మేర రవీందరు తను కుట్టిన లంగాలు, గౌనులు తీసుకుని బజారు వెంట అమ్మటానికి కెళ్లాడు. "గౌండ్లు లంగలు, లంగలుగౌండ్లు చీఫ్‌గా గౌండ్లు... లంగాలు వో.."అంటూ గౌండ్లోల్ల వాడకెల్లిండు. ఆ వాడ గౌండ్లోల్లు మమ్మలను హేళన చేస్తున్నాడని లంగలకింద లెక్కేత్తున్నాడని ఎంబటివడ్డరు. ఆ లంగాలను, గౌనులను పడేసి, తోకనాం, పీకోనాం అని పరాగెత్తుకుంట ఈ మందిల జూచ్చిండు. విషయం తెలుసుకున్న మాదిగ గూడెం లోలోన నవ్వుకొని గౌండ్లోల్లను సముదాయించిండ్రు.

మాష్టికిట్టయ్య తన దగ్గరున్న పెద్ద చుట్టను అంటుపెట్టి జనుమంతా సద్దుమనిగె దాకా తాగిండు అర్దగంట తరువాత మల్లాకత మొదలుపెట్టిండు. "ఆగాగు" ఆల్లంత దూరాన్నించి రాసపెల్లి కనకయ్య కేకేసిండు. మాష్టికిట్టయ్య కండ్లు చిట్లుంచుకొని చూసిండు, మల్లేమైందిని.

కత మొదలు పెట్టే ముందు ఈ మాట జెప్పు. రేపు నా ఇంట్ల ఎల్లమ్మ కత ఉంది. కాబట్టి "రేపు నీవు కత జెప్పద్దు. ఎల్లుండి నా కొడుకు పెండ్లి, ఎల్లుండి కూడా నీవు కత సెప్పద్దు ఈ విషయం అందరికి ఇనబడెటట్టు చెప్పు" మన్నడు. రాసపల్లి కనకయ్య జెప్పున్నట్లే ప్రేక్షకులకు వినపడేటట్లు గట్టిగా ప్రకటించి, తన కతన మల్లా మొదలుపెట్టిండు.

॥ముడు చుక్కలుపెట్టలి॥

క్రమక్రమంగా పొద్దెక్కింది. రాసపెల్లి కనకయ్య ఇంటిముందు, బొత్తకమ్మలతో పందిరి దానికింద తోరణాలు కట్టి ఉన్నాయి. అలుకులు, ముగ్గులు, పచ్చగా కలకలలాడుతంది. ఇల్లు చిన్న పిల్లలు కొత్త బట్టలేసుకునొ కేరింతలు గొట్టుకుంట అటు ఇటు ఉరుకుతుండ్రు. పెద్దవాళ్ళు కూడా కొత్త బట్టలేసుకొన్నారు. ఒక్కొక్కరికి నెత్తినిండా కారేటట్లు నూనె, నొసలు నిండానబొట్టు. ఆడోళ్లు ఎంటికలిరబోసుకొని చెంపలకు గందము పెట్టుకొని ఉన్నారు. కాళ్లకు పసుపు కూడా రాసుకొని ఉన్నారు. రాసపెల్లి కనకయ్య ఇంటిముందు ఎల్లమ్మగుడి ఉంది. ఆ గుడి ముందు అటొకలిటొకలు వంతకులు, నడుమ కథకుడు సంకన జంబుట్కం బెట్టుకొని వాయిస్తూ కత జెప్పుతున్నాడు. కాలికి గజ్జెలున్నాయి. ఒక్కసారిగా గంతులు వేస్తూ, గొంతు పెంచి ప్రేక్షకులకు భయభ్రాంతులు కలుగజేస్తిన్నాడు. రాసెపల్లికనకయ్య భార్య బిడ్డకు పాలిచ్చుకుంటనే, ఎల్లిపాయాలు ఒలుత్తంది. ఆమె ఎర్రమన్నుతో అలికి ముగ్గుపెట్టిన గద్దెమీద కూసున్నది. పక్కన ఒక ముసలిదానితో ముచ్చట పెట్టుకుంటనే ఒలుత్తంది. మాహాజోరుగా కత కొనసాగుతంది. పంబాలనర్సయ్య ఎగిరే ఎగురుడుకు అతని తలకున్న తెల్లని తలపాగ ఒక్కోసారి ఊడిపోతాంటే మళ్లీ చుట్టుకొని కత చెపుతున్నాడు. వాడ వాడకు ఎల్లమ్మకత ఎన్నోసార్లు ఇన్నాగాని, మళ్లీకొత్తగా ఇన్నాట్లే అనిపిత్తంది అక్కడివాళ్లకు. ఇంటి ముందటి నించి పందిరికింద నిండిపోయి, రోడ్డుదాకా కూసున్నరు జనం. పంబాల నర్సయ్య తాప తాపకు తన చేతికున్న దండ కడియాన్ని పైకి జరుపుకొంటున్నాడు. కత సంగంలోకి రాంగనే ఆపేసి, గొర్రెపోతును బలిచ్చిండు. గొర్రెపోతు గుండె, నాణెం, కార్జం,ఉలవలు,తీసి,వండి బోనం తయారు చెయ్యమన్నాడు.

గొర్రెపోతును తీసుకొని ఓ ముగ్గురు పెద్దమనుషులు అవతలివైపు ఎల్లింద్రు. మళ్ల కత ప్రారంభమైంది. కత అయిపోయే సరికి బోనం గావలెనని దబా దబా తోళ్లమైసయ్య గొర్రెపోతును కోయనారంభించినాడు. సాయంత్రం కావటంవల్ల ఎండ చురచుర అంటుకుంటంది. పందిరి మీదున్న బొత్తకమ్మల సందుల్లోంచి కూసున్న జనంమీద ఎండపడుతంది. గాలి మెల్లమెల్లగా ఉరుకులాడుతంది. ఆ గాలి తాకిడికి తోరణాలు మెల్లగా ఊగుతున్నాయి. అప్పుడప్పుడు చిన్నచిన్న నుడుగాలుల వల్ల అలుకుదుమ్ము లేసి కూసున్న జనం మీద మెల్లగా వాలుతంది.

కత ముగాసింది. వీరుని బోనం తయారై ఎల్లమ్మ ముందరేసి ఉన్న పట్నాల మీద కచ్చింది. బోనం సరిగా నిలుసోకపోతే దానికింద మూడు పిడుకలు దెచ్చి పెట్టింద్రు. పంబాల నర్సయ్య పొద్దంతా ఎగురుతూ కత చెప్పటం వల్ల అలసిపోయాడు. నీరసంగా అక్కనించి తప్పుకున్నాడు.

చిన్న కొంరని ఇంటి దగ్గర్నుంచి దప్పుల చప్పుళ్లతో బైండ్లోడు రావాల్సి ఉంది. దప్పుల చప్పుల్ల మద్య ఆయన వేషదారణ ఇంట్లో చేసుకుంటున్నాడు. ఇంటి ముందర దప్పులతో కుర్రాళ్లంతా విన్యాసం చేస్తుండగా బైండ్లోడు మంత్రాలు చదువుతూ బయటికచ్చిండు అప్పటిదాకా మాములుగా ఉన్న జనం బైండ్లోని రాకనుచూసి, చప్పట్లతో హర్షధ్వానాలు చేసారు. అతడు పెద్దపెద్ద గజ్జెలున్నలాగు తొడుకున్నాడు. శరీరమంతా రకరకాల బొట్లు పెట్టుకున్నాడు. చేతిలో బాణం, భుజాన విల్లు, నడుముకు కత్తి గట్టుకొని, ఎంటికలీరబోసుకొని ఉన్నాడు. రేపు జరగబోయే రాసపెల్లి కనకయ్య కొడుకు పెండ్లి తనే చెయ్యాలి. అతను తన తండ్రి అయిన నర్సయ్య కంటె రెండింతలెక్కువనే నేర్సిండు.

మాదిగల పెండ్లిలు, బైండ్లోడు చెయ్యటం ఆ ఊళ్లో ఆనవాయితి. సగం మాదిగ గూడెం అతనెంట ఉన్నారు. వారి మధ్యలోంచి బైండ్లోడు నానా హంగమా చేస్తూ రాసపెల్లి కనకయ్య ఇంటికి వచ్చిండు. ఎల్లమ్మ ముందరేసున్న పట్నం తొక్కుతూ కాసేపు జోగినిలా దేవున్ని సెప్పిండు. రెండు నిమ్మకాయలు తీసి తన నడుముకున్న కత్తితో కోసి అటుఇటు పిండుతూ నాలుగు వక్కలేసిండు. గడగడమని మంత్రాలు చదివాతూ పెండ్లి పిల్లగాని దగ్గరకెల్లి పెండ్లి పిల్లగాన్ని నిలబెట్టి అగ్గితో జిష్టితీసి ఏవో కిన్ని మంత్రాలు చదివాడు. ఆగకుండా మంత్రాలు చదివుతుంటే బయట కొంత మంది సంతోషంగా ఈలలు కొడుతంద్రు. తను ఆటుఇటు పెద్దపెద్ద జంగలు వేస్తుంటే గజ్జెలలాగు మోత, దప్పులమోత, ఆక్కడి జనాన్ని ఉత్సహవంతుల్ని జేస్తంది. బైండ్లోడు మంత్రాలు చదువుతాంటే, ఒక పెద్ద మనిషి బోనాన్ని ఎత్తుకున్నాడు. ఆ బోనం ఇంకా వేడిగా ఉన్నట్లుంది. పెద్దమనిషి నెత్తినిండా సుట్టవట్ట పెట్టుకొని బోనాన్ని కొసవేళ్లతో పట్టుకున్నాడు. ఎల్లమ్మగుడి దగ్గరనించి దప్పులమోత, చప్పట్లు, ఈలలమద్య, పరుగులెడుతున్న జనాల మద్యనించి మహాజోరుగా, ఆహాకారాలు జేస్తూ బోనం బయలుదేరింది. ఊళ్లెకెల్లి ఆ బోనం దేవతల బాయి దగ్గరకు బోవాలె. దేవతల బాయిలో రెండు రోజుల ముందే విగ్రహప్రతిష్ట చేసి వచ్చారు. ఆ బాయి మాన్యంభూముల్లో ఊరవతల పడమట ఉంది. దప్పులు వాయించుకుంట నాట్యంచేస్తూ ముందుకు వెళ్లుతున్నారు. వారి తరువాత బైండ్లోడు ఏక ధాటిగా మంత్రాలు చదువుతూ, అప్పుడప్పుడు కండ్లు పెద్దవి చేస్తూ, ముందుకు తోసుకుపోతున్నాడు. ఆ

వెనువెంటనే వెనక్కి వచ్చి, బోనం చుట్టు తిరుగుతూ పిల్లగాని చేతిలో చేయి వేసి, మళ్లి ముందుకు పోతున్నాడు. అతని వెనుక బోనం, బోనం వెనుక పెండ్లికొడుకు, ఆ తరువాత గూడెం ఊళ్లెకు నవసాగింది. బైండ్లోడు బోనానికి ఏ శక్తులు అడ్డంరాకుండా మంత్రాలు చదువుతూనే బాణాన్ని మాటిమాటికి ఎక్కుపెడుతున్నాడు. బాణం ఎక్కుపెట్టినప్పుడల్లా గూడెం ఆశ్చర్యంలో మునుగుతూ భయపడుతంది.

ఊళ్లె సొచ్చేసరికి మిదిగోళ్లకు లేని ధైర్యం వచ్చింది. మేము వీరులం, మహా వీరులం అన్నట్లు దాదాపు అందరూ తమతమ బొచ్చెలను ఉబ్బిచ్చి నడుస్తున్నారు. ఒక నెక్కరు మాత్రమే వేసుకొని వున్న ఓ పోరడు ఊరేగింపుకు అడ్డమచ్చాడు. వాని లాగు పిర్రల దగ్గర చినిగి పోస్టాఫీసులా తెరిచి ఉంది. వాని నోట్లోనించి సొల్లు గానుగనుండి నూనె గారినట్టు విపరీతంగా కారుతంది. గుంపులో ఒక పెద్ద మనిషి జూసి “నీ యవ్వ సొల్లు నా...., జరుగు జరుగహా” అని చెయ్యెత్తి కొట్టబోతే పోరడు అక్కనించి జారుకున్నాడు. డప్పుల చప్పుళ్ల మద్య చిన్నా పెద్దా, పిల్లా జెల్లా అందరూ ఎగురుతున్నారు.నడిఊళ్లకు పోయినంక ఉన్నట్టుండి బోనం ముందుకు పోలేకపోయింది. బైండ్లోడు, ఏ శక్తులు అడ్డరాకుండా జూసినా బోనాన్ని ఆడున్న సమ్మక్కసారక్క దేవతలు ఆపినై. వాటి దగ్గర రెండు కొబ్బరికాయలు కొట్టి మంత్రాలు చదివిండు బైండ్లోడు.అయినా బోనం కదల్లేదు. బైండ్లోని మంత్రాలు పారకపోయేసరికి కండ్లప్పగించి చూసి ఇంకా గట్టిగా మంత్రాలు చదువుతూ కప్పిగంతులేస్తున్నాడు.సమ్మక్కసారక్కలకు రగతం చూయించంది ఇక్కనించి పోనియ్యదని తెలుసుకున్న కనకయ్య కర్రె కోడిపుంజును బైండ్లోనికందించాడు. కండ్లెర్రజేసిన బైండ్లోడు ఎడమ చేతిలో కోన్ని పట్టుకొని కుడిచేత్తో కోడిని అదిమిండు అంతే! కోడి కిందపడి విలవిల గొట్టుకున్నది. బోనం ఎత్తుకున్న మనిషి కాలు అప్పుడు కదిలింది. “సీకటి పడకముందు ఇంటికి రావాలె పెండ్లిపిల్లకు, పెండ్లిపిలగానికి బోనం తినిపించాలె, పొద్దుటినించి వాళ్లకు ఏం తిండి పెట్టలే. జల్ది జల్ది నడువుండ్రి” అని ఒక పెద్దమనిషి ఏగిర పెట్టిండు. పెండ్లికి ముందు ఆ బోనాన్ని తింటే దంపతులకు మంచి వీరత్వం వస్తుందని జీవితాంతం ఏ శక్తి వాళ్లమీదకి రాదని మాదిగోళ్ల నమ్మకం.‘మాదిగోళ్లు వీరులనిపించుకోవటానికి ఇంత తతంగం నడిపించుకోవాలె ఎట్ల మరి’ అని రాసపెల్లికనకయ్య తనలో తానే అనుకొంటున్నాడు.

దేవతల బాయి ఇంకా పగ్గాం పెట్టు దూరంలో ఉండగా, అంతవరకు ఉరుకు పరుగులతో వచ్చిన మాదిగగూడెం నిశ్చేష్టులైపోయారు. ఎదురుగా దేవతలబాయి గట్టుమీద అగ్రజాతోళ్ళు కట్టెలు పట్టుకొని మాదిగోళ్ళ రాకకై ఎదురుచూస్తున్నారు. “దేవతలబాయి ఊరంతటికి చెందినటువంటిది. గాని తరతరాల నుండి ఆ బాయి దరిదాపులకు మాదిగోళ్ళు పోలె. అయితే గత ఐదేండ్ల నించి ఆ బాయిని ఎవరు వాడటం లేదు. అందుకని మాదిగ కనకయ్య సాహసించి అందులో విగ్రహాన్ని పెట్టించాడు. ఆ బాయిని ఎవరు వాడుకోక పోయినా, మీరు మాత్రం వాడుకోవద్దని ఊరోళ్లంతా

ఏకమై రాసపెల్లి కనకయ్య సంగతేందో జూద్దమని వచ్చారు.

కనకయ్య గొంతు తెగ్గోసినట్టయింది. అప్పటిదాకా ఎగిరినోళ్లు చెమటలు తుడుచుకోవటం తప్ప ఎవరూ మాట్లడటం లేదు. ఆగిపోయిన మాదిగ్గూడేన్ని చూసిన అవతలి గుంపులోని ఒక వ్యక్తి “ఏరా ఆగిపోయింద్రు రాంబ్రి, పుచ్చలేగిరిపోవాలె రాంబ్రి,..... ల్లారా ఎవడిచ్చిండురా మీకీ ఆదీకారం, రాంబ్రి నీ ...... ”అరిచాడు ఉక్రోషంగా. వాని పెదవులు కందిరీగలు కుట్టినట్టు ఉబ్బిఉన్నాయి. వాడుమాట్లడితే రెండు గజాలదూరంలో తుప్పిళ్లు పడుతున్నాయి. వానికండ్లు గుడ్లగూబకంటే రెట్టింపున్నాయి. వాని పండ్లు కుక్కకోరల్లా కనిపిస్తున్నాయి. అతని ఒక్కోమాటకు ఒక్కొక్క అడుగు వెనక్కేయాల్సిందే.

జరుగుతున్న విషయాన్ని ఏమి పట్టించుకోకుండా బైండ్లోడు చదువుతున్న మంత్రాల స్వరాన్ని పెంచాడు. గొంతెత్తి పఠిస్తూ బోనాన్ని ముందుకు నడిపించి, నిలబెట్టి, బోనం చుట్టు గంతులేస్తూ మంత్రాలు ఏకధాటిగా చదువుతున్నాడు. నీరసించిపోయిన పంబాలనర్సడు గోసి దగ్గర బిగిచ్చి కట్టిండు. కొడిక్కి తోడువచ్చి, బోనంచుట్టు ఎగురుతూ తనకు వచ్చిన మంత్రాలు చదవటం మొదలెట్టాడు. ఇంతలో మాష్టికిట్టయ్య మందలోంచి బయటకొచ్చి, “మీరంతా తిరిగి ఇండ్లల్లకెల్లుంబ్రి, పెండ్లి పిల్లను పిల్లగాన్ని మాత్రం ఈన్నె ఉంచి అందరు పోంబ్రి” హెచ్చరించాడు. మాదిగోళ్లంతా మారుమాట మాట్టడకుండా ఇంటిమొకం పట్టారు. రాసపెల్లి కనకయ్య కాళ్ల నరాలు తెగిపోయినట్లు నడుస్తూ వెనక్కి తిరిగాడు. అతని మెదడులోని ఊహలకు, తలపులకు అడ్డులేకుండా ఉంది. కన్నీళ్లు కండ్లను కప్పుతున్నా బలవంతంగా లోనికి గుక్కుకుంటున్నాడు. అతని పాణం విలవిలలాడుతంది. వెలుతురు లేని సూర్యుడు పడమటికొరిగి, కొండమీద చతికిలబడ్డట్లు అతడు ఓ గుండురాయిమీద కాసేపు కూతబడ్డాడు. మాష్టికిట్టయ్య నోట్లో ఉన్న చుట్టను దీసి బయట వారేసి, ఒక్కడుగు అవతలివైపేసి కాంబ్రిచ్చి ఉమ్మేసి తను కూడా మంత్రాలు చదవటం ప్రారంభించాడు. ముగ్గురు బోనం చుట్టు తిరుగుతూ మంత్రాలు చదవటం వల్ల బోనం ఎత్తుకున్న మనిషి వణుకు పుట్టింది. పెండ్లిపిల్ల పెండ్లిపిల్లగాడు కన్నార్పకుండా నోళ్లు తెరచి ముందర జరుగుతున్న దృశ్యాన్నే చూస్తున్నారు. ఆశ్చర్యంగా....

బోనం ఎత్తుకున్న మనిషి వణుకు ఎకువైంది “ఉబు,ఉబు, ఉబ.. బ్‌బ్‌బ్” అంటూ ఎదురుగా ఉన్న గుంపు మాదకి రాసాగాడు. అగ్రవర్ణల గుంపులో ఆలోచనలు బయలుదేరినై. ఏంది మనమోటనుకుంటే ఈడోటి జరిగింది. ఈ మంత్రాల మాదేగాళ్లు ఏకమయ్యారేంటి? ఈ .....లతో పెట్టుకోవద్దని అనుకొంటున్నారు. పైగా బోనం ఎత్తుకున్నోడు మనల జూత్తె ఉచ్చ బోసుకునేటోడు, మన మీదకే అత్తండు సూడు! ఇదంతా మంత్రాల మహిమ! అగొ వానికండ్లు జూడు. రెండింతలైనయి, అగో! వాని నోరు జూడు రెండింతలైంది. మహంకాళిలా... నాలుక బైట పెట్టిండు. ఇగ ఈడుంటే ఏమన్నా అయితది. ఆ మంత్రాలతో మనమేగం, ఎట్లయినా ఈ బాయిని మనమొదిలేసినం గదా!.... ఎందుకచ్చిన గొడవ అంటూ... అక్కనుంచి ఒక్కొక్కరే జారుకున్నారు.

జి.కె. కథలు

కుక్క పన్ను

"ఒరే! బర్ల బాలిగే !, సంజీవడత్తుండో సూడు'' ఆదేశించాడు సుధాకర్ రెడ్డి.

బాలిగాడు బఱ్ఱె ఉన్నట్టే ఉంటడు. భారీ కాయం. అతనికి నడవటమే కష్టం. సేర్‌దార్‌గా పని చేస్తున్నాడు. దొర మాటినంగనే తలమీది రుమాలు పేగు తీసి సంకన జొప్పిచ్చిండు. గబగబ ఉరికి గేటవుతల సూసచ్చి " అయ్యా! అత్తలేడయ్యా'' చెప్పిండు

ఏనంక (వీణవంక) సుధాకర్ రెడ్డి అంటే హడలు. ఆయన పేరింటే పీతిరి గద్దలు కూడా పిసుక పిట్టలయ్యేవి. బాలిగాడి మాట విని ఏదో పోగొట్టుకున్నోని లెక్కన బెడ్‌రూంలకు ఎల్లిండు. బెడ్‌మీద కఱ్ఱె కుక్క వెచ్చగా పండుకొని ఉంది. దానిపక్కన బోర్లా బొక్కల పండుకొన్నడు. ఎడుమ సేత్తో దాన్ని నిమిరాడు. దొర సేయి తగలంగనే కుక్క గావురాలతో అతని చేతిని నాకింది. మూతిని కూడా నాకపోతే దానిని ఎనకకు నూకిండు. అయినా దొర మూతికి కుక్క నాలుక తాకింది. కుక్క అంటించిన సొల్లును తుడ్సుకుంటా కిటికీ గుండా బయటకు సూత్తుండు.

ఈ ఆదివారం పులి సంజీవయ్య వంతు. కోళ్లను పెంచుకున్నందుకు ఒక కోడి పన్నుగా ఆ వూరి దొరకు ఇయ్యాలె. కోడితో పాటు ఒక రూపాయి ఒస్కువేయాలి. సంజీవయ్య దొరకు తనవంతు పన్నును చెల్లించటానికి ఏగిరంగానే వస్తున్నాడు. అతని సంకల ఎఱ్ఱ కోడిపుంజు ఉన్నది. దాని కాళ్లకు ఈత నారతో పేనిన నులుక తాడు కట్టి ఉంది. దాని రెండు రెక్కలు వెనకకు ఇరిచి ఒకదాని మీద ఒక రెక్కను ఏయటంతో అది ఎగరటానికి ఇబ్బందిగా ఉంది. అప్పుడప్పుడు రెక్కలను ఆడించటానికి అది ప్రయత్నం చేస్తుంది. కానీ తప్పించుకోటం దానివల్ల కావటం లేదు. సంజీవయ్య దానికి రాముడు అని పేరు కూడా పెట్టుకున్నడు. అపురూపంగా పెంచుకున్నడు. దానిని దొరకు ఇవ్వటానికి బాధగా ఉన్నా విధిలేదు. దారెంట ఎవరన్నా ఎదురైతే తిట్టుకుంటారేమోననే భయం ఉంది. ఆ భయంతోనే దారికి ఒక పక్క ఓరగా నక్కి నక్కి నడ్సుకుంట దొర గడీలను చేరుకున్నడు.

గేటుకాడ కావలి ఓరెం సర్వయ్య ఉన్నడు. ఆయన దరి చేరి "తాత దొరంగలువాలె కొంచెం లోనికి పోనియ్యి '' అడిగిండు వినయంగా.

సర్వయ్య కిందినుంచి మీద్దాక చూసిండు. "ఏందిరా! నువ్వు, గడి లోపలికి పోయి దొరను కలుత్తవ?, ఇయ్యాల్టిదాకా మా మాలోల్లె ఎవ్వడు గీ గేటు దాటలె. నువ్వు లోపలికి పోతవా? ఈపు గట్టిగుందా?'' గుండ్లురిమి చూసిండు. సంజీవయ్య మొకం తారుమారు అయింది.

"కులం దక్కువోళ్లు గలుమంటుకుంటర?!, దూరముండు, దూరముండు'' మళ్లీ దమాయించాడు సంజీవయ్య భయపడ్డడు. కానీ లోపలికి పోవాలనే పట్టుదల పెరిగింది. "వీడే గిట్ల అడ్డం పడ్డడు. ఇంక బర్ల బాలిగాడు, సాకలి మొండిగాడు ఎట్ల అడ్డం పడతరో!, లోపలికి పోనిత్తరో పోనియ్యరో?!'' అనుకుంటండు.

దొర రమ్మన్నడని చెప్పితే ఎగతాలి చేసిండు. "నిన్ను దొర రమ్మన్నడా?'' అని పగలబడి నవ్విండు. సంజీవయ్యకు బతిమిలాడటం తప్ప మరో మార్గం లేదు. బతిమిలాడిండు. సర్వయ్య కూసింతన్న కరగలేదు. గేటు లోపలికి పోనివ్వటం లేదు. ఇద్దరి మధ్య సఖ్యత కుదరటం లేదు.

"సరె, నువ్వు దెచ్చిన కోడిని నాకియ్యి. నేనే లోపలికి పోయి ఇచ్చుత్త'' సర్వయ్య అన్నడు.

సంజీవయ్యకు నమ్మబుద్ధి కాలేదు. "పోయినేడు గిట్లనే నమ్మిత్తె, కోడిపన్ను కట్టలేదని ఈపంతా సింతబరిగెలతో మండసంపిండు. ఇగ నమ్మేది లేదు మాలోళ్లను'' అని లోన అనుకున్నడు.

"తాతా! ఈ కోడి పుంజును నేనే దొరకు ఇయ్యాలె. లేకపోతే పోయినేడు కొట్టినట్టు మళ్లా కొడుతడు.''

అని గతకాలాన్ని గుర్తు చేసిండు. అది విన్న తర్వాత సర్వయ్యకు ఏమి చేయాలో అర్థం కాలేదు.

" తాత నువ్వు అచ్చే ఆదివారం కూరకాడికి అత్తవు కదా!, మాకచ్చే పోగు నీకే ఇత్త, జెర పోనియ్యి తాత, నీ దండం పెడుతా''. బతిమిలాడిండు.

పోగు కూర అనే సరికి సర్వయ్య నానిండు. పానం లేసి నిలబడ్డది. "కాదుబిడ్డా! లోపలికి దోలితె దొర ఏమన్నా అంటడో ఏమో!'' అని విచారించిండు సర్వయ్య.

సంజీవయ్య ఆలస్యం చేయకుండా "అంతలావైతే దొర నిన్నేమన్నా అంటే, దండుగైతే నేనే కట్టుకుంట, సరేనా!'' అంటూ మాటిచ్చిండు.

"ఏమిరో ఇటేడు రమ్మంటే ఇల్లంతా నాదేనన్నట్లు, మీదిమీదికత్తున్నవు, దూరం దూరం గట్ల గట్ల దూరంగా పో.. '' అని కోపంతోనే దారి చూపిండు. పూజారి కరుణించిండనుకుంటూ సంజీవయ్య లోపలికి భయం భయంగా మెల్లమెల్లగా అడుగులో అడుగేసుకుంట లోపలికి వెళ్లిండు.

గేటులోపల ఎదురైన మొండోడు "ఏమిరో సంజీవ దొర గడీలకే అచ్చినవ్, బతుక బుద్దయితలేదా ఏంది?'' అధికార దర్పంతో ప్రశ్నించిండు.

"లేదన్నా దొరను కలువాలనచ్చిన'' అన్నడు.

"దొర పండుకున్నట్టున్నది రేపు రాపో'' ఎల్లిపొమ్మన్నడు.

సంజీవయ్య సంకల కోడిపుంజు ఒక్కసారిగా ఒర్రింది. కోడికూత ఇనంగానే సుధాకర్ రెడ్డికి పానమచ్చింది. ఊరి కోళ్లంటే ఆయన మహా ఇష్టంగా తింటడు. లోపలినుండి కేకేసిండు. " ఒరే మొండోడా'' ఆన్ని రానియ్యి'' అన్నడు. అప్పటిదాకా దొర శరీరం నీరసించి సతికిల పడిపోయినట్టు ఉంది. సంజీవయ్య సంకలో కోడిపుంజు అతని పానాన్ని నిలబెట్టింది. మెల్లగా లేసి బయటి కచ్చిండు.

దొరను చూసిన సంజీవయ్య వంగి వంగి దండాలు పెట్టిండు. సంకలో కోడిపుంజు ఒక్కసారిగా రెపరెపలాడటానికి తనువంతా అటు ఇటూ గుంజుకుంటుంది. కోడిపుంజు వాటం సూత్తే దొరకు నవ్వు పెదాల మీద తేలాడింది. కోడిపుంజును దొర చేతికి అందించాడు. దొర దానిని పుచ్చుకొని "ఒక్క కోడిపుంజేనా'' అని అడుగుతూ పుంజు జుట్టును తన ఎడమచేయి చూపుడు వేలుతో మీటుతున్నడు. కోడి తలను కిందికి మీదికి విదిలించుకుంటూ ఒర్రుతంది.

"కోడి మాత్రం బ్రహ్మాండంగా ఉందిరా ! మరి పైసలెవ్వీరా?'' అని గదమాయించిండు.

సంజీవయ్య వేసుకున్న అంగి అలుకు పిడిసె. అది పద్దిక్కుల చినిగిపోయి ఉంది. పైసలు పడిపోకుండా సినిగిన అంగి జేబుకు పిన్నీసు పెట్టి ఉంది. ఆ పిన్నీసు తీసి రూపాయిన్నర లెక్కబెట్టి సుధాకర్ రెడ్డి చేతుల పోసిండు. దొర మొకంలో నవ్వు తాండవించింది.

సంజీవయ్యకు ఆ నవ్వు చూస్తే బసికుక్క నశపెట్టుకొని కూసున్నట్టుంది. "వీళ్ల బసికుక్కలు ఈ బసికుక్కల కోసం కర్రెకుక్కల్లా పనిమనుషులు''అని సంజీవయ్య పైకి నవ్వు మొకం ఉన్నా, లోపల దొరను విపరీతంగా తిడుతండు. కడుపు మంటతో అతని మొకం ఎర్రబడ్డది.

దొర సంజీవయ్య మొఖాన్ని గమనించి "ఇగవో, బయటకెల్లిపో ఎవడన్నా సూత్తడు. పో ... పో...'' అని దమాయించి బంగ్లా లోపలికి ఎల్లిండు.

సంజీవయ్య ఇంటిముఖం పట్టిండు. మొండోని మొకం సూడలేదు. కానీ మొండోడు "నవాబు నడిసినట్టు నడుత్తున్నవ్ ఎళ్లెళ్లు'' అని కసురుకున్నడు. బర్ల బాలిగాడు ఎదురై " ఏంరో, కొమ్ములచ్చినయిర, దొర ఎప్పుడు రమ్మంటె ఎపుడచ్చినవ్, నీకోసం పొద్దంత ఎదురు సూడల్నా!, మాదిగిర్కం పోనిచ్చుకోవైతివి గదర''అని పుట్టిట్టిగానే తిట్టిండు. సంజీవయ్య అడివిల జింకపిల్లయిండు.

సంజీవయ్య గడి లోపల కొద్దిసేపు నిలబడదామనుకున్నడు. కానీ సర్వయ నిలబడనియ్య లేదు. "పోతవా పోవా" అని గొడవకు దిగిండు. దొరకు కోడిపుంజు తెచ్చియ్యటం కూడా తప్పేనా అని సర్వయ్యను ప్రశ్నించిండు. సంజీవయ్య మెడమీద కట్టెపెట్టి రెండు సార్లు నూకేసినా గేటు దగ్గర నుండి కదలలేదు. సంజీవయ్యకు కోపం వచ్చింది. "నా ఇట్టం ఉన్నపుడు పోత ఏంజేసుకుంటవో సేసుకో" అన్నడు.

సుధాకర్ రెడ్డి ఇదంతా లోపలి నుండి గమనిస్తున్నాడు. 'సంజీవడు మంచి గుణవంతుడు. పట్టుదల గలవాడు. ఎర్రగా బుర్రగా అందంగా ఉన్నాడు. వాడు రాజ పుట్టుక పుట్టిండు. కేవలం మాదిగ కులంల పుట్టడమే వాడు సేసిన పెద్ద తప్పు. వానికి మాదిగ కుల క్షణాలే లేవు' అనుకుంటండు. ఏమనకుమని సర్వయ్యకు సైగ చేసిండు.

కొద్దిసేపు గోడ నీడకు నిలబడ్డడు. బాధ పడ్డడు. "సెర్ల నీళ్లు వోయి సెరనుక వడ్డయి. ఇపుడు బాధ పడటం దేనికి?" అని తనకు తానే ప్రశ్నించుకున్నడు. తొవ్వెంటి నడుస్తావుంటే అనేక రకాల ఆలోచనలు "ఈ ముట్టుడేందో, ఈ అంటుడేందో అర్థం కాదు. కోడి నేను తొక్కిన గింజలను తిన్నది. నేనేసిన ఎంగిలిని తిని బతికింది. మా పెంటలో గింజలు తవ్వుకొని బుక్కింది. మా కసువు తిని వన్నెల మెరుగును పెట్టింది. ఆ వన్నెను సూసి కోడి బ్రహ్మాండంగ ఉందిరా అంటడు. నేను పెంచిన కోడికి లేనపుడు నాకు ముట్టుడు ఎక్కనుండి వచ్చింది. నేనిచ్చిన పైసలకు కూడా అంటుడు లేదు, ముట్టుడు లేదు. ఆ పైసలు నా బొడ్లో నానినై, నా చెమటతో తడిసిన్నై, ఈ కూరను కోసిన సేతుల్లో తైతక్కలాడినై. వాటికి లేని ముట్టుడు నన్ను ముట్టుకుంటే ఎట్లా వచ్చింది?.

దొర పొలాలన్నీ మా వాడ సుట్టూ ఉన్నయి. పొలాల సూసెటానికి దొరెంట ఆళ్లు పెంచుకున్న కుక్కలచ్చేవి. అవి నేను తిని పడేసిన బొక్కలు కంకేవి. మా పిల్లలు రోడ్లపొంటి పోయిన దొడ్డికి కూడా తినేవి. అటువంటి వాటిని పక్కల పండబెట్టుకొని తలలు నిమురుతారు. వాటి మూతులు నాకుతారు. మీదెక్కించుకుంటారు. మీద పాకించుకుంటారు. మలమూత్రాలు పోత్తే ఎత్తి పోసుకుంటారు. ఇంట్లో ఆ కంపు వాసనను కూడా భరిస్తారు. వాటికి లేదు అంటుడు, ముట్టుడు. కానీ మాకు అంటు గట్టారు. ముట్టు పెట్టారు. ఈళ్లే పెద్ద బసి కుక్కలు, కక్కితే నాకే రకం కుక్కలు. వీళ్లను కాపాడటానికి వీళ్ల సుట్టూ ఊర కుక్కల్లా ఊరు కుక్కలు. ఈ ఊర కుక్కల కంటే ఈ ఊరు కుక్కలకే విశ్వాసమెక్కువ. అందుకే వాళ్ల సాటి మనుషులను మనుషులుగా చూడరు. వీరికి ఆవహించుకొని ఉన్న బానిసతనం పోతే గానీ మానవత్వాన్ని కనపరచరు. ఈ బసి కుక్కలు ఊరు కుక్కలనెగబెట్టి మా బతుకులను కుక్కల కంటే హీనం చేసారు. మేము కోళ్లను పెంచుకున్నందుకు వానికి పన్ను గట్టాలె. మరి వాడు పక్కల్ల పండవెట్టుకొని కుక్కలు పెంచుకుంటండు. వాన్ని ఎవరూ కుక్క పన్ను అడగటం లేదు. ఈ కుక్కలను ఊరినుంచి తరిమే రోజు అత్తది. అవి ఊరిడిసి పెట్టి పోయే రోజత్తది. అవి ఊరిడిన్నాడే ఈ ఊరు బాగుపడుద్ది. ఊరొదిలేసి పోకపోతే ఆ కుక్కల, ఈ బసికుక్కల సంపే రోజు తప్పకుండా అత్తది. సంపకున్నా ఆటికి పన్నుగట్టే రోజు అత్తది. " అని ఆలోచించుకుంటూ సంజీవయ్య ఇల్లు చేరుకున్నడు.

-----------×----------

డా॥. గుండెడప్పు కనకయ్య, ప్రిన్సిపాల్
యూనివర్శిటీ కాలేజ్ - 2, తెలంగాణ యూనివర్శిటీ,
బిటిఎస్, భిక్కనూర్, నిజామాబాద్ - 503102.
సెల్. 9949119609.